జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శనివారం 25 జూలై 2026 | సంపుటి: 19 | సంచిక: 140 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , ఆషాఢ మాసము , తిథి: ఏకాదశి - 11:36:40 వరకు నక్షత్రంజ్యేష్ఠ - నిండా రాత్రి వరకు కరణంవిష్టి - 11:36:40 వరకు, బవ - 24:48:56 వరకు పక్షంశుక్ల యోగంబ్రహ్మ - 21:08:49 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## బంగ్లాదేశ్ అధ్యక్షుడు రాజీనామా

**మహ్మద్ షహబుద్దీన్ సంచలన నిర్ణయం**

న్యూఢిల్లీ,జూలై24(ప్రజాజ్యోతి): బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దీన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఆయన తన అధ్యక్ష పదవికి శుక్రవారం రాజీనామా చేశారు. అనారోగ్య కారణాలతో అధ్యక్ష పదవి నుంచి వైదొలుగుతున్నట్లు మహ్మద్ షహబుద్దీన్ వెల్లడించారు. మరో రెండేళ్ల పదవీ కాలం ఉండగానే ఈ కీలక నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశమైంది. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు మద్దతుదారుడిగా మిగతా 2లో..

## ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమం

**డిజిటల్ అడ్వర్‌టైజింగ్ హబ్‌లుగా మీ సేవ కేంద్రాలు**

**చిన్న వ్యాపారాలకు అందుబాటులోకి డిజిటల్ మార్కెటింగ్ సేవలు**

హైదరాబాద్,జులై 24(ప్రజాజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ మీ సేవ ఆధ్వర్యంలో, అంతర్జాతీయంగా పేరొందిన మెటా సంస్థ సహకారంతో రాష్ట్రంలోని మీ సేవ కేంద్రాలను డిజిటల్ అడ్వర్టైజింగ్ హబ్‌లుగా తీర్చిదిద్దే వినూత్న మిగతా 2లో..

క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ఇప్పటికే లాంఛనంగా ప్రారంభించారు. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్లు నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్ నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ప్రభుత్వం తొలి విడతలో ఇందిరమ్మ ఇళ్లను నిర్మించనుంది.

# లీక్‌లపై బిల్లుకు కేబినెట్ ఆమోదం

- జైలు శిక్షలు, జరిమానాలు మరింత పెంపు!
- అక్రమ పద్ధతుల నివారణ చట్టంలో మార్పు
- కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కీలక చర్చ
- సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలి
- యువతను ఫాలో కావడం అవసరమే
- కేబినేట్ భేటీలో మంత్రులకు మోడీ సూచన



న్యూఢిల్లీ,జులై 24(ప్రజాజ్యోతి): ప్రవేశ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ ఘటనలు దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనకు కారణమవుతున్న వేళ వాటిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో పేపర్ లీక్‌లను అరికట్టే దిశగా కీలక అంశాలపై చర్చించారు. ఇప్పటికే అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టంలో సవరణలు చేసి మరింత కఠిన నిబంధనలు తీసుకురావాలని కేంద్రం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పేపర్ లీకేజీలపై కఠిన శిక్షలకు అవకాశమిచ్చే బిల్లుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రశ్నపత్రాల లీక్‌లకు పాల్పడే వ్యక్తులు, ముఠాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రధాని మోదీ ఇటీవల ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం చట్టపరమైన మార్పులపై దృష్టి సారించింది. మిగతా 2లో..

## పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

- శాశ్వత ప్రాతిపదికన పక్కాగా నిర్వహణ చేపట్టాలి
- నివేదిక కోరుతూ కేంద్రం, ఎటిఎకు సుప్రీం ఆదేశం
- సీజేపీ ఆందోళనలపై ఎలాంటి పిటిషన్లు లేవు
- వాటిని విచారించకుండా తిరస్కరించారని ఎలా రాస్తారు
- మీడియా తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన చీఫ్ జస్టిస్

న్యూఢిల్లీ,జూలై24(ప్రజాజ్యోతి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ లీక్ వ్యవహారం తర్వాత చేపట్టిన సంస్కరణల పురోగతిపై సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. పరీక్షల నిర్వహణలో తాత్కాలిక సర్దుబాట్లు కాకుండా, శాశ్వత వ్యవస్థాగత సంస్కరణలు ఎలా అమలు చేస్తున్నారో వివరిస్తూ సమగ్ర అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీలను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది. పరీక్షల వ్యవస్థలో పారదర్శకత, భద్రత పెంచేందుకు చేపట్టిన చర్యలపై 10 ప్రధాన రంగాల వారీగా వివరాలు సమర్పించాలని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. డిజిటల్ మౌలిక వసతులు, భద్రతా ప్రమాణాలు, పరిశోధన, పారదర్శకత, పరిపాలన, మానవ వనరులు వంటి అంశాలపై పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని సూచించింది. పరీక్ష జరగడానికి ముందు, పరీక్ష సమయంలో , పరీక్ష పూర్తయిన తర్వాత చేపట్టిన సంస్కరణలపై స్టేటస్ రిపోర్ట్ మిగతా 2లో..

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

- ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు కోటి పరిహారం
- విద్యార్థులపై కేసులను ఎత్తివేయాల్సిందే
- కేంద్రమంత్రులకు తేల్చి చెప్పిన సీజేపీ ప్రతినిధులు
- ఇప్పుడు మౌనం వహిస్తే.. మరెప్పుడూ ప్రశ్నించలేం
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసేవరకు వెనక్కి తగ్గం
- విద్యార్థుల భవిష్యత్ కోసమే తమ ఆందోళన
- కాక్రోచ్ పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే వెల్లడి




న్యూఢిల్లీ,జూలై24(ప్రజాజ్యోతి): నీట్ పేపర్ లీక్‌కు కేంద్రం బాధ్యత తీసుకోవాలంటూ పట్టుబడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ప్రతినిధులు కొందరు కేంద్ర మంత్రి జేపీ నడ్డా, జితేందర్ సింగ్‌లతో శుక్రవారం సమావేశమయ్యారు. నీట్ సహా విద్యా మిగతా 2లో..

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

- వరుసగా ఐదోరోజూ కొనసాగని సభ
- లోక్‌సభ సోమవారానికి వాయిదా
- రాజ్యసభలో వందేమాతరం బిల్లు
- మకరధ్వజ్ గేట్ వద్ద విపక్ష ఎంపిల ఆందోళన
- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు విపక్షాల డిమాండ్

న్యూఢిల్లీ,జూలై24(ప్రజాజ్యోతి): లోక్‌సభ, రాజ్యసభల్లో పేపర్ లీక్‌లపై చర్చ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభ ప్రారంభమైన కొద్దిసేపటికే మధ్యాహ్నం 12:00 గంటల వరకు వాయిదా పడింది. అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్టంభన కొనసాగింది. నీట్ యూజీ సహా దేశవ్యాప్తంగా చోటుచేసుకున్న పరీక్షల పేపర్ లీక్ వ్యవహారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో తీవ్ర దుమారానికి దారితీసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి మిగతా 2లో..



## నివాస ప్రాంతాల్లోనే ఇండ్లు

- దూరంగా నిర్మిస్తే నిరుపయోగమే!
- తొలి విడతలో 7680 ఫ్లాట్ల నిర్మాణం
- జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- ఓఆర్ఆర్ లోపల ప్రభుత్వ భూముల గుర్తింపు
- పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖల భూముల సేకరణ
- క్యూర్ పరిధిలో ఇళ్ల నిర్మాణంపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్,జూలై24(ప్రజాజ్యోతి): నగరంలోని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ క్యూర్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇళ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్యూర్ పరిధిలో ఇళ్లపై ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఓఆర్ఆర్ లోపల నిరుపయోగంగా ఉన్న వివిధ స్థలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలను గుర్తించినట్లు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించిన స్థలాలను తీసుకుని.. ఆయా శాఖలకు వేరే చోట కేటాయించాలని రేవంత్ ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లను జనావాసాలకు దూరంగా కేటాయిస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశముందని సీఎం మిగతా 2లో..

## తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాం కు ఫార్మా దిగ్గజాల సిఎస్ఆర్ సహకారం

శేరిలింగంపల్లి, జూలై 24 (ప్రజాజ్యోతి): విద్య పిల్లల పోషక ఆహారాన్ని మెరుగుపరిచే దిశగా ఒక అద్భుతమైన అడుగు హరే కృష్ణ మూవ్ మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ప్రముఖ సంస్థలైన దివిస్ ల్యాబొరిటరిస్ లిమిటెడ్ అరబిందో ఫార్మా లిమిటెడ్ తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా చౌటుప్పల్, సంగారెడ్డి లలో ఆధునిక సెంట్రల్ లైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ లను ఏర్పాటు చేయడంతో పాటు కొడంగల్ లోని కిచెన్ను ఆధునికరించనున్నారు. తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలలో ఆకలిని నివారించి నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిరోజు ప్రభుత్వ పాఠశాల పిల్లలకు పరిశుభ్రమైన మిగతా 2లో..

## నౌకలు, కార్గోలకు భారీ నష్టం వాటిల్లుతుంది

- ఏ నష్టానికైనా ఇరాన్ డబ్బుతోనే పరిహారం చెల్లిస్తాం
- ఇదొక న్యాయమైన, నిష్పాక్షికమైన చర్య మాత్రమే
- ట్రూత్ సోషల్‌లో డొనాల్డ్ ట్రంప్ కీలక పోస్ట్



న్యూఢిల్లీ,జూలై24(ప్రజాజ్యోతి): యూఎస్, ఇరాన్‌ల మధ్య సంఘర్షణ తీవ్రతరమవుతున్న నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇకనుంచి నౌకలు, కార్గోలకు జరిగే ఏ నష్టానికి పరిహారం చెల్లించడానికి అమెరికా తన అధీనంలో ఉన్న ఇరాన్ డబ్బును ఉపయోగిస్తుందని ప్రకటించారు. ఇదొక న్యాయమైన, నిష్పాక్షికమైన చర్య అని పేర్కొన్నారు. ఈ మేరకు ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్ట్ పెట్టారు. ఇప్పటి నుంచి నౌకలు, కార్గోలకు జరిగే ఏ నష్టానికైనా పరిహారం మిగతా 12లో..

## భారత్‌పై అమెరికా 10% సుంకాలు

- 12.5 శాతం నుంచి 10 శాతానికి తగ్గింపు
- అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ వెల్లడి

న్యూఢిల్లీ,జూలై24(ప్రజాజ్యోతి): ప్రపంచ దేశాలపై విధించే సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. వస్తువుల తయారీలో వెట్టిచాకిరీ చేసే కార్మికులను ఉపయోగిస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో భారత్ సహా 17 దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై యూఎస్ 10 శాతం సుంకాలను విధించింది. ఈ విషయాన్ని మిగతా 12లో..



## సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం

- రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరణ
- సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం
- బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి
- 20 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు
- విద్యుత్ డిమాండ్‌కు తగ్గట్లుగా ఏర్పాట్లు
- క్షేత్రస్థాయి పర్యటనలతో సమీక్షిస్తున్నాం
- భద్రాద్రి జిల్లా పర్యటనలో డిప్యూటి సిఎం భట్టి

భద్రాద్రి కొత్తగూడెం,జూలై24(ప్రజాజ్యోతి): సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయని ఆయన అన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని మిగతా 2లో..

## ఢిల్లీ ఆందోళన ముసుగులో అరచాక శక్తులు

- పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్రలు
- పోలీసులు, జర్నలిస్టులపై దాడులకు తెగించారు
- నిజమైన విద్యార్థుల చేతుల్లో రాళ్లు ఎక్కడినుంచి వచ్చాయి
- విపక్షాలు పార్లమెంట్‌కు రాకుండా ఎగదోసే కార్యక్రమం చేశాయి
- దుష్ప్రచారం చేస్తున్న 480 పాక్ సోషల్ మీడియా అకౌంట్లు సీజ్
- గతంలో పేపర్లు లీక్ అయితే వారంతా రాజీనామా చేశారా
- మీడియా సమావేశంలో బండి సంజయ్ విమర్శలు



హైదరాబాద్,జూలై24(ప్రజాజ్యోతి): ఢిల్లీలో జరిగిన ఆందోళనల్లో విద్యార్థుల ముసుగులో మతతత్వ, కమ్యూనిస్ట్ శక్తులు అరాచకం సృష్టించాయని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. అలాగే పార్లమెంట్‌పై దాడి చేసేందుకు కుట్ర కూడా చేశారని మండిపడ్డారు. అందులో భాగంగానే దేశ వ్యతిరేక నినాదాలు చేశారని ఆరోపించారు. మిగతా 2లో..

## ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ఫ్రీ-ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు

- కాళేశ్వరం బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్రానికి లేఖ
- జల్ శక్తి మంత్రిత్వ శాఖ, ఎన్‌డీఎస్‌ఏ నుంచి మార్గదర్శకాలు కోరాలి
- పూర్తి సాంకేతిక నివేదికల ఆధారంగానే తుది నిర్ణయం
- అధికారులతో సమీక్షలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్,జులై 24(ప్రజాజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భవిష్యత్ నిర్వహణపై కేంద్ర ప్రభుత్వానికి వెంటనే సమగ్ర నివేదిక పంపాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో మంత్రి మాట్లాడుతూ, జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ సూచించిన విధంగానే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు మూడు బ్యారేజీలను నీటి నిల్వ లేకుండా మిగతా 12లో..



## కాక్రోచ్ ఆందోళనలకు బీఆర్ఎస్ సంఘీభావం

**కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే**

**ఇందిరాపార్క్ ధర్నాలో కేటీఆర్ డిమాండ్**



హైదరాబాద్,జూలై24(ప్రజాజ్యోతి): ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా నిరసన చేపట్టిన విద్యార్థులపై జరిగిన దాడులు అమానుషమని కేటీఆర్ పేర్కొన్నారు. యువత జవాబుదారీతనం మిగతా 2లో..

# సంపాదకీయం

## బొద్దింకలను తేలికగా తీసుకోరాదు !

దేశంలో ఏ ఆందోళన జరిగినా దాని వెనక రాజకీయాలు ఉన్నాయని ఆరోపించడం పాలకులకు అలవాటుగా మారింది. అంతే తప్ప ఆ ఆందోళనల వెనక ఉన్న సత్యాలను గుర్తించడం లేదు. ఆక్రందనలను వినడం లేదు. ఆందోళనల వెనక ఉన్న సమస్యలను గుర్తించడం లేదు. దేశంలో కాంగ్రెస్, బిజెపిలు ఎవరు పాలకులుగా ఉన్నా జరుగుతున్నది ఇదే. రాష్ట్రాల్లో కూడా ఇదే తరహా పాలనను కొనసాగిస్తున్నారు. దేశంలో ఇప్పుడు కాక్రోచ్ జనతాపార్టీ చేస్తున్న ఆందోళనను ముందే గ్రహించి, చర్యలు తీసుకోవడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. నీట్ పేపర్ లీక్ అయిన వెంటనే పలు రకాలుగా నిరసనలు వ్యక్తం అయ్యాయి. కానీ కేంద్రం చూసీచూడనట్లు ఉంటూ వచ్చింది. తమకు తోచిన విధంగా చర్యలు తీసుకుంది. మళ్లీ పరీక్ష నిర్వహణకు షెడ్యూల్ ప్రకటించింది. అయితే ఇప్పుడు బొద్దింకల ఆందోళన వెనక కేవలం ఒక్క నీట్ పరీక్ష మాత్రమే లేదన్న సత్యాన్ని ఇప్పటికీ పాలకులు గుర్తించడం లేదు. బొద్దింకలు ఎవరన్నదాని పై ఆరా తీసి, వారి వెనక పాకిస్థాన్, అమెరికా, కాంగ్రెస్, ఆప్ ఉందన్న ఆరోపణలను ముందుకేసి, సమస్యలను పక్కన పెడుతున్నారు. కానీ బొద్దింకల వెనక ఆక్రోశం ఉంది. ఆందోళన ఉంది. ఆవేదనా ఉంది. దీనిని అర్థం చేసుకోవడంలో, పరిష్కరించడంలో పాలకులు ఏళ్లుగా విఫలం అవుతున్నారు. ఎల్‌నినో వస్తే నీటి కరువు లేకుండా చేసుకునే ఆలోచనలు కూడా పాలకులల వద్దలేదు. జలవనరులను శాశ్వతంగా ఉపయోగించుకునే ప్రణాళికలు లేవంటే వీరిని ఏమనాలి. అందుకే ఇవన్నీ కలగలిపిన నిరసనలే ఢిల్లీలో బొద్దింకల ఆందోళనలకు ప్రతిరూపంగా చూడాలి. దేశాంలో నిరాశా,నిస్పృహలో ఉన్న యువత వేదిక కోసం చూస్తోంది. బొదింకల గుంపు వెనకాల ఉండి తమ ఆందోళనల ఆజ్యాన్ని పోశారు. అంతే తప్ప వీటి వెనక ఎవరున్నారన్నది వారికి అవసరం లేదు. బిజెపి 12 ఏళ్ల పాలనలో పేరుకుపోతున్న అనేకానేక సమస్యలపై యువతలో దాగివున్న ఆగ్రహం పెల్లుబికింది. అంతకుముందు యూపిఎ పదేళ్ల పాలనలోనూ ఇలాంటి కోపమే యువతలో ఆవహించింది. దానిని బిజెపి క్యాష్ చేసుకుని అధికారానికి వచ్చింది. అధికారంలో ఉన్న వారు సమస్యలను గుర్తెరిగి పరిష్కరించడం అలవాటు చేసుకోవడం లేదు. ఎసి గదుల్లో కూర్చుని పోలీసులు ఇచ్చిన నివేదికలను ముందేసుకుని చేస్తున్న చర్చ కారణంగా ప్రజల మనస్సులను తెలుసుకోలేక పోతున్నారు. దేశంలో ధరలు పెరుగుతున్నాయి. విద్య, వైద్యం ఖరీదైనదిగా మారింది. ఆస్పత్రులు మాఫియాగా మారాయి. ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. స్కూళ్లు, కాలేజీలు లక్షల్లో ఫీజులు గుంజుతున్నాయి. నిరుద్యోగం ఏటికేడు పెరుగుతోంది. అలాగే రూపాయి విలువ పడిపోతోంది. ఇవన్నీ కూడా తక్షణం పరిష్కరించాల్సిన సమస్యలు. పాలకులు అన్నవారికి ఇవే ముఖ్యం కావాలి. కానీ సమస్యలను గుర్తించకుండా, వీటిపై ఎక్కడా మోడీ ప్రభుత్వం ఫోకస్ పెట్టిన దాఖలాలు లేవు. నాయకులు జీతాలు పెరిగాయి. అలా అనడం కన్నా పెంచేసుకున్నారు. ఎమ్మెల్యేలు, ఎంపిల జీతాలు, భత్యాలను ఇబ్బడిముబ్బడిగా పెంచుకున్నారు. కార్లు, విమాన ప్రయాణాలు అన్నీ ప్రజల డబ్బుతోనే ఎంజాయ్ చేస్తున్నారు. అధికారంలోకి రాగానే కోట్లు వెచ్చించి బంగళాలు కట్టుకుంటున్నారు. ప్రాజెకట్‌ఉల పేరుతో ప్రజాధనం వృధా చేస్తున్నారు. కమిషన్లకు కక్కుర్తి పడుతున్నారు. కానీ వీటివలల్ల ప్రజలకు మిగిలింది సున్నా. తెలివి ఉండి కాస్తా చదువుకున్న వారంతా విదేశాలకు వెళ్లిపోతున్నారు. ఇక్కడే ఉన్నవారు తిండికి లేక, ఉద్యోగం రాక, కూలీ దొరక్క అల్లాడిపోతున్నారు. చదువుకున్న వారి పరిస్తితి మరీ దయనీయంగా ఉంది. బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాత పెద్ద ఎత్తున పరిశ్రలమ స్థాపన లాంటివి జరగడం లేదు. ఉన్న పరిశ్రమలను మూసేస్తున్నారు. ఇలాంటివన్నీ కూడా నిరుద్యోగ, చదువుకున్న యువతలో అసహనం పెంచుతోంది. సర్ ప్రక్రియ లాంటిదే తీసుకుంటే చాలా క్లిష్టంగా ఉంది. చదువుకున్న వారే ఈ ప్రక్రియలో పాల్గొనడం కష్టంగా ఉంది. దేశంలో మోసాలు, దగాలు, రకరకాల ఆన్‌లైన్ మోసాలు పెరిగాయి. చట్టాలు ఉన్నా, ఉన్నవాడికే చుట్టంగా మారాయి. ప్రధాని మోడీ ప్రజలతో మమేకం అయి వుంటే ఇవన్నీ తెలిసేవి. కానీ మోడీ పార్లమెంటుకు రావడం తక్కువే. అక్కడ చర్చలో పాల్గొనడం కూడా తక్కువే. గతంలోలాగా ఇప్పుడు పార్లమెంటులో చర్చలకు అవకాశం లేకుండా పోయింది. ప్రపంచవ్యాప్తంగా నియంతృత్వ ధోరణులను వ్యతిరేకించే వారంతా రోడ్డెక్కుతున్నారు. ఆక్రమిత కాశ్మీర్ కావచ్చు, అర్జెంటీనా కావచ్చు... ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలకు దిగుతున్నారు. సమస్య చిన్నదే అని మనం అనుకుంటే సరిపోదని గుర్తించాలి. ఎందుకంటే అంతరాంతరాల్లో దాగివున్న ఆందోళనలకు, ఆగ్రహానికి ప్రతిరూపమే కాక్రోచ్ ఉద్యమం. గనులు, భూములు, ఫ్యాక్టరీల మీద ఆధిపత్యం ఉన్నవాళ్లంతా అధికారంలో ఉంటున్నారు. ఆ సంపదపై ఆధిపత్యాన్ని కొనసాగించటానికి అధికారం అడ్డం పెట్టుకుంటున్నారు. ఇలాంటి సమయాల్లో సోషల్ మీడియా ప్రజాగ్రహాన్ని కొంతమేరకు కదిలించేలా చేయగలుగుతోంది. కోట్లాది గొంతుకలను ఏకం చేస్తోంది. గతంలో ఎప్పుడూ ఇంతటి వైవిధ్య, విశాల వేదిక ప్రజలకు అందుబాటులో లేదు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించలేని పరిస్థితిని సృష్టించిన తర్వాత సోషల్ మీడియానే జననాడిగా మారుతోంది. అసమ్మతులకూ, అసంతృప్తులకూ వేదికగా మారక తప్పటంలేదు. టీవీలూ, పత్రికలూ అధికార పార్టీలకు బాకాలుగా మారిన ప్రస్తుత ప్రపంచంలో సోషల్ మీడియా ప్రజలను ఏకతాటిపైకి తెస్తోంది. అన్ని దేశాల్లోనూ యువత సోషల్ మీడియానే ఆసరాగా చేసుకుని ప్రభుత్వాలను ప్రశ్నించటం మొదలు పెట్టారు. పాలకులు చేస్తున్న తప్పులపై ఎప్పటికప్పుడు విమర్శలు చేస్తున్నారు. జవాబుదారీతనం కోసం డిమాండు చేస్తున్నారు. అలా చేయడంలో భాగంగానే నీట్‌లో జరిగిన అవకతవకలకు బాధ్యతగా కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిగిపోవాలని కోరటం ద్వారా కాక్రోచ్ పార్టీ కార్యక్షేత్రంలోకి దిగింది. పనీపాటాలేని కొందరు యువత సోషల్‌మీడియా ద్వారా అనవసరంగా యాగీ చేస్తున్నారనీ, సమాజ జీవనానికి వారు బొద్దింకలుగా మారారని సాక్షాత్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినట్లుగా వచ్చిన వార్తలు దావానలంగా మారి ఒక ఉద్యమరూపాన్ని సంతరించుకోవటం యాదృచ్ఛికం కాదు. ఇది ఓక ప్రేరణ మాత్రమే. ప్రతిపక్షాలు కూడా విశ్వసనీయత కోల్పోవడంతో యువత ఇక తామే కార్యక్షేత్రంలోకి దిగడం అన్నది కాక్రోచ్ పార్టీని చూస్తే అర్థం అవుతోంది. నైతిక బాధ్యతే లేకపోతే ప్రజాస్వామ్యానికి విలువే లేదు. ప్రజాస్వామ్యం,జవాబుదారీతనం కోసమే యువత వీధులకు ఎక్కింది. 2011 నాటి అన్నాహజారే అవినీతి వ్యతిరేక ఉద్యమం, శ్రీలంకలో ఆర్థిక సంక్షోభానికి వ్యతిరేకంగా సాగిన నిరసనలు, బంగ్లాదేశ్ విద్యార్థుల ఆందోళనలు, నేపాల్‌లో తిరుగు బాటు, కెన్యాలో జెన్‌జీ ఉద్యమం లాంటివన్నీ సోషల్ మీడియానే అధికంగా ఉపయోగించుకున్నాయి. పాలకుల అపసవ్య విధానాలపై ప్రశ్నలు తలెత్తగానే స్పందించి ఉంటే సమస్యలు రావు. బొద్దింకలు ఎన్ని మందుల కొట్టినా, పుట్టుకుని వస్తూనే ఉంటాయి. పరిష్కారం చూపనంతవరకు సమస్యలు పుడుతంటాయి.

## తెలంగాణ స్కూల్ బ్రేక్ ఫాస్ట్ ప్రోగ్రాం కు ఫార్మా దిగ్గజాల సిఎస్ఆర్ సహకారం

మొదటిపేజీ తరువాయి..

పోషక ఆహారాలతో పాటు బ్రేక్ ఫాస్ట్ అందిస్తుంది. ఆ దిశగా ఈ కార్యక్రమం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుంది. చౌటుప్పల్ లో ఆధునిక గ్రీన్ ఫీల్డ్ సెంట్రల్ లైట్స్ కిచెన్ ఏర్పాటు కోసం దివిస్ లేబరేటరీ లిమిటెడ్ రూ 12.18 కోట్ల విరాళాన్ని అందిస్తూ హెచ్ కె ఎం చారిటబుల్డే ఫౌంషన్ కు మద్దతుగా నిలిచింది. ఈ కిచెన్ ద్వారా యాదాద్రి, భువనగిరి, నల్గొండ, జిల్లాలలోని 31 మండలాలలో ఉన్న 1,234 పాఠశాలలు జూనియర్ కాలేజీలకు చెందిన 60,000 మంది పిల్లలకు పౌష్టికాహారంతో కూడిన బ్రేక్ ఫాస్ట్ అందిస్తుంది. దశలవారీగా తమ కార్యకలాపాలను సాగిస్తున్న ప్రాంతాలలోని ప్రజలకు దివిస్ ఈ విధంగా నాణ్యమైన పోషక ఆహారాన్ని చేరవేస్తుంది. రూ. 10 కోట్ల విరాళంతో అరబిందో ఫార్మా లిమిటెడ్ సంగారెడ్డిలో ఒక నూతన బ్రౌన్ ఫీల్డ్ సెంట్ర లైట్జ్ కిచెన్ ను అలాగే కొడంగల్ లోని సెంట్రల్ లైట్స్ కిచెన్ ఆధునీకరణ ను స్పాన్సర్ చేస్తుంది. దీని ద్వారా సంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట మహబూబ్నగర్ జిల్లాలలో ని 43 మండలాల్లో వ్యాపించి ఉన్న1, 264 పాఠశాలలు జూనియర్ కాలేజీ పిల్లలకు బ్రేక్ ఫాస్ట్ అందిస్తుంది. నేడు జరిగిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి సమక్షంలో మధుబాబు వైట్ ప్రెసిడెంట్ దివిస్ లేబరేటరీ లిమిటెడ్ పి శరత్ చంద్ర రెడ్డి డైరెక్టర్ అరబిందో ఫార్మా లిమిటెడ్ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఎస్ సదానంద రెడ్డి డైరెక్టర్ సి ఎస్ ఆర్ అరబిందో ఫార్మా ఫౌండేషన్ కె నిత్య నందా రెడ్డి వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ అరబిందో ఫార్మా లిమిటెడ్ కలిసి చెక్కులను హెచ్ కె ఎం చారిటబుల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీమాన్ సత్య గౌరచంద్రదాస స్వామికి అందజేశారు.

# లీక్‌లపై బిల్లుకు కేబినెట్ ఆమోదం



మొదటిపేజీ తరువాయి..

ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనలను మరింత బలోపేతం చేసి, నిందితులకు దీర్ఘకాల జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించేలా ముసాయిదా బిల్లును సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఆ అంశంపై గురువారం ప్రధాని మోదీ ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటోందని, ఇలాంటి ఘటనలను ఏ మాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. లీక్‌లకు పాల్పడిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, కేసుల విచారణను వేగంగా పూర్తి చేసే విధానాన్ని కూడా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అమల్లో ఉన్న 2024 ప్రవేశ పరీక్షల (అక్రమ పద్ధతుల నివారణ) చట్టం ప్రకారం, వ్యక్తిగతంగా ప్రశ్నపత్రాల లీక్‌కు పాల్పడిన వారిపై 3 నుంచి 5 సంవత్సరాల వరకు జైలు శిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. అదే వ్యవస్థీకృతంగా జరిగే నేరాల విషయంలో 5 నుంచి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.1 కోటి వరకు జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. అయితే, ఇటీవల చోటుచేసుకున్న పలు ప్రవేశ పరీక్షల లీక్ ఘటనల నేపథ్యంలో ఈ శిక్షలు సరిపోవడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. దీంతో జైలు శిక్షల కాలాన్ని పెంచడం, జరిమానాల మొత్తాన్ని భారీగా పెంచడం వంటి అంశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పరీక్షల నిర్వహణలో భాగమైన అధికారులు లేదా వ్యవస్థీకృత నేర ముఠాలు ప్రమేయం ఉన్న కేసుల్లో మరింత కఠిన నిబంధనలు అమలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇక, పేపర్ లీక్ కేసుల విచారణను వేగవంతం చేయడంపై కూడా కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఢిల్లీలో తొలి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కాగా, త్వరలో మరో నాలుగు కోర్టులను కూడా ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని సమాచారం. ఈ కోర్టుల్లో పేపర్ లీక్‌లకు సంబంధించిన కేసులను ఏడాది లోపే విచారించి తీర్పులు ఇవ్వాలనే లక్ష్యంతో చట్టంలో సవరణలు చేయనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇలాంటి కేసుల విచారణకు ఎక్కువ సమయం పడుతుండటంతో నిందితులకు శిక్షలు ఆలస్యమవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేగవంతమైన న్యాయ ప్రక్రియకు ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్రం నిర్ణయించినట్లు తెలుస్తోంది. యువతకు మరింతగా చేరువయ్యేందుకు కేంద్ర మంత్రులు ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో యాక్టివ్‌గా ఉండాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. శుక్రవారం కేబినెట్ సమావేశం సందర్భంగా మంత్రులకు ఈ మేరకు సూచించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఎంత మంది యాక్టివ్‌గా ఉంటున్నారని ప్రధాని మోదీ మంత్రులను ప్రశ్నించారు. ప్రస్తుతం దేశంలో యువత ఎక్కువ సమయం సోషల్ మీడియాలోనే ఉంటున్నట్టు చెప్పారు. కాబట్టి ప్రభుత్వం సోషల్ మీడియా వేదికల్లో యువతకు దగ్గరయ్యేందుకు ప్రయత్నించాలని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను సోషల్ మీడియాలో పోస్టు చేసినంత మాత్రాన సరిపోదని ప్రధాని మంత్రులకు చెప్పినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. సోషల్ మీడియాలో నేరుగా యువతతో టచ్‌లో ఉండాలని ప్రధాని సూచించారు. యువతకు మరింత దగ్గర చేసే రీల్స్ వంటి క్రియేటివ్ కంటెంట్‌ను పోస్టు చేస్తూ ఉండాలని కూడా ప్రధాని సూచించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పేపర్ లీక్ నిందితులకు కఠిన శిక్షలు విధించే ముసాయిదా చట్టంపై చర్చ సందర్భంగా ప్రధాని మోదీ ఈ సూచనలు చేసినట్టు తెలుస్తోంది. ఈ బిల్లుకు కేంద్రం ఆమోదం లభించినట్టు కూడా తెలుస్తోంది. పేపర్ లీకేజీలకు పాల్పడే వారికి 10 ఏళ్ల జైలు శిక్ష, రూ. 10 కోట్ల వరకూ జరిమానా విధించేలా నిబంధనలు రూపొందించినట్టు తెలుస్తోంది.

## పరీక్షలకు తాత్కాలిక సర్దుబాట్లు సరికాదు

మొదటిపేజీ తరువాయి..

అందించాలని ఆదేశించింది. పరీక్షా పత్రాల సురక్షిత రవాణా కోసం భారత వైమానిక దళాన్ని ఉపయోగించడంపై జస్టిస్ పి.ఎస్. నరసింహ వ్యాఖ్యానిస్తూ... ఇది ఒక తాత్కాలిక నివారణ చర్య మాత్రమే తప్ప, పరీక్షల భద్రతకు శాశ్వత పరిష్కారం కాదని స్పష్టం చేశారు. అలాగే, భవిష్యత్తులో కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానం అమలు పురోగతి, అభ్యర్థుల సమాచారాన్ని కాపాడే డేటా రక్షణ చర్యలపై వివరణ ఇవ్వాలని కోరింది. అభ్యర్థుల ధృవీకరణ కోసం 'డిజీయాత్ర' వంటి ఆధునిక సాంకేతికతలను ఉపయోగించే ప్రతిపాదనలపై స్పష్టత ఇవ్వాలని కేంద్రానికి సూచించింది. పరీక్షల పర్యవేక్షణకు సంబంధించి ప్రతిపాదించిన గవర్నింగ్ బోర్డు, నిపుణుల కమిటీలు, స్టేక్‌హోల్డర్ నామినేషన్ల ఏర్పాటు ఎంతవరకు వచ్చిందో నివేదికలో తెలపాలని ఆదేశించింది. దీనిపై స్పందించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, కోర్టు సూచించిన అన్ని అంశాలతో సమగ్రమైన తాజా అఫిడవిట్‌ను త్వరలోనే దాఖలు చేస్తామని హామీ ఇచ్చారు. దానికి ధర్మాసనం ఆమోదం తెలిపింది. ఔఇఇ÷ వంటి అత్యంత కీలకమైన జాతీయ పరీక్షల్లో సంస్కరణల అమలును కోర్టు నిరంతరం పర్యవేక్షిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అనంతరం ఈ కేసు తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేసింది.

చలో పార్లమెంట్' నిరసనల సందర్భంగా పోలీసుల తీరుపై అత్యవసర పిటిషన్ దాఖలు కాగా.. విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించిందన్న వార్తలను సీజేఐ జస్టిస్ సూర్య కాంత్ కొట్టిపారేశారు. అవన్నీ తప్పుడు కథనాలని పేర్కొన్నారు. కాక్రోచ్ జనతాపార్టీ (సీజేపీ) ఆందోళనలపై అసలు పిటిషనే దాఖలు కాలేదని అన్నారు.

## నీట్‌పై పార్లమెంట్‌లో ఆగని ఆందోళన

మొదటిపేజీ తరువాయి..

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సహా ప్రధాని నరేంద్ర మోదీ సభాముఖంగా క్షమాపణ చెప్పాలని ప్రతిపక్షం డిమాండ్ చేసింది. మరోవైపు.. పరీక్షల పేపర్ లీకేజీలను అరికట్టేందుకు కఠిన శిక్షలు విధించేలా కొత్త బిల్లును తీసుకొస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది రూపుదిద్దిన తర్వాత ఆ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతామన్నారు. ఈ విషయమై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. నీట్ అంశంపై సభలో చర్చ జరగాల్సిన అవసరముందన్నారు. మరోవైపు.. విద్యార్థులపై జులై 20న జరిగిన పోలీస్ చర్యలో పెల్లెట్ గన్స్ వినియోగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ఈ అంశాన్నీ పార్లమెంట్‌లో లేవనెత్తనున్నట్లు పార్టీ రాజ్యసభ ఉపనేత సాగరికా ఘోష్ వెల్లడించారు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం నెలకొనడంతో స్పీకర్.. లోక్‌సభను సోమవారానికి వాయిదా వేశారు. ఇదిలావుంటే వందేమాతరం గేయానికి చట్టబద్ధ రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం శుక్రవారం రాజ్యసభలో 'వందేమాతరం బిల్లు'ను ప్రవేశపెట్టింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ సభలో బిల్లును ప్రవేశపెట్టారు. ఈ గేయాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించే వారికి జైలుశిక్ష సహా ఇతర శిక్షలు విధించేలా, అలాగే గేయాన్ని పూర్తిగా ఆలపించాల్సిందేననే నిబంధనలనూ ఇందులో పొందుపరిచారు.

## నివాస ప్రాంతాల్లోనే ఇండ్లు

మొదటిపేజీ తరువాయి..

అభిప్రాయపడ్డారు. ప్రజల పని ప్రదేశాలకు దగ్గరగా.. జనావాసాల పరిధిలో ఇళ్లు నిర్మిస్తే నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలోని పలు నియోజకవర్గాల్లో ఒక్కో ప్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో ఇళ్లు నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.11 లక్షలు ఖర్చవుతుండగా, దీనిలో ప్రభుత్వం రూ. 5 లక్షల మేర సబ్సిడీని అందించనుంది. మిగిలిన రూ.6 లక్షలు లబ్దిదారుడి వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. భూమికయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో 17 నియోజకవర్గాల్లో 7,680 ప్లాట్లు నిర్మించి ఇచ్చేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం ఆదేశించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దగ్గరగా ఉండే ప్రాంతాల్లోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని పేర్కొన్నారు.

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి..

వ్యవస్థలో కీలక అంశాలపై చర్చించారు. దాదాపు గంటన్నరపాటు ఈ చర్చలు జరిగాయి. తమ డిమాండ్లను సీజేపీ లిఖితపూర్వకంగా ప్రభుత్వం ముందుంచింది. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సిందేనని సీజేపీ ప్రతినిధులు స్పష్టం చేశారు. పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంటుకు ర్యాలీ నిర్వహించిన విద్యార్థులపై పెట్టిన ఎఫ్ఐఆర్‌లను ఉపసంహరించాలని స్పష్టం చేశారు. ఇందుకు కేంద్ర మంత్రులు స్పందిస్తూ తమకు ఒక రోజు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో, రేపు మరోసారి భేటీ అయ్యేందుకు ఇరు వర్గాలు నిర్ణయించాయి. కేంద్రం మంత్రులతో సమావేశం అనంతరం సీజేపీ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. కేంద్రం ముందు 3 ప్రధాన డిమాండ్లు పెట్టామని సీజేపీ ప్రతినిధి సౌరభ్ దాస్ తెలిపారు. మూడింట్లో రెండు డిమాండ్లపై కేంద్రం సానుకూలంగా ఉందని అన్నారు. విద్యార్థులపై కేసుల ఎత్తివేతకు కేంద్రం అంగీకరించిందని తెలిపారు. మరణించిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం ఇవ్వాలని తాము కోరినట్టు చెప్పారు. మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు సంబంధించి రేపటి వరకు కేంద్రం గడువు కోరిందని సౌరభ్ దాస్ చెప్పారు.కేంద్రం, కాక్రోచ్ జనతా పార్టీ ప్రతినిధుల మధ్య చర్చలు ముగిశాయి. ఇందులో భాగంగా కేంద్రం ముందు సీజేపీ మూడు ప్రధాన డిమాండ్లను ఉంచింది. ధర్మేంద్ర ప్రధాన్ (రాజీనామా, పేపర్ లీక్‌ల కారణంగా ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం, విద్యార్థులపై కేసులు ఎత్తివేయడం వంటి డిమాండ్లు చేసినట్లు సీజేపీ ప్రతినిధులు తెలిపారు. ప్రధాన్ రాజీనామా తప్ప మిగతా రెండు డిమాండ్లకు కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు.

## సింగరేణి విస్తరణకు ప్రజా ప్రభుత్వం నిర్ణయం

మొదటిపేజీ తరువాయి..

చెప్పారు. కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పాల్గొని మాట్లాడారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిది. 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని ఆయన అన్నారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని ఆ న్నారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని చెప్పారు. ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని చెప్పారు. దీనితో ప్రభుత్వరంవ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని అన్నారు. తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు ఆయన సూచనలు చేశారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో ÷-లబెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు.

## ఢిల్లీ ఆందోళన ముసుగులో అరచాక శక్తులు

మొదటిపేజీ తరువాయి..

శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. పోలీసులు, జర్నలిస్టులపై దాడులతో పాటు అసభ్యంగా ప్రవర్తించారని వివరించారు. పోలీసుల తలలు పగిలినా ఎక్కడా ఫైరిరగ్ చేయలేదని గుర్తు చేశారు. ఈ సమయంలో 118 మంది పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. విధి లేని పరిస్థితుల్లో అరాచక శక్తులపై తప్పనిసరిగా పోలీసులు లాఠీఛార్జ్ చేయాల్సి వచ్చిందని వివరించారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల భావోద్వేగాలతో ముడిపడిన అంశమని అన్నారు. అందుకే ఈ విషయంలో అందరికంటే ప్రధాని మోదీ ఎక్కువగా బాధపడుతున్నారని చెప్పారు. పేపర్ లీక్ చేసిన నిందితులకు కఠిన శిక్ష పడేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

## కాక్రోచ్ ఆందోళనలకు బీఆర్ఎస్ సంఘీభావం

మొదటిపేజీ తరువాయి..

కోరుతోందని.. కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. యువతపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సంఘీభావం తెలుపుతూ హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద కేటీఆర్ నిరసన దీక్ష చేపట్టారు.

ఈ సందర్భంగా ఢిల్లీలో విద్యార్థులు, యువత పోరాటానికి బీఆర్ఎస్ తరఫున కేటీఆర్ సంఘీభావం ప్రకటించారు. 25 రోజులుగా ఢిల్లీలో పార్టీలకు అతీతంగా యువత పోరాడుతోందన్నారు.

## బంగ్లాదేశ్ అధ్యక్షుడు రాజీనామా

మొదటిపేజీ తరువాయి..

మహ్మద్ షహబుద్దిన్‌కు పేరుంది. ప్రస్తుత తారిక్ రెహమాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రభుత్వంలో షహబుద్దిన్ ఇమడలేకే రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. అయితే తీవ్ర అనారోగ్య సమస్యల కారణంగా బంగ్లాదేశ్ అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దిన్ తన పదవికి రాజీనామా చేశారని బంగాభవన్ ఓ ప్రకటన విడుదల చేసింది. షహబుద్దిన్ తన రాజీనామా లేఖను పార్లమెంట్ స్పీకర్ మేజర్ (రిటైర్డ్) హఫీజ్ ఉద్దీన్ అహ్మద్‌కు సమర్పించినట్లు తెలిపింది. తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నానని పార్లమెంట్‌కు సమర్పించిన రాజీనామా లేఖలో మహ్మద్ షహబుద్దిన్ పేర్కొన్నారు. తనకు గుండె జబ్బు, అధిక రక్తపోటు, మధుమేహం, మూత్రపిండాల సమస్యలు ఉన్నాయని వెల్లడించారు. గతంలో తన గుండెకు బైపాస్ సర్జరీ జరిగిందని తెలిపారు. ఇటీవల జరిపిన వైద్య పరీక్షల్లో ఆటోనామిక్ న్యూరోపతి అనే సమస్య ఉన్నట్లు తేలిందన్నారు. ఈ వ్యాధి కారణంగా అప్పుడప్పుడు తాను కాసేపు స్పృహ కోల్పోతుంటానని స్పష్టం చేశారు. ఈ అనారోగ్య సమస్యల వల్ల కలిగిన శారీరక, మానసిక అసమర్థత కారణంగా అధ్యక్ష పదవీ బాధ్యతలను నిర్వర్తించడం ఇక తనకు సాధ్యం కాదని చెప్పారు. తనకు దీర్ఘకాలిక చికిత్స అవసరమని వెల్లడించారు. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగంలోని ఆర్టికల్ 50(3) నిబంధనల ప్రకారం తాను అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.బంగ్లాదేశ్ రాజ్యాంగం ప్రకారం, అధ్యక్షుడు మహ్మద్ షహబుద్దిన్ రాజీనామా చేయడంతో కొత్త అధ్యక్షుడు ఎన్నికయ్యే వరకు పార్లమెంట్ స్పీకర్ తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు. ఆ తర్వాత రాజ్యాంగ ప్రక్రియను అనుసరించి జాతీయ పార్లమెంట్ సభ్యులు కొత్త అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. అందుకు 90 రోజుల గడువు ఉంటుంది. బంగ్లాదేశ్ కొత్త అధ్యక్షుడి ఎన్నికలో పార్లమెంట్ స్పీకర్ కీలక బాధ్యత వహిస్తారు. రాజ్యాంగంలోని 50, 54 అధికరణల ప్రకారం పార్లమెంట్ స్పీకర్‌కు అధ్యక్షుడు తన రాజీనామాను లాంఛనంగా సమర్పించిన వెంటనే కొత్త అధ్యక్షుడు ఎన్నిక ప్రక్రియ మొదలవుతుంది. ప్రస్తుతం పార్లమెంట్‌లో బీఎన్‌పీకి మెజారిటీ ఉండటంతో కొత్త అధ్యక్షుడి ఎంపికలో ఆ పార్టీ కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.బంగభవన్‌లో అధికార మార్పిడి త్వరలో జరగనుందని బంగ్లా మీడియాలో ఇటీవలే తెగ ఊహాగానాలు వెలువడ్డాయి. ఆ దేశ మీడియాలో ఎక్కువగా అధ్యక్షుడి రాజీనామాకు సంబంధించిన వార్తలు వచ్చాయి. కొన్ని మీడియా సంస్థలు అధ్యక్షుడు షహబుద్దిన్ ఆనారోగ్య కారణాల వల్ల పదవి నుంచి వైదొలగనున్నారని కథనాలు వెలువరించాయి. ఇంకొన్ని మీడియా సంస్థలు తారిక్ రెహమాన్ సర్కార్‌లో ఇమడలేకే తన అధ్యక్ష పదవికి మహ్మద్ షహబుద్దిన్ గుడ్‌బై చెబుతున్నారని పేర్కొన్నాయి. రెహమాన్ సర్కార్ తదుపరి అధ్యక్ష పదవికి క్యాబినెట్ సెక్రటరీ నసీముల్ గనీ పేరును పరిశీలిస్తోందని వార్తలు వెలువడ్డాయి. కాగా, అధ్యక్ష పదవికి ఏ సీనియర్ బీఎన్‌పీ నాయకుడినీ రెహమాన్ ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలుస్తోంది.

## ప్రభుత్వం మరో వినూత్న కార్యక్రమం

మొదటిపేజీ తరువాయి..

కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చిన్న, మధ్య తరహా వ్యాపార సంస్థలకు తక్కువ వ్యయంతో డిజిటల్ ప్రకటనల సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో క్యూర్ ప్రాంతానికి చెందిన 150 మందికి పైగా మీ సేవా విలేజ్ లెవల్ ఎంటర్‌ప్రెన్యూర్స్ పాల్గొన్నారు. మెటా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రకటనలను రూపొందించడం, వాట్సప్ బిజినెస్ ఎకౌంట్ ను క్రియేట్ చేయటం, తమ ఉత్పత్తులను ఆ ఎకౌంట్ ద్వారా ప్రచారం చేయడం, వినియోగదారులను గుర్తించడం, డిజిటల్ ప్రచార కార్యక్రమాలను నిర్వహించడం వంటి అంశాలపై వారికి శిక్షణ అందించారు. కార్యక్రమం ద్వారా కిరాణా షాప్స్, పండ్ల వ్యాపారులు, స్వీట్ షాపులు, రెస్టారెంట్లు, మెడికల్ షాపులు, ఆసుపత్రులు, పాఠశాలలు, సెలూన్లు, మెకానిక్‌లు, ఎలక్ట్రీషియన్లు,



ప్లంబర్లు, స్టార్టప్‌లు, ఎంఎస్‌ఎంఈలు, పెద్ద సంస్థలు తదితర అన్ని రకాల వ్యాపారాలు తమ సమీపంలోని మీ సేవా కేంద్రాన్ని సంప్రదించి మెటా ప్లాట్‌ఫారమ్‌లలో ప్రొఫెషనల్ డిజిటల్ ప్రకటనలను రూపొందించి ప్రచారం చేసుకునే అవకాశం పొందుతాయి. మీ సేవా నిర్వాహకులు ప్రకటనల రూపకల్పన, ప్రచార కంటెంట్ తయారీ, సరైన వినియోగదారుల ఎంపిక, ప్రకటనల ప్రచురణ తదితర అంశాల్లో పూర్తి సహాయాన్ని అందిస్తారు. దీంతో వ్యాపార సంస్థలు తమ ఉత్పత్తులు, సేవలకు మరింత ప్రచారం కల్పించుకొని, ఎక్కువ మంది వినియోగదారులను చేరటం ద్వారా వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా మీ సేవ కమిషనర్ టి. రవి కిరణ్ మాట్లాడుతూ.. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం సాంకేతికత ద్వారా పారిశ్రామికవేత్తలు, చిన్న వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తోందని అన్నారు. మెటా సంస్థకు ఉన్న ప్రపంచ స్థాయి డిజిటల్ అడ్వటంల్గ÷జింగ్ నైపుణ్యాన్ని, రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి ఉన్న మీ సేవా కేంద్రాల నెట్‌వర్క్ తో అనుసంధానం చేయడం ద్వారా ఇప్పటివరకు డిజిటల్ మార్కెటింగ్‌కు దూరంగా ఉన్న చిన్న, గ్రామీణ వ్యాపారాలకు కూడా నాణ్యమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. వినూత్న భాగస్వామ్యంతో మీ సేవా కేంద్రాలు ఇకపై కేవలం పౌర సేవలకే పరిమితం కాకుండా డిజిటల్ అడ్వటంల్గ÷జింగ్ హబ్‌లుగా రూపాంతరం చెంది, చిన్న, మధ్య తరహా వ్యాపారాల అభివృద్ధికి తోడ్పడటంతో పాటు మీ సేవ కేంద్రాలను నడిపేవారికి కూడా అదనపు ఉపాధి, ఆదాయ అవకాశాలను కల్పిస్తూ తెలంగాణ డిజిటల్ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి దోహదపడనున్నాయి.

## పండుగలు విద్యార్థుల్లో ఐక్యత, సామరస్యం, సాంస్కృతిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి

**కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. పాండురంగ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డా. జి.అనూష - మంచిర్యాల గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో భక్తిశ్రద్ధలతో బోనాల పండుగ వేడుకలు**





**మంచిర్యాల, 24, జూలై (ప్రజాజ్యోతి) :** పండుగలు విద్యార్థుల్లో ఐక్యత, సామరస్యం, సాంస్కృతిక విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. పాండురంగ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డా. జి. అనూష లు తెలిపారు .మంచిర్యాల లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర సాంప్రదాయ పండుగ అయిన బోనాల పండుగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో, ఉత్సాహంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు ప్రజల ఆయురారోగ్యాలు, శ్రేయస్సు కోసం శ్రీ మహంకాళి అమ్మవారి ఆశీస్సులు కోరుతూ ఈ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులు, పూలతో సుందరంగా అలంకరించారు. విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి బోనం సమర్పిస్తూ తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. ఆర్. పాండురంగ శర్మ, వైస్ ప్రిన్సిపాల్ డా.జి.అనూష మాట్లాడుతూ తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరా లకు చేరవేయడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. కల్చరల్ కోఆర్డినేటర్ డా.ఎం.జ్యోతి, ఎన్ఎస్ఎస్--×× కోఆర్డినేటర్ ఎస్. సత్య రాణి ఆధ్వర్యంలో అధ్యాపక బృందం కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిం చింది. అనంతరం విద్యార్థినులు జానపద గేయాలు, సంప్రదాయ నృత్యాలతో ఆకట్టుకోగా, స్మార్ట్ బోర్డు ద్వారా బోనాల పండుగ విశిష్టతపై ప్రత్యేక ప్రజెంటేషన్ ప్రదర్శించారు. భక్తి గీతాల ప్రసారంతో కళాశాల ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. విద్యార్థినులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని బోనాల వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని గౌరవించడం, సంప్రదాయాల పరిరక్షణ పట్ల విద్యార్థుల్లో మరింత అవగాహన కల్పించినట్లు తెలిపారు.

## మంచిర్యాల--హైదరాబాద్ నూతన జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలి

**- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి**
**- ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం**




**మంచిర్యాల, 24, జులై (ప్రజాజ్యోతి) :** మంచిర్యాల--హైదరాబాద్ మధ్య నూతన జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి కోరారు. కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని శుక్రవారం కలిసి ఈ మేరకు ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం మంచిర్యాల--హైదరాబాద్ మధ్య ఉన్న రాజీవ్ రహదారిపై రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరుగుతుండటంతో పాటు తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన, సురక్షితమైన రవాణా సౌకర్యం కల్పించేందుకు మంచిర్యాల--కరీంనగర్--హైదరాబాద్ మార్గంలో నూతన జాతీయ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరారు. అదేవిధంగా నాగపూర్--హైదరాబాద్ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారిని మంచిర్యాల మీదుగా నిర్మిస్తే ఉత్తర తెలంగాణ ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ప్రస్తుతం మంచిర్యాల నుంచి హైదరాబాద్‌కు చేరుకోవడానికి సుమారు ఐదు గంటల సమయం పడుతుండగా, కొత్త రహదారి నిర్మాణంతో ప్రయాణ సమయం మూడు గంటలలోపే పూర్తవుతుం దని వివరించారు. మంచిర్యాల జిల్లా నుంచి ప్రతిరోజూ వేలాది మంది విద్య, వైద్యం, ఉపాధి, వ్యాపార తదితర అవసరాల కోసం కరీంనగర్, హైదరాబాద్‌కు ప్రయాణిస్తున్నారని, వారికి వేగవంతమైన రవాణా సౌకర్యం అందించేందుకు ఈ జాతీయ రహదారి అత్యంత అవసరమని రఘునాథ్ వెరబెల్లి అ న్నారు. నూతన జాతీయ రహదారి నిర్మాణంతో సరుకు రవాణా మరింత వేగవంతమై పారిశ్రామిక, వాణిజ్య రంగాల అభివృద్ధికి దోహదపడటంతో పాటు జిల్లాలో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో మంచిర్యాల-హైదరాబాద్ నూతన జాతీయ రహదారికి తక్షణమే ఆమోదం తెలిపి నిర్మాణ పనులు ప్రారంభించాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరినట్లు తెలిపారు.

## ఓవర్‌మెన్ మోసిన్ వైఖరిపై ఆగ్రహం..

**- ఎస్ఆర్‌పీ-3 గని కార్మికుల ఆందోళన**



**మంచిర్యాల, 24, జూలై (ప్రజాజ్యోతి) :** సింగరేణి ఎస్ఆర్‌పీ-3 గనిలో జనరల్ షిఫ్ట్ ఓవర్‌మెన్ మోసిన్ వ్యవహార శైలికి నిరసనగా శుక్రవారం కార్మికులు ఆందోళన చేపట్టారు. ఉద్యోగులను అవమానకరంగా మాట్లాడటం, అసభ్య పదజాలం ఉపయోగించడం, విధుల కేటాయింపులో ఇష్టానుసారంగా వ్యవహరించడం వంటి అంశాలపై పలుమార్లు సంబంధిత అధికారులతో పాటు గని మేనేజర్ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మార్పు రాలేదని కార్మికులు ఆరోపిం చారు. కార్మికుల కథనం ప్రకారం, ఓవర్‌మెన్ మోసిన్ ఉద్యోగులను వారి విధుల వద్దే తీవ్ర పదజాలంతో దూషించడం, అభ్యంతరం తెలిపితే బెదిరింపులకు దిగడం, ఆలస్యంగా అండర్‌గ్రౌండ్‌కు వచ్చి డ్యూటీ ముగిసే సమయంలో పనులు అప్పగించడం, విధులను తరచూ మార్చడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. దీనిని ప్రశ్నించిన ఉద్యోగులతో "నా ఇష్టం.. ఎవరు ఏమీ చేయలేరు" అంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో మోసిన్‌ను డిస్ట్రిబ్యూషన్ పాయింట్ వద్దకు తీసుకువచ్చి బాధిత ఉద్యోగులకు బేషరతుగా క్షమాపణ చెప్పించాలని కార్మికులు డిమాండ్ చేశారు. క్షమాపణ చెప్పే వరకు ఆందోళన విరమించబోమని స్పష్టం చేస్తూ "మోసిన్ రావాలి.. క్షమాపణ చెప్పాలి" అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో గని మేనేజర్ కార్మికులతో చర్చించి రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మేనేజర్ హామీపై విశ్వాసంతో ప్రస్తుతం తాత్కాలికంగా ఆందోళన విరమిస్తున్నామని, అయితే హామీ అమలు కాకపోతే భారీ ధర్నాతో పాటు మరింత తీవ్ర ఆందోళనలు చేపడతామని కార్మికులు హెచ్చరించారు. ఈ ఆందోళనలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీలు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, పిట్ కార్యదర్శి మురళి చౌదరి, పిట్ ఉపాధ్యక్షుడు తౌటం మల్లేశ్, సహాయ కార్యదర్శి కారుకూరి నగేశ్, సేఫ్టీ కమిటీ సభ్యులు నరేష్, కంది శ్రీనివాస్, సాగర్‌తో పాటు మహేష్, రమేష్, రాజయ్య, భోగి గోపి, బొజ్జ రాజయ్య, బాధిత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# బాసరలో ఘనంగా బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ 50వ పుట్టినరోజు వేడుకలు






**బాసర జూలై 24 (ప్రజా జ్యోతి) :** ధర్మాబాద్ మండలం బాబ్లీ లో కేటిఆర్ పుట్టినరోజు సందర్భంగా పెద్ద ఎత్తున చెట్లు నాటే కార్యక్రమానికి పిలుపునిచ్చిన ముధోల్ నియోజకవర్గ BRS పార్టీ ఇంచార్జి కిరణ్ కొమ్రెవర్.. పార్టీ సీనియర్ నాయకురాలు పడకంటి రమాదేవి.. బాసర మండల దీ=హ పార్టీ అధ్యక్షుడు కోర్వ శ్యామ్. బిఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్ శుక్రవారం మహారాష్ట్ర పర్యటనకు వెళుతుండగా బాసర వద్ద బిఆర్ఎస్ ముధోల్ నియోజకవర్గ నాయకులు రమాదేవి, కిరణ్ కొమ్రేవార్, మండల అధ్యక్షుడు కోర్వ శ్యామ్, బి ఆర్ ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అనంతరం బాసర ఆలయంలో మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ అమ్మవారిని దర్శించుకుని,బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారక రామారావు జన్మదినం సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ఆయన పేరుపైన ప్రత్యేక కుంకుమార్చన పూజలు చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాజీ రాజ్యసభ సభ్యులు సంతోష్ కుమార్ కు అమ్మవారి చిత్రపటాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు.

# నీట్ పేపర్ లీకేజీపై కాంగ్రెస్ నిరసన

## కేంద్ర మంత్రి రాజీనామా చేయాలి




**బాసర జులై 24 (ప్రజా జ్యోతి) :** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాఠీ చార్జి చేయడాన్ని ఖండిస్తూ బాసర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించిన మాజీ సర్పంచ్ మమ్మాయి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మమ్మాయి రమేష్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజ్ వ్యవహారంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని నిరసన తెలుపుతున్న విద్యార్థులపై లాటి చార్జ్ చెయ్యడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను పకడ్బందీ చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ను బర్తరాఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ ప్రెస్ మీట్ లో నిర్మల్ జిల్లా డీసీసీ వైస్ ప్రెసిడెంట్ మమ్మాయి రమేష్,బాసర టౌన్ అధ్యక్షులు రాజేశ్వర్ దేశాయి,వఃఇ జనరల్ సెక్రెటరీ సంజీవ్ రావ్ దేష్ముఖ్,ఆత్మ డైరెక్టర్ జలీల్, 10వ వార్డు మెంబర్ నానం సాయిలు,సీనియర్ నాయకులు ఖలీల్,జంగం రాజేందర్,జ౹ం నాగరాజు, నానం నర్సయ్య, రామదాస్, భుమన్నోల్ల అశోక్,గురప్ప శంకర్,ం౹ని విక్రమ్, విశ్వనాథ్ దేష్ముఖ్,తదితరులు పాల్గొన్నారు.

# వాస్తాపూర్‌లో నూతన అంగన్వాడీ కేంద్రన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్







**వట్టోలిలో రూ.37 లక్షలతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ**

**బాసర జూలై 24 (ప్రజా జ్యోతి) :** లోకేశ్వరం మండలంలోని వాస్తాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రాన్ని ముధోల్ శాసనస భ్యులు శ్రీ పవార్ రామారావు పటేల్ ముఖ్య అతి థిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాలకు నూతన ఈజీఎస్ (EGS) (VB G RAM G) పథకం కింద కమ్యూనిటీ హాళ్లు, కళ్యాణ మండపాలను మంజూరు చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. అదేవి ధంగా చెరువుల మరమ్మతులు, లిఫ్ట్ ఇరిగేషన్ పనులను చేపట్టి సాగునీటి సౌకర్యాలను మెరుగుపరుస్తామని, మండలంలోని అన్ని ప్రధాన రహదారుల అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం వట్టోలి గ్రామంలో రూ.37 లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రభుత్వ పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. విద్యాభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, సీనియర్ నాయకులు, అంగన్వాడీ సిబ్బంది, ఉపాధ్యాయులు మరియు గ్రామస్థులు, పాల్గొన్నారు.

# జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై దాడి అమానుషం




**కేంద్ర విద్యా శాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలిఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**జన్నారం, జూలై 24 (ప్రజాజ్యోతి) :** నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ సందర్భంగా ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులపై దాడి చేయడం అమానుషమని, అందుకు కారణమైన విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర హోం మంత్రి అమిత్యాలు వెంటనే రాజీనామా చేయాలని నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ డిమాండ్ చేశారు. జన్నారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు నిర్వహించిన ధర్నాలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు పటేల్ మాట్లాడుతూ మంచి ఉన్నత చదువులు చదువుకొని దేశానికి,ప్రజలకు సేవ చెయ్యాలనే ఉద్దేశంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు కష్టపడి చదివితే కేంద్ర ప్రభుత్వం చేతకాని పాలకులు నీట్ పేపర్ లీక్ చేసి అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నీట్ పేపర్ లీక్ కి నిరసనగా వేలాది మంది విద్యార్థులు డిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుత ధర్నా చేస్తుంటే, కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల సమస్యల పట్ల చర్చించకుండా వారి దౌర్జన్యంగా పోలీసులతో లాఠీచార్జ్ చేయించి, విద్యార్థుల ప్రాణాలకు హాని కలిగించారు. వారికి మద్దతుగా నిలిచేందుకు నిరసన తెలిపిన లోక్ సభ ప్రతి పక్ష నేత రాహుల్ గాంధీ ని అక్రమంగా అరెస్ట్ చేసి, వారి ముక్కులో నుండి రక్తం వచ్చేలా గాయపరచడం అప్రజాస్వామికం అన్నారు.విద్యార్థుల నిరసనకు మద్దతుగా నిలిచేందుకు ధర్నాలో పాల్గొన్న జన్నారం మండల విద్యార్థులను అభినందించారు. నీట్ పరీక్ష పేపర్ లీక్ వల్ల మరణించిన విద్యార్థుల కుటుంబాలకు నష్ట పరిహారం ఇవ్వాలి అన్నారు.దేశ వ్యాప్తంగా అన్ని విద్యార్థి సంఘాలు నిరసనలు తెలుపుతూ విద్యార్థులకు మద్దతుగా నిలుస్తుంటే మన రాష్ట్రంలో బిఆర్ఎస్ నాయకులు మాత్రం దావత్‌లు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నందు నాయక్, మేకల మాణిక్యం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ ఫసి ఉల్లా, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి సోహైల్ షా, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు కుదిరే వెంకట్, జిల్లా నాయకులు ముజాఫర్ అలీఖాన్, సయ్యద్ ఇసాక్,మాజీ ఎంపీటీసీ మహ్మద్ రియజోద్దీన్,మోసిన్ ఖాన్, పట్టణ అధ్యక్షుడు మంద రాజేష్, కాంగ్రెస్ నాయకులు, ఎన్.ఎస్.యు.ఐ, యూత్ కాంగ్రెస్ నాయకులు, పలు గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ ఉద్యోగులకు కూడా రూ.1 కోటి ప్రమాద బీమా వర్తింపు - ఏఐటీయూసీ అధ్యక్ష ,కార్యదర్శులు


వి. సీతారామయ్య  కొరిమి రాజ్ కుమార్

**మంచిర్యాల, 24, జూలై (ప్రజాజ్యోతి) :** సింగరేణి సంస్థ పరిధిలోని సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీలో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా కార్పొరేట్ సాలరీ అకౌంట్ ద్వారా అందించే రూ.1 కోటి యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ కవర్ వర్తించేలా సంబంధిత బ్యాంకులు అంగీకరించినట్లు ఏఐటీయూసీ సింగరేణి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ లు తెలిపారు. వారు మాట్లాడుతూ, కార్పొరేట్ సాలరీ అకౌంట్ కలిగిన ఉద్యోగి ప్రమాదవశాత్తు మరణించిన పక్షంలో సంబంధిత నిబంధనల ప్రకారం అతని కుటుంబానికి రూ.1 కోటి ప్రమాద బీమా ప్రయోజనం అందే విధంగా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీలోని ఉద్యోగులకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు వారి కుటుంబాలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని తెలిపారు. అదేవిధంగా, సింగరేణి సూపర్ బజార్లో పనిచేస్తున్న ఉద్యోగులకు కూడా ఇదే తరహా రూ.1 కోటి ప్రమాద బీమా సౌకర్యం వర్తించేలా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ యాజమాన్యం మరియు సంబంధిత బ్యాంకులతో చర్చలు జరుపుతూ నిరంతరం కృషి చేస్తోందని వెల్లడించారు. సింగరేణి సంస్థ పరిధిలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగికి సమాన సంక్షేమ సౌకర్యాలు, భద్రతా పరిరక్షణ, ఆర్థిక రక్షణ కల్పించడమే ఏఐటీయూసీ లక్ష్యమని వారు స్పష్టం చేశారు. ఉద్యోగుల హక్కులు, భద్రత, సంక్షేమం కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్ గౌడ్ - ఎంపీడీవో దేవేందర్




**బాసర జూలై 24 (ప్రజా జ్యోతి) :** బాసర పేదల సొంతింటి కల నిజం చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ అడుగులు వేస్తుంది.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్లు... అర్హులైన అందరికి ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తాం..: బాసర సర్పంచ్ వెంకటేష్ గౌడ్.. బాసరకు చెందిన లబ్ధిదారులు నర్వాడే వనిత ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించిన సర్పంచ్ వెంకటేష్ గౌడ్, ఎంపిడిఓ దేవేందర్, ఈవో ప్రసాద్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దయాల లక్ష్మణ్ రావు, నాయకులు రాజు దేశాయ్, శ్యామ్ పటేల్, పుట్టి గంగాధర్ ఇతర నాయకులు.

## రీ సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**




**మంచిర్యాల, 24, జూలై (ప్రజాజ్యోతి) :** ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపనున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం నెన్నెల మండలం చిన్న వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మండల తహసీల్దార్ శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్న ఆయన రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూముల సర్వే, రీ సర్వే ద్వారా భూ వివాదాలు తగ్గి, భవిష్యత్తులో స్పష్టమైన భూ రికార్డులు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలు తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామంలోని ప్రతి భూమికి హద్దులు నిర్ధారించి ప్రభుత్వ భూములను కూడా స్పష్టంగా గుర్తిస్తామని అన్నారు. పట్టా ఉండి మోకాలో నమోదు కాని భూములు, మోకాలో ఉండి పట్టా లేని భూముల విషయంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని, ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సర్వే అనంతరం సమగ్ర మ్యాపింగ్ నిర్వహించడం ద్వారా భూ సమస్యల పరిష్కారం సులభమవుతుందని, భవిష్యత్తులో న్యాయపరమైన వివాదాల పరిష్కారానికి కూడా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని, అవసరమైన వారికి నోటీసులు జారీ చేసి న్యాయబద్ధంగా రావాల్సిన భూములను అందజేస్తామని చెప్పారు. కబ్జాదారుల జాబితా రూపొందించి, పట్టా భూముల సర్వే అనంతరం రికార్డులను సరిచూసి సర్వే నెంబర్ల ప్రకారం హద్దులను ఖరారు చేస్తామని తెలిపారు. మ్యాపింగ్ పూర్తయిన తర్వాత మార్పులు కష్టతరమవుతాయని, భూములకు సంబంధించిన వివరాలను ముందుగానే స్పష్టంగా నమోదు చేసుకోవాలని ప్రజలకు సూచించారు. సర్వేయర్లు, ప్రజల సహకారంతో రీ సర్వే వేగవంతంగా పూర్తవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతకుముందు నెన్నెల మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ, సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తుల పరిష్కారాన్ని సమీక్షించారు. భూసంబంధిత దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సాదా బైనమా దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి వేగంగా పరిష్కరించాలని సూచించారు.

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ దాదాపు 90 శాతం పూర్తయిందని, మిగిలిన ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజల వద్ద ఉన్న ఎన్యుమరేషన్ ఫారాలను బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్ల సమన్వయంతో సేకరించి యాప్‌లో ఖచ్చితమైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. చిన్న వెంకటాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, రిజిస్టర్లు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని, వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా బోధన నిర్వహించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించిన ఆయన ఒక ఉపాధ్యాయుడు గైర్హాజరైనట్లు గుర్తించి కారణాలు తెలుసుకుని, సెలవు పత్రం లేకుంటే షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, పోషకాహారం నాణ్యతను పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవన పనులను పరిశీలించి వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత సర్పంచ్, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అడ్డాకల్ మండలంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పర్యటన

- పొన్నకల్ గ్రామంలో రీ-సర్వే పనుల పరిశీలన

మహబూబ్‌నగర్, జూలై 24 ( ప్రజా జ్యోతి బ్యూరో ): మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా శుక్రవారం అడ్డాకల్ మండలంలో పర్యటించి, పొన్నకల్ గ్రామంలో జరుగుతున్న నాన్-కెడస్టల్ భూముల రీ-సర్వే పనులను పరిశీలించారు. అనంతరం అడ్డాకల్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి, మీ సేవ, సాధారణ దరఖాస్తులకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లపై సమీక్ష నిర్వహించారు. ముందుగా పొన్నకల్ గ్రామాన్ని సందర్శించిన కలెక్టర్, గ్రామంలో జరుగుతున్న రీ-సర్వే పనులు, గ్రామ సరిహద్దుల నిర్ధారణ ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పొన్నకల్-రాచాల గ్రామాల మధ్య ఉన్న సరిహద్దు రేఖ (బౌండరీ లైన్) రీ-సర్వే ప్రక్రియను మ్యాప్ ద్వారా ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా రాచాల, పొన్నకల్ గ్రామా ల రైతులు, గ్రామస్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. రీ-సర్వే ప్రక్రియను పూర్తిస్థాయి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని, గ్రామస్థుల సహకారంతో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రీ-సర్వే సందర్భంగా తలెత్తే సాంకేతిక సమస్యలు, గ్రామస్తుల సందేహాలను వెంటనే నివృత్తి చేసి, పూర్తి అవగాహన కల్పిస్తూ ఎలాంటి వివాదాలకు



తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్, ఆలయం ముందు శిథిలావస్థకు చేరుకున్న కోనేరును పరిశీలించారు. కోనేరును పునర్నిర్మించాలని గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు చేసిన విజ్ఞప్తిపై స్పందించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించి సాధ్యాసాధ్యాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తరువాత అడ్డాకల్ తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి, మీ సేవ, సాధారణ దరఖాస్తులకు సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిశీలించిన కలెక్టర్, ముఖ్యంగా 60 రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించి ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్‌తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ (అండర్ ట్రైనీ) సాయి శివాని, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ అశోక్, అడ్డాకల్ తహసీల్దార్ కె. శేకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీతో కలిసి రండి

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 24 (ప్రజా జ్యోతి): ఉమ్మడి పాలమూరు జిల్లాలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా పార్లమెంట్ కోఆర్డినేటర్ మెడ రామకృష్ణ ఆధ్వర్యంలో జనసేన పార్టీ ముఖ్య నాయకుల, కార్యకర్తలతో సమావేశం నిర్వహించనున్నట్లు మఖ్తల్ జనసేన పార్టీ ఇంచార్జ్,మహబూబ్ నగర్ జిల్లా నాయకులు డాక్టర్ మణికంఠ గౌడ్ తెలిపారు.



శుక్రవారం పాలమూరు జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ పాలమూరు జిల్లా కోఆర్డినేటర్ మెడ రామకృష్ణ అధ్యక్షతన ఉమ్మడి పాలమూరు జిల్లాలో గ్రామస్థాయి నుంచి పార్టీని ఏ విధంగా బలోపేతం చేయాలన్న దానిపై జనసేన పార్టీ జిల్లాల ఇన్చార్జిలు ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మఖ్తల్ జనసేన పార్టీ ఇంచార్జ్,మహబూబ్ నగర్ జిల్లా నాయకులు డాక్టర్ మణికంఠ గౌడ్ మాట్లాడుతూ ఆగస్టు ఒకటవ తేదీన ఉమ్మడి పాలమూరు జిల్లా కేంద్రంలో ఉమ్మడి జిల్లాలో జనసేన పార్టీ బలోపేతమే లక్ష్యంగా నిర్వహించనున్న ప్రత్యేక సభ కార్యక్రమానికి రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు ముఖ్య అతిథులుగా ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గాల పార్టీ ముఖ్య నాయకులు,వీర మహిళలు, జనసైనికులు,పార్టీ శ్రేణులు పాల్గొంటారని, కార్యక్రమంలో ముందుగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద అమరులకు ఘనంగా నివాళులర్పించి అక్కడి నుండి భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆగస్టు ఒకటవ తేదీన నిర్వహించే భారీ ర్యాలీ ద్వారా పాలమూరు జిల్లాలో జనసేన పార్టీ తన ఉనికిని, ప్రజా బలం మరియు సేవా సంకల్పాన్ని ప్రజలకు చాటుతూ జనసైనికులు ముందుకు సాగుతారన్నారు. అంతేకాదు ఉమ్మడి పాలమూరు జిల్లాలో మేడా రామకృష్ణ నాయకత్వంలో జనసేన పార్టీ బలోపేతం దిశగా వెళ్తుందని, బలోపేతం ఒక్కటే కాదు ఇక నుండి మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం వేదికగా జనసేన పార్టీ సిద్ధాంతాలను పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకు వెళుతూ ప్రజల సమస్యలపై జనసేన పార్టీ పోరాడుతుందని ఆయన అన్నారు. కావున ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో ఆగస్టు 1న నిర్వహించే జనసేన పార్టీ ప్రత్యేక సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఇంచార్జ్ పిఆర్ రాఘవేందర్,రాష్ట్ర విద్యార్థి విభాగం సభ్యులు భరత్ రాజ్,నాగర్ కర్నూల్ నాయకులు వంగ లక్ష్మణ్ గౌడ్,రాష్ట్ర విద్యార్థి విభాగం సభ్యులు కల్వకుర్తి నాయకులు ముకురాల కృష్ణ,దేవరకద్ర నాయకులు రవీందర్ గౌడ్,మహబూబ్ నగర్ వీర మహిళా శ్రీవల్లి తదితరులు పాల్గొన్నారు.

## నేడు బండ తిరుమలయ్య స్వామివారి స్పర్శ దర్శనం

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, జులై 24 (ప్రజా జ్యోతి): నారాయణపేట జిల్లా మఖ్తల్ పట్టణంలోని ఖానాపురం రోడ్డు తిరుమలయ్య చెరువు సమీపంలో బీమా కెనాల్ కాలువ పక్కన కొలువైన అతి పురాతనమైన సంతాన, వివాహ కారకుడైన భక్తుల కొంగుబంగారంగా పేరొందిన స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి దివ్య క్షేత్రంలో ఈ రోజు చాతుర్మాస్య ప్రారంభ దినమైన ఆషాడ తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి విష్ణు సహస్రనామంతో తులసి అర్చన, విశేష పంచామృతము పుష్పార్చన, చతుర్వేద పారాయణం మొదలగు ప్రత్యేక కార్యక్రమాలతో పాటు



తొలి ఏకాదశి సందర్భంగా ఉదయం 7-00 నుండి భక్తులకు స్వామివారి స్పర్శ దర్శనం కనిపించడం జరుగుతుందని కావున భక్త మహాశయులు అత్యంత పురాతనమైన స్వామి వారి పూజ కార్యక్రమంలో పాల్గొని స్వయంభూ శ్రీ బండ తిరుమలయ్య స్వామి అనుగ్రహానికి పాత్రులు కాగలరని ఉడుపి పేజావర మఠం తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ ధర్మ ప్రచార కార్యదర్శి విద్వాన్ కె. రాఘవేంద్ర చార్యులు తెలిపారు.

# 'పోయింది' అనుకున్న ఫోన్... 'దొరికింది'

- వనపర్తి పోలీసుల మరో ఘనత.. పోలీసులపై పెరిగిన నమ్మకం
- రూ.65 లక్షల విలువ 236 మొబైళ్ల రికవరీ.. బాధితుల ముఖాల్లో ఆశ్చర్యం
- సీఈఐఆర్‌తో బాధితుల ముఖాల్లో చిరునవ్వులు

వనపర్తి, జూలై 24 (ప్రజాజ్యోతి): పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను ఆధునిక సాంకేతికతతో గుర్తించి బాధితులకు తిరిగి అందజేయడంలో వనపర్తి జిల్లా పోలీసులు మరోసారి ప్రతిభ చాటారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన 'మొబైల్ ఫోన్ రికవరీ మేళా'లో సుమారు రూ.65 లక్షల విలువైన 236 మొబైల్ ఫోన్లను బాధితులకు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజల కష్టార్జిత ఆస్తిని తిరిగి వారికి చేర్చడం పోలీసుల బాధ్యత మాత్రమే కాకుండా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే కర్తవ్యమని అన్నారు. సీఈఐఆర్ వ్యవస్థను సమర్థంగా వినియోగించడం ద్వారా పోయిన, చోరీకి గురైన మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అందిస్తున్నామని తెలిపారు. ప్రత్యేక రికవరీ బృందాలను ఏర్పాటు చేసి నెల రోజుల వ్యవధిలో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ రాష్ట్రాల నుంచి ఈ మొబైల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేసినట్లు వెల్లడించారు. రికవరీ చేసిన ఫోన్లలో తెలంగాణ నుంచి 196, ఆంధ్రప్రదేశ్ నుంచి 15, కర్ణాటక నుంచి 8, మహారాష్ట్ర నుంచి 9, మధ్యప్రదేశ్ నుంచి 6, కేరళ



నుంచి 2 మొబైల్ ఫోన్లు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకు 500 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని, మొబైల్ పోగొట్టుకున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో లేదా సీఈఐఆర్ పోర్టల్లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. ఫిర్యాదు కోసం ఎలాంటి చలాన్లు చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్లలో వ్యక్తిగత సమాచారం, బ్యాంకు ఖాతాలు, డిజిటల్ చెల్లింపుల వివరాలు, సోషల్ మీడియా అకౌంట్లు వంటి కీలక సమాచారం ఉంటుందని, ఫోన్ పోయిన వెంటనే సీఈఐఆర్‌లో బ్లాక్ చేయించుకోవాలని ఎస్పీ సూచించారు. సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే వారు తప్పనిసరిగా విక్రేత నుంచి రసీదు తీసుకోవాలని, దొంగిలించిన ఫోన్లు కొనుగోలు చేసినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బాధితుల ముఖాల్లో చిరునవ్వులు.. పోలీసులకు కృతజ్ఞతలు.. పోయిన మొబైల్ ఫోన్లు తిరిగి దొరకవని భావించిన బాధితులు వాటిని తిరిగి అందుకోవడంతో ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీతో పాటు రికవరీ బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. రికవరీ బృందానికి ఎస్పీ ప్రశంసలు.. నగదు బహుమతి మొబైల్ ఫోన్ల రికవరీలో ప్రతిభ కనబరిచిన సీసీఎస్ సీఐ పవార్ అశోక్ కుమార్, ఎస్సై రామరాజు, ఏఎస్సై తిరుపతి రెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఎస్పీ నగదు బహుమతులతో అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, సీసీఎస్ సీఐ పవార్ అశోక్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, వనపర్తి, కొత్తకోట, ఆత్మకూరు సీఐలు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిబద్ధతతో పనిచేసి విద్యలో జిల్లాను ముందంజలో నిలపాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల జూలై 24(ప్రజా జ్యోతి ప్రతినిధి): ఉపాధ్యాయులు నిబద్ధతతో పనిచేసి విద్యారంగంలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.ప్రభుత్వ ఉపాధ్యాయుల కోసం దశలవారీగా నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ టీచర్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ గద్వాలలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా కొనసాగుతోంది.శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు.ఉపాధ్యాయులు వివిధ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని తమ బోధనా నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని సూచించారు.బోధన-అభ్యసన పద్ధతులను సమర్థంగా వినియోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధిస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు.చదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక పునఃశ్చరణ తరగతులు నిర్వహించాలని సూచించారు.ప్రతి తరగతిలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉంటే,ఒకరు పాఠాలు బోధిస్తుండగా మరొకరు విద్యార్థుల అభ్యసన విధానాన్ని గమనించడం ద్వారా బోధన మరింత ప్రభావవంతంగా ఉంటుందని పేర్కొన్నారు.ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యాలను పెంపొందించేలా బోధన సాగించాలని తెలిపారు. దీనివల్ల భవిష్యత్తులో వివిధ పోటీ పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబర్చి





ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశాలు పెరుగుతాయని అన్నారు.ఏఐ(కృత్రిమ మేధస్సు)వంటి ఆధునిక సాంకేతికతను బోధనలో వినియోగించి పాఠాలను మరింత ఆకర్షణీయంగా,ప్రభావవంతంగా బోధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు.గత ఏడాది కూడా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించామని గుర్తుచేస్తూ,ఆ శిక్షణలో నేర్చుకున్న అంశాలను తమ పాఠశాలల్లో ఎంతవరకు అమలు చేస్తున్నామో ప్రతి ఉపాధ్యాయుడు ఆత్మపరిశీలన చేసుకోవాలని అన్నారు.విద్యార్థులు బట్టీ విధానానికి పరిమితం కాకుండా పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ అభ్యసిస్తే ఎక్కువకాలం గుర్తుంచుకొని పరీక్షల్లో మెరుగైన ప్రతిభ కనబరుస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి మైఖేల్,శిక్షకులు గోపాల్,ఆంజనేయులు, వెంకటేశ్వర్లు,శ్రీదేవి,పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రేణుకాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతుల సత్కారంతో విద్యార్థుల్లో ఉత్సాహం

- ప్రతిభను ప్రోత్సహించిన హరిజనవాడ జెడ్పీహెచ్ఎస్

వనపర్తి, జూలై 24 (ప్రజాజ్యోతి): ఆస్తుల కంటే విజ్ఞానమే గొప్పదని, విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. వనపర్తి పట్టణంలోని హరిజనవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన నగదు ప్రతిభ ప్రోత్సాహక పురస్కార మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, న్యాయవాదులుగా ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2026 ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 566 మార్కులు సాధించి మహబూబ్‌నగర్ ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన నజీరా, అలాగే కరీంనగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్న కృతికకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను కూడా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర చంద్రశేఖర్ మాట్లాడుతూ కృతిక ఉన్నత విద్యకు తన బాల్యమిత్రుడు ఆత్మకూరు బాలవర్ధన్ రెడ్డి గత ఏడాది రూ.20 వేల ఆర్థిక సహాయం అందించగా, ఈ ఏడాది మరో రూ.50 వేల సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పట్టుదలతో కృషి చేస్తే లక్ష్యాలను సాధించవచ్చని కృతిక విద్యార్థులకు సూచించింది. తనకు సహకరించిన బాలవర్ధన్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపింది. నజీరా మాట్లాడుతూ ఉపాధ్యాయులు, తల్లి అందించిన ప్రోత్సాహమే తన విజయానికి కారణమని పేర్కొంది. ఈ సందర్భంగా 18వ వార్డు కౌన్సిలర్ గంధం మదన్ గతంలో ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. అలాగే సీనియర్ ఉపాధ్యాయుడు వాకిట రవికుమార్ తన తండ్రి వాకిట కృష్ణయ్య జ్ఞాపకార్థం రూ.10 వేలు, అరవింద్ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.10 వేలు అందజేశారు. 500కు పైగా మార్కులు సాధించిన అబ్దుల్ ఆదిల్, భార్గవి, భానుప్రకాశ్, జయచంద్ర, జ్ఞానేశ్వరి విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ తరఫున రూ.1,000, ఆత్మకూరు బాలవర్ధన్ రెడ్డి తరఫున మరో రూ.1,000 చొప్పున మొత్తం రూ.2 వేల ప్రోత్సాహక నగదు అందజేశారు. కార్యక్రమంలో ఏసీజీ అండ్ జీహెచ్ఎం గణేష్ కుమార్, సామాజిక కార్యకర్తలు గంధం నాగరాజు, భోజరాజు వెంకటేష్, విశ్వంబాబు, శంకర్ గౌడ్, బైరవ చంద్రశేఖర్, శ్రీనివాసులు, మహిపాల్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆరుతడి పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలి:కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ఆగస్టు 15లోగా విద్యార్థులకు ఏకరూప దుస్తుల పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

గద్వాల జూలై 24(ప్రజా జ్యోతి): ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో రైతులు ఈ ఖరీఫ్ సీజన్‌లో ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించేలా వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు.అలాగే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఏకరూప దుస్తులను నాణ్యతతో సకాలంలో కుట్టించి ఆగస్టు 15లోగా పంపిణీ పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాద్ నుంచి ఏకరూప దుస్తుల పంపిణీ,వర్షపాతం, వ్యవసాయ పరిస్థితులపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు.రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థులకు నిబంధనల ప్రకారం యూనిఫాంలను కుట్టించి ఆగస్టు 15లోగా అందించాలని సూచించారు.అలాగే ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గిన నేపథ్యంలో పంటల సాగు పరిస్థితులను సమీక్షించారు.ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు మండలాల వారీగా రైతులకు ఉపయోగపడేలా విత్తన మేళాలను







నిర్వహించాలని ఆదేశించారు.గద్వాల ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అధికారులు పాల్గొన్న ఈ సమావేశం అనంతరం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో యూనిఫాంలు కుట్టిస్తున్నందున వారికి అవసరమైన సామగ్రిని సకాలంలో అందించాలని సూచించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా నాణ్యమైన కుట్టు పనులు చేపట్టాలని ఆదేశించారు.జిల్లాలోని ప్రతి మండలంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య, వారికి అవసరమైన ఏకరూప దుస్తుల వివరాలను అధికారులతో సమీక్షించారు.జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెరిగేలా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే అన్ని శాఖలకు సంబంధించిన మండల, గ్రామస్థాయి కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు,జిల్లా విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి ,జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్,డీఆర్‌డీఓ ముషాహిదా బేగం,జిల్లా వ్యవసాయ అధికారి వీరప్ప,సీపీఓ పాపయ్య,జిల్లా మహిళా సంక్షేమ అధికారి సునందతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15లోగా విద్యార్థులందరికీ యూనిఫాం

- ప్రతి విద్యార్థికి రెండు జతల దుస్తులు.. నాణ్యతకు ప్రాధాన్యం
- ఎల్‌నినో ప్రభావంతో వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి
- అధికారులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాలు



వనపర్తి ప్రతినిధి, జూలై 24 (ప్రజాజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, మోడల్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులందరికీ ఆగస్టు 15లోగా కనీసం ఒక జత, ఆగస్టు 25లోగా రెండో జత ఏకరూప దుస్తులు అందజేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. విద్యార్థుల కొలతలకు అనుగుణంగా నాణ్యమైన దుస్తులు కుట్టించి పంపిణీ చేయాలని సూచించారు. విద్యార్థుల యూనిఫాంల పంపిణీపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 512 ప్రభుత్వ పాఠశాలల్లో 38,653 మంది, 15 కేజీబీవీల్లో 4,531 మంది, 3 మోడల్ స్కూళ్లలో 1,919 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంల పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇందుకోసం 358 మంది స్వయం సహాయక సంఘాల టైలర్లకు శిక్షణ ఇచ్చి, మండలాలకు చేరిన వస్త్రాన్ని దశలవారీగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. వ్యవసాయ శాఖ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగుపై పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటల సాగుకు మొగ్గు చూపాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కందులు, నువ్వులు, వేరుసెనగ వంటి పంటలను ప్రోత్సహించాలని, అవసరమైన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కూరగాయల సాగును కూడా విస్తరించేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్, ఇన్‌చార్జి డీఈఓ యాదయ్య, డీఆర్‌డీఓ ఉమాదేవి, వ్యవసాయ శాఖ అధికారి ఆంజనేయులు, ఉద్యానవన శాఖ అధికారి విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల పిలుపుతో పర్వతగిరిలో విద్యాసంస్థల బంద్

- లాఠీచార్జిని ఖండించిన విద్యార్థి నాయకులు
- నీట్ పేపర్ లీకేజీపై కేంద్ర మంత్రికి రాజీనామా డిమాండ్



**పర్వతగిరి, జూలై 24 (ప్రజాజ్యోతి) :** రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు పర్వతగిరి మండల కేంద్రంలో శుక్రవారం విద్యాసంస్థలు బంద్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు ర్యాలీ చేపట్టి అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్వేరో నాయకుడు గారె జయరాజ్ మాట్లాడుతూ, విద్యార్థులపై జరిగిన లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా వారిపై బలప్రయోగానికి దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. విద్యార్థుల ఉద్యమానికి ప్రజలు, ప్రజాసంఘాలు మద్దతుగా నిలవాలని పిలుపునిచ్చారు. అలాగే నీట్ పరీక్ష పేపర్ లీకేజీ వ్యవహారంపై నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి తక్షణమే రాజీనామా చేయాలని విద్యార్థి నాయకులు డిమాండ్ చేశారు. విద్యా వ్యవస్థలో పారదర్శకతను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ఎస్‌యూఐ నాయకులు కందికట్ల అనిల్, భూక్య విజేందర్, స్వేరో నాయకులు కందికట్ల ప్రవీణ్, గారె జయరాజ్, యువజన నాయకులు పృథ్వి గౌడ్, మూడు దేవరాజ్, విద్యార్థి నాయకులు గౌతమ్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

### వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ



**మంగపేట, జూలై 24(ప్రజాజ్యోతి) :** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్)జన్మదినాన్ని పురస్కరించుకుని మంగపేట మండల బిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు కుదుముల లక్ష్మి నారాయణ ఆధ్వర్యంలో మంగపేట మండల కేంద్రంలోని కస్తూర్బా వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించి, వృద్ధాశ్రమంలోని వృద్ధుల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కుదుముల లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, కేటీఆర్ గారు ప్రజాసేవకు, యువత అభ్యున్నతికి ఎల్లప్పుడూ కృషి చేస్తున్న నాయకుడని, ఆయన ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజ సేవే నిజమైన రాజకీయాల లక్ష్యమనే భావంతో నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం అందరి ప్రశంసలు అందుకుందని, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు." సేవే పరమో ధర్మః" అనే సందేశంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విజయవం తంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల ప్రధాన కార్యదర్శి గుండేటి రాజు యాదవ్, ఉద్యమ కారుడు. జిల్లా సీనియర్ నాయకులు చిలకమర్రి రాజేందర్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, మల్లూర్ దేవస్థాన మాజీ ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ నూతిలకంటి ముకుందం, పార్టీ నాయకులు ఆనందం, మాటూరి ఏడుకొండలు, కొమరం బాలకృష్ణ, యూత్ నాయకులు, ముప్పారాపు సందీప్, నాగవెంకట కృష్ణ, కేక్కం జగదీష్, సుంకోజు ప్రశాంత్, మూగల రాము, గణేష్, జాడి కృష్ణ, దేవా, గౌరి శంకర్, యండి అజ్జు శివ సోహెల్, ముజాహిన్, ఎం. గోపి,సిహెచ్ ప్రవీణ్, మండల మాజీ సోషల్ మీడియా ఇంచార్జ్ గుడివాడ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**మంగపేట, జూలై 24(ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి దేవస్థానం ఆవరణలో శుక్రవారం మంగపేట మండల ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శి అక్కపెల్లి రాజేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు గడదాసు సునీల్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఫోటోగ్రఫీ వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న ప్రతి ఒక్కరూ సంఘం బలోపేతానికి కృషి చేయాలని, ఐక్యతే సంఘానికి బలం అని ఆయన అన్నారు.అనంతరం మంగపేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వడ్లకొండ ప్రవీణ్ కుమార్ (పూర్ణ స్టూడియో), ప్రధాన కార్యదర్శిగా ఇప్పాల నరేష్ (మయూరి స్టూడియో), కోశాధికారిగా ఉగ్గుమల్ల గణేష్ (చిన్ని స్టూడియో), ఉపాధ్యక్షుడిగా పసుపులేటి రాజశేఖర్ (ఆర్.కే స్టూడియో), సహాయ కార్యదర్శిగా పిల్లలమర్రి కార్తీక్ (వెన్నెల స్టూడియో), ప్రచార కార్యదర్శిగా శివనేని మహేష్ (శివ స్టూడియో), ముఖ్య సలహాదారులుగా పూజారి శ్రీనివాస్, తాటి కమలాకర్, కార్యవర్గ సభ్యులుగా గోడిశాల వీర వెంకట వరప్రసాద్, అనంతుల రవి, కోడం రాజు, ఇల్లందుల రాకేష్, వడ్లకొండ సాయిరాజు, ఎర్ర శ్రవణ్ కుమార్‌లను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన ప్రధాన కార్యదర్శి ఇప్పాల నరేష్ మాట్లాడుతూ, “సంఘం బలోపేతమే మా లక్ష్యం... సభ్యుల సంక్షేమమే మా ధ్యేయం” అని అన్నారు. ఫోటోగ్రాఫర్లందరినీ ఒకే తాటిపైకి తీసుకువచ్చి సంఘాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని, సభ్యులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అవసరమైన మార్పులు, చేర్పులు తీసుకువస్తామని తెలిపారు. ప్రతి సభ్యుడికి సంఘం అండగా నిలిచేలా కృషి చేస్తామని, అందరి సహకారంతో మంగపేట ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్‌ను ఆదర్శ సంఘంగా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల సీనియర్ ఫోటోగ్రాఫర్ వడ్లకొండ వీరయ్య, సజ్జనపు రమేష్, బండి రాకేష్, గూడూరు ప్రవీణ్, గూడెపు శ్రవణ్ కుమార్, బుడగం రాజేష్, వంకాయల రాము, సంబశివరావు, సిద్దు, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# వాలీబాల్ అకాడమీకి ల్యాబర్తి విద్యార్థిని మంద నందిని ఎంపిక





**వర్ధన్నపేట, జూలై 24,ప్రజా జ్యోతి :** వర్ధన్నపేట మండలంలోని ల్యాబర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థిని మంద నందిని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ఆధ్వర్యంలోని కరీంనగర్ జిల్లా చింతకుంటలో ఉన్న వాలీబాల్ అకాడమీకి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగం శైలజ, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జలగం రఘువీర్ తెలిపారు.

అకాడమీలో 2026--27, 2027--28 విద్యా సంవత్సరాల్లో ఉచిత ఇంటర్ విద్యతో పాటు వాలీబాల్‌లో ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు వారు తెలిపారు. కోచ్‌లు బి. సతీష్, సుష్మ, సుజాతల ఆధ్వర్యంలో నందిని శిక్షణ పొందనుంది.

ల్యాబర్తి పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న సమయంలోనే నందిని తన క్రీడా ప్రతిభతో రాష్ట్ర స్థాయిలో పలు పోటీల్లో ప్రతిభ కనబరిచింది. మెదక్‌లో జరిగిన 14 ఏళ్ల లోపు రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల్లో, మహబూబ్‌నగర్‌లో జరిగిన 17 ఏళ్ల లోపు రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల్లో, నిజామాబాద్‌లో నిర్వహించిన 16 ఏళ్ల లోపు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు తరఫున పాల్గొని ప్రతిభ చాటిందని వ్యాయామ ఉపాధ్యాయుడు రఘువీర్ పేర్కొన్నారు.

వాలీబాల్ అకాడమీకి ఎంపికైన నందినిని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగం శైలజ, గ్రామ సర్పంచ్ మన్నూరు శారద సోము, ఉప సర్పంచ్ సంకినేని గంగరాజు, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పబ్బోజు సునీత, ఉపాధ్యాయులు వేణుకుమార్, మాధురి, వెంకటస్వామి, నాగరాజు, హరిలాల్, శివకుమార్, యుగేందర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, పీఈటీ రఘువీర్, గ్రామపంచాయతీ కార్యదర్శి శ్రీకర్, కారోబార్ భాస్కర్‌తో పాటు గ్రామస్థులు అభినందించి, ఆమె మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు.

# రాహుల్ గాంధీ, విద్యార్థుల అరెస్టులను ఖండించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు





- ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్
- మోదీ దిష్టిబొమ్మ దహనం

**వర్ధన్నపేట, జూలై 24, ప్రజా జ్యోతి :** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు విద్యార్థులు, యువతపై దాడి చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆరోపించారు. శుక్రవారం వర్ధన్నపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఆయుబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిరసనకారులు రోడ్డుపై బైఠాయించి కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ, ఢిల్లీలో నీట్ పరీక్ష పేపర్ లీకేజీ అంశంపై విద్యార్థులు చేపట్టిన నిరసనల సందర్భంగా వారిపై లాఠీచార్జీ చేయడం సరైంది కాదని విమర్శించారు. నీట్ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. యువత, నిరుద్యోగులు, మహిళల సమస్యలపై ప్రశ్నించినందుకు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల లీకేజీలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రతిపక్షాల గొంతును అణచివేసే ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ సహించదని హెచ్చరించారు. తాను పోలీసు అధికారిగా పనిచేసిన సమయంలో తెలంగాణ ఉద్యమంలో కూడా విద్యార్థులపై లాఠీచార్జీ చేయలేదని, అలాంటిది కేంద్ర ప్రభుత్వం విద్యార్థులపై బలప్రయోగం చేయడాన్ని ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సారంగపాణి, ఇల్లంద మార్కెట్ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వర్ధన్నపేట సొసైటీ చైర్మన్ రాజేష్ ఖన్నా, ఐనవోలు దేవస్థానం చైర్మన్ ప్రభాకర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పోశాల వెంకన్న, పట్టణ అధ్యక్షుడు ఈగ దామోదర్, మాజీ అధ్యక్షులు ఎద్దు సత్తన్న, మైస సురేష్, కౌన్సిలర్లు, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును నిరసిస్తూ భారీ ధర్నా

### ప్రధానమంత్రి మోడీ దిష్టిబొమ్మ దగ్ధం





**నర్సంపేట జూలై 24 (ప్రజా జ్యోతి) :** నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంబి వంశీకృష్ణ ఆధ్వర్యంలో లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ అక్రమ అరెస్టును నిరసిస్తూ భారీ ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతూ వరుసగా జరిగిన పేపర్ లీకేజ్ ఘటనలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ సభ్యులు పెండెం రామానంద్ హాజరై మాట్లాడుతూ, ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కే ప్రయత్నాలు ప్రజలు సహించరని అన్నారు. అలాగే యువత, విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసే విధంగా జరిగిన పేపర్ లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని పేర్కొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేక నినాదాలు ఇచ్చారు.నీట్ ఎగ్జామ్ పేపర్ లీకేజీ పై విద్యార్థులు ఆందోళన చెంది ఢిల్లీలో ధర్నా రూపకంగా నిరసన కార్యక్రమం చేపడుతుంటే, వారికి జరిగిన అన్యాయాన్ని కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉండి వారికి అండదండగా ఉండి వారి భవిష్యత్తును తీర్చిదిద్దేదిపోయి వారి మీద విచక్షణారహితంగా లాఠీ చార్జీలు బాంబుల దాడులు రబ్బర్ తూటాలుతో దాడి చేసి వారి రక్తాన్ని చిందించడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పేపర్ లీకేజీతో అన్యాయానికి గురైన విద్యార్థులకు అండగా నిలిచి కాంగ్రెస్ పార్టీ పక్షాన రాహుల్ గాంధీ ప్రియాంక గాంధీ శాంతియుత మార్గంలో విద్యార్థులతో కలిసి నిరసన చేస్తుండగా,లోక్సభ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు అని కూడా చూడకుండా విచక్షణ రహితంగా గాయపరిచి అక్రమ అరెస్టులు చేయించడం సిగ్గుచేటు.ఈ అక్రమ అరెస్టులను నిరసిస్తూ దొంతి మాధవ రెడ్డి ఆదేశాల మేరకు నర్సంపేట పట్టణంలో భారీ ఎత్తున వరంగల్ కూడలి వద్ద ధర్నా చేసి నిరసన తెలుపుతూ నరేంద్ర మోడీ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. అని పేర్కొన్నారు.. రాబోయే రోజుల్లో ఈ దేశ ప్రజలు మీ బిజెపి పార్టీని గద్దె దించి మీకు బుద్ధి చెప్తారు. అని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ పెండెం శ్రీలక్ష్మి రామానంద్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్,వైస్ చైర్మన్ గంధం నరేందర్ గుప్తా,నర్సంపేట సొసైటీ చైర్మన్ బొబ్బల రమణారెడ్డి,నర్సంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చింతల సాంబ రెడ్డి,నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శి బైరి మురళి,మాజీ ఎంపిటిసి కాటా ప్రభాకర్, కౌన్సిలర్లు బీరం భరత్ రెడ్డి,ఏపూరి శ్రీనివాస్, మాదాసు రవి,ఎలకంటి విజయ్ కుమార్, ముత్తినేని వెంకన్న,పొన్నం నరసింహారెడ్డి, అయూబ్ కాన్, మేఘన శ్యామ్,బాణాల ప్రసన్న శీను, వేల్పుల శ్రీలత,పొన్నాల మనిషా ప్రకాష్,శ్రీరామోజు రోజా రాణి,నర్సంపేట మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బొంత రంజిత్,నర్సంపేట నియోజకవర్గ ఉపాధ్యక్షులు ములకల మనీష్,నర్సంపేట పట్టణ కార్యదర్శి చిప్ప నాగ, మోటం రవికుమార్, సొసైటీ డైరెక్టర్ బైరి జనార్దన్ రెడ్డి, మాడుగుల నిరంజన్ రెడ్డి, లక్కాసు రమేష్,మెరుగు కిరణ్, దండం రతన్,భూక్య గణేష్, చిలువేరి రజిని భారతి, మంచినీళ్ల నాగరాజు,గద్ద వెంకటేశ్వర్లు,చింతల కార్తీక్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,యూత్ నాయకులు,మహిళ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్టీ విద్యుత్ తీగ తెగి గేద మృతి

- రూ. లక్ష విలువైన పాడి గేద కోల్పోయిన రైతు..
- విద్యుత్ శాఖ నిర్లక్ష్యమేనని స్థానికుల ఆవేదన



**పర్వతగిరి, జూలై 24 (ప్రజాజ్యోతి) :** మండలంలోని బూర్గుమల్ల గ్రామంలో శుక్రవారం విషాదకర ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఓరుగంటి సుభాష్కు చెందిన పాడి గేద వ్యవసాయ పొలంలో మేస్తుండగా, పై నుంచి వెళ్లే ఎల్టీ (లో టెన్షన్) విద్యుత్ లైన్ తీగ అకస్మాత్తుగా తెగి గేదపై పడింది. దీంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురైన గేద అక్కడికక్కడే మృతి చెందింది. మృతిచెందిన గేద విలువ సుమారు రూ.1 లక్ష ఉంటుందని బాధిత రైతు తెలిపారు. ఒక్కసారిగా గేద మృతి చెందడంతో రైతు సుభాష్ కన్నీరుమున్నీరుగా విలపించాడు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గ్రామస్తులు మాట్లాడుతూ, విద్యుత్ తీగల నిర్వహణలో విద్యుత్ శాఖ నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపించారు. బాధిత రైతుకు ప్రభుత్వం, విద్యుత్ శాఖ వెంటనే నష్టపరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. అలాగే గ్రామంలోని పాత, శిథిలావస్థలో ఉన్న విద్యుత్ లైన్లను వెంటనే మరమ్మతులు చేసి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

## వన మహోత్సవంలో ప్రతి ఇంటికి ఐదు మొక్కలు పంపిణీ



**పర్వతగిరి, జూలై 24 (ప్రజాజ్యోతి) :** వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా పర్వతగిరి మండలం మాల్య తండా గ్రామంలో ప్రతి ఇంటికి ఐదు మొక్కల చొప్పున పంపిణీ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ భూక్యా మంజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రతి కుటుంబం అందించిన మొక్కలను నాటి సంరక్షిస్తే గ్రామం మరింత పచ్చదనంతో కళకళలాడుతుందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలను నాటడమే కాకుండా వాటిని పెంచి పెద్ద చెట్లుగా తీర్చిదిద్దాలని గ్రామస్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, భూక్యా శ్రీను, టీఆర్ఎస్ నాయకుడు భూక్యా రవి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు భూక్యా కీరు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు పాల్గొని మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అందుబాటులోకి ఉప ఆరోగ్య కేంద్రం

- ఎంపీడీవో పరిశీలన.. పరిష్కారానికి కార్యచరణ



**ఖానాపురం/జూలై 24 (ప్రజా జ్యోతి) :** జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఖానాపూరం మండలం మం గళవారిపేటలో శుక్రవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) వనపర్తి అద్వైత, గ్రామ సర్పంచ్ గొంది సుజాత నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి యుగేందర్ తో పాటు గ్రామంలోని నిరుపయోగ ఉప ఆరోగ్య కేంద్రం భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్ దాత కట్ట ఎలియా తో ఎంపీడీవో మాట్లాడారు. భవనాన్ని వీలైనంత త్వరగా వైద్య శాఖకు అప్పగించే విషయంపై చర్చించారు. దాత ఎలియా సానుకూలంగా స్పందించి, కొద్ది రోజుల్లోనే పీహెచ్‌సీ భవనాన్ని అప్పగించేందుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా ఉప ఆరోగ్య కేంద్రం భవనంలో ఫ్లోరింగ్, మరుగుదొడ్ల నిర్మాణం, ప్రహరీ గోడ (కాంపౌండ్ వాల్) నిర్మాణం వంటి మిగిలిన పనులను కూడా కొద్ది రోజుల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ పనులకు సంబంధించిన అంచనాలను పంచాయతీ రాజ్ శాఖ ఏఈ ఉదయ్ సిద్ధం చేయనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. అనంతరం గ్రామ సమీపంలోని ఒక బావిలో మొసలి కనిపించిన ప్రాంతాన్ని పరిశీలించారు. అటవీ పరిధి అధికారి (ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్)తో మాట్లాడారు. అటవీ శాఖ రెస్క్యూ బృందం ఈ రోజే మొసలిని సురక్షితంగా బావి నుండి బయటకు తీసి తరలించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారన్నారు. మొసలి పట్ల గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అటవీ శాఖ అధికారులకు పూర్తి సహకారం అందించాలని ఎంపీడీవో సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం ప్రతిభ, వార్డ్ మెంబర్ గొంది నరసయ్య, ఆశ సునీత తదితరులున్నారు.

# స్పెషల్ పార్టీ సిబ్బందితో జిల్లా ఎస్పీ దర్బార్



- విశేషసేవలకు ప్రశంసలు, రివార్డులు,సంక్షేమానికి ప్రాధాన్యత
- కర్రెగుట్టల రహదారి పనుల్లో సేవలందించిన స్పెషల్ పార్టీ సిబ్బందికి ఎస్పీ ప్రశంసలు






**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) :** ములుగు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్ నాథ్ స్పెషల్ పార్టీ సిబ్బందితో శుక్రవారం దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బంది విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలు, సంక్షేమ అంశాలు, భవిష్యత్ అభివృద్ధికి సంబంధించిన సూచనలు,అభ్యర్థనలను స్వయంగా తెలుసుకుని వారితో చర్చించారు. దర్బార్‌లో సిబ్బంది పోలీసు హెడ్ క్వార్టర్స్ లో తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు,సిబ్బంది విశ్రాంతి కోసం పోలీస్ వెయిటింగ్ హాల్ ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే ఏర్పాటు చేసే దిశగా సంబంధిత అధికారులకు జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. మేడారం సమయంలోను అధికారుల చొరవతో ప్రయాణ బత్యం లభించగా, మరి కొన్ని నెలల ప్రయాణ బత్యం రావాల్సి ఉందని సిబ్బంది జిల్లా ఎస్పీని అభ్యర్థించగా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని ఎస్పీ హామీ ఇచ్చారు.అలాగే,కఠిన సేవా పథకాల వంటివి పొందేందుకు అర్హులైన సిబ్బంది వివరాలను పరిశీలించి,నిబంధనల ప్రకారం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. ఇటీవల ఎండలను సైతం లెక్కచేయకుండా కర్రెగుట్టల కొండ ప్రాంతంలో రహదారి నిర్మాణ పనులను విజయ వంతంగా పూర్తిచేయడంలో విశేష కృషి చేసిన స్పెషల్ పార్టీ సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.వారి అంకితభావం,క్రమశిక్షణ, సేవలను గుర్తిస్తూ ఉన్నత అధికారుల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు,రివార్డులు అందజేయనున్నట్లు ప్రకటించారు.అలాగే మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో దీర్ఘకాలంగా అంకితభావంతో సేవలు అందించి అర్హులైన స్పెషల్ పార్టీ,బాంబు స్క్వాడ్ సిబ్బందికి ఆక్సిలరీ ప్రమోషన్లు కల్పించే అంశాన్ని కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి ఉన్నతాధికారులకు సిఫారసు చేశామని తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..స్పెషల్ పార్టీ సిబ్బంది ములుగు జిల్లా పోలీసు శాఖకు వెన్నెముకలాంటివారని, వారి సంక్షేమం, సేవలకు తగిన గుర్తింపు కల్పించడం జిల్లా పోలీసు శాఖ ప్రాధాన్యతని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే సేవాస్ఫూర్తితో ప్రజల భద్రత కోసం కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. స్పెషల్ పార్టీ అని కాకుండా నిజాయితీతో పనిచేసిన ప్రతి సిబ్బందికి తగిన గుర్తింపు ఉంటుందని తెలియచేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు ములుగు డీఎస్పీ ఇంచార్జి ఓఎస్డీ నలువాల రవీందర్,రిజర్వ్‌డ్ ఇన్స్పెక్టర్ ఆపరేషన్ డి. తిరుపతి,ములుగు సిఐ దారం సురేష్,ఆర్ఎస్సైలు గోపి,ప్రశాంత్, అవినాష్, సందీప్,రాకేష్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

తుంగతుర్తి, జులై 24,(ప్రజా జ్యోతి):
భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తుంగతుర్తి మండల కమిటీ ఆధ్వర్యంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (కల్వకుంట్ల తారక రామారావు) జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు తెలంగాణ తల్లి చౌరస్తా కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు.కేటీఆర్ ఆయురారోగ్యాలతో దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ.... తెలంగాణ అభివృద్ధికి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు, ఐటీ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టడంలో కేటీఆర్ విశేష కృషి చేశారని కొనియాడారు. ఆయన నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎంపీపీ కవితా రాములు గౌడ్ నివాసంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, వెంపటి, కొత్తగూడెం సర్పంచులు తప్పట్ల ఎల్లయ్య,రమేష్, మండల కమిటీ నాయకులు మల్యాల రాములు,గుండగాని దుర్గయ్య,మాజీ సర్పంచులు, యాకు నాయక్, వీరోజి, రాములు, గడ్డం సోమేశ్, సింహాద్రి, రవీందర్ నాయక్,పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యుడు గా మందశివ

మిర్యాలగూడ, జులై 24,( ప్రజాజ్యోతి ):



భారతీయ జనతా పార్టీ జిల్లా కమిటీ కార్యవర్గ సభ్యుడిగా మిర్యాలగూడ మండలం సుబ్బారెడ్డి గూడెం కు చెందిన మంద వెంకటేశ్వర్లు (శివ) ని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశాడు. ఈ సందర్భంగా మంద శివ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డికి, సహకరించిన నియోజకవర్గ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీని తెలంగాణలో అధికారంలోకి తీసుకువచ్చే దిశగా బాధ్యతగా అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి సిపిఐ మండల కార్యదర్శి అమరారపు పున్నయ్య

మఠంపల్లి జూలై 24 (ప్రజా జ్యోతి)
మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని మఠంపల్లి మండల సిపిఐ కార్యదర్శి అమరారపు పున్నయ్య అన్నారు.శుక్రవారం మఠంపల్లి మండలంలోని బక్కమంతులు గూడెం గ్రామంలో జరిగిన మహిళా సమాఖ్య మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసిన



సందర్భంగా మాట్లాడుతూ దేశ జనాభాలో సగభాగమైన మహిళలు అన్ని రంగాల్లో భాగస్వాములైనప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని ముఖ్యంగా మహిళలు విద్యలో అలాగే రాజకీయ రంగంలో రాణించాలని సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణ కోసం కృషి చేయాల్సిన ప్రధాన బాధ్యత మహిళలదే అని అన్నారు.ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అనే నానుడిని నిజం చేస్తూ రాబోయే తరం పిల్లలు బాగా చదువుకునే విధంగా ప్రోత్సహించి క్రీడా సాంస్కృతిక రంగా లో శిక్షణ ఇచ్చి భరతమాత కీర్తి కిరీటంలో కలికి తురాళ్లు గా నిలిచేలా తీర్చిదిద్దాలని అలాగే రాజకీయ రంగంలో తమదైన ముద్ర వేయాలని మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైతే అక్కడ అవినీతి లేని పరిపాలన కొనసాగుతుందని చరిత్ర చెబుతున్న సత్యమని అందువల్ల నీతి నిజాయితీగల పాలన స్వచ్ఛమైన పరిపాలన, సుపరిపాలన ప్రజలకు అందాలంటే మహిళా ప్రజా ప్రతినిధుల సంఖ్య పెరగాలని జనరల్ సీట్లలో లో కూడా మహిళల గెలవాలని ఆయన ఆకాంక్షించారు.మహాసభకు రసూల్ బి అధ్యక్షత వహించగా కళ్యాణి నాగమణి సైదమ్మ రావులమ్మ మంగమ్మ పద్మ రజనీ నాగలక్షి పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు.. రోగులకు పండ్ల పంపిణీ

భూదాన్ పోచంపల్లి, జూలై 24 (ప్రజాజ్యోతి)
మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను భూదాన్ పోచంపల్లి పట్టణ కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో



హాజరై కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లను పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి సస్యశ్యామలంగా మారిందన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైందని, తెలంగాణను అంధకారంలోకి నెట్టిందని విమర్శించారు. కేటీఆర్ నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతమై ప్రజలకు అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, యువకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల సాధనకై జైల్ బరో: పల్లె వెంకటరెడ్డి

మఠంపల్లి జూలై 24 (ప్రజా జ్యోతి)
తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు, రైతుల,కార్మికుల,వ్యవసాయ కార్మికుల హక్కుల సాధనకై ఆగస్టు 10న జరగబోయే జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పల్లె వెంకటరెడ్డి పిలుపునిచ్చారు.శుక్రవారం తెలంగాణ రైతు సంఘం, సిఐటియు,వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుండి ఈ 12 ఏళ్ల కాలంలో అన్ని వర్గాల ప్రజలకు తీరని అన్యాయం జరిగిందన్నారు.రైతాంగానికి వ్యతిరేకంగా మూడు నల్ల చట్టాలు తీసుకొచ్చి రైతులను నానా ఇబ్బందులు గురి చేస్తున్న క్రమంలో రైతులు 14 నెలలపాటు ఢిల్లీ సరిహద్దుల్లో అలుపెరగని పోరాటం చేసి 736 మంది బలిదానం చేసి ఆ నల్ల చట్టాలను వెన్నక్కి కొట్టారన్నారు.తిరిగి ఆ చట్టలను దొడ్డిదారిలో తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేసిందన్నారు.మూడోసారి అధికారులంలోకి



వచ్చిన తర్వాత కార్మికులు దశాబ్దాలుగా పోరాడి సాధిస్తున్న 29 లేబర్ చట్టాలను నాలుగు లేబర్ కోలుగా మార్చి కార్మికుల హక్కులను హరించిందన్నారు.ఈ కాలంలో యూపీఏ ఒకటి ప్రభుత్వంలో కమ్యూనిస్టులు సాధించిన ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చి పథకంగా మార్చి చివరకు ఉపాధి హామీ నే ఎత్తేసేందుకు చూస్తున్నారన్నారు.మరొపక్క దేశంలో ధరల మీద ధరలు పెరిగి సామాన్యుడు బతకలేని పరిస్థితి నెలకొంద న్నారు.పేపర్ లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు.కార్మిక,కర్షక,వ్యవసాయ కూలీల హక్కుల ను కాపాడేందుకు,సకలజనుల సమస్యలు పరిష్కారానికై జరుగుతున్న జైల్ భరో కార్యక్రమంలో కార్యక్రమంలో వందలాదిగా పాల్గొనాలని ఆయా సంఘాలను కోరారు.ఈరౌండ్ టేబుల్ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు శాఘంరెడ్డి జగన్మోహన్ రెడ్డి,సిపిఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు భూక్య పాండు నాయక్,మండల కార్యదర్శి మలోత్ బాలు నాయక్,సిమెంట్ క్లస్టర్ కన్వీనర్ వట్టేపు సైదులు,వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పోసన బోయిన హుస్సేన్,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శీలం శ్రీను,ప్రజా సంఘాల నాయకులు కోటేశ్వరి కే వెంకట్ రెడ్డి ఎస్ కే సైదులు భద్రారెడ్డి పూడిశెట్టి రాము వినోద్ నాయక్ ఎం లక్ష్మణ్ రెడ్డి చర్ల బాబు కంటు కోటయ్య పూల నాగరాజు లక్ష్మ తదితరులు పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు

నడిగూడెం, జులై 24, ప్రజా జ్యోతి
కేటీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో ఘనంగా నిర్వహించిన నడిగూడెం బీఆర్ఎస్. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం నడిగూడెం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గల సీఎస్సీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా బి ఆర్ఎస్ పార్టీ నడిగూడెం మండల సమన్వయ సమితి కమిటీ సభ్యులు ఆనంతుల ఆంజనేయులు మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు, అవసరమైన అన్ని సౌకర్యాలు అందించాలని కోరారు. రోగులకు అవసరమైన వైద్య పరీక్షలను ఆలస్యం చేయకుండా వెంటనే నిర్వహించి, సకాలంలో చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
అలాగే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టి–హబ్ తరహాలోనే ఆరోగ్య రంగానికి ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రభుత్వ ఆసుపత్రులను మరింత అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సీఎస్సీ ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పనిశ్వర రావును కలిసి, ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మెరుగైన వైద్య సేవలు, మందులు, పరీక్షలు, పరిశుభ్రమైన వాతావరణం మరియు



అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నడిగూడెం గ్రామ శాఖ అధ్యక్షులు బోనగిరి ఉపేందర్. మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు దాసరి శ్రీనివాస్. మండల మైనార్టీ నాయకులు జలిల్. ఉద్యమ నాయకులు దున్న ప్రవీణ్. మండల ఉపాధ్యక్షులు దున్న రవి. వార్డు సభ్యులు పోలబోయిన నాగరాజు.. మండవ అనిల్. హాస్పటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# దళిత నియోజకవర్గాల పై మీ పెత్తనం చెల్లదు... ఖబర్దార్!

**మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డిపై ఎమ్మెల్యే మందుల సామెల్ ఘాటు**

**తుంగతుర్తి గురించి మాట్లాడే నైతిక హక్కు మీకు లేదు**

**ముందు నీ మునుగోడు మురికిని చూసుకో**

**నా హక్కులను హరిస్తే అధిష్టానానికి ఫిర్యాదు చేస్తా**

**నా డప్పు మోగుద్ది.. నా చిర్ర మోగుద్ది.. నా పని కత్తులు లేస్తాయి ఖబర్దార్**

**ఎస్టిలకు యాదవులకు మంత్రి పదవులు ఇవ్వాలి**

**బడుగు వర్గాలే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక**

**టీపీసీసీ నియమించిన మండల అధ్యక్షులే కొనసాగుతారు**

తుంగతుర్తి, జూలై 24,(ప్రజా జ్యోతి):
దళిత నియోజకవర్గం మీ పెత్తనం ఖబర్దార్ అని కోమటిరెడ్డి బ్రదర్స్ పై తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ ఘాటు వ్యాఖ్యలు చేశారు.తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిపై ఎమ్మెల్యే సామెల్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తుంగతుర్తి నియోజకవర్గ రాజకీయాలపై వ్యాఖ్యానించే నైతిక హక్కు వారికి లేదని స్పష్టం చేశారు. తుంగతుర్తి నియోజకవర్గం గురించి గాంధీభవన్‌లో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని మండిపడ్డారు. "మునుగోడు ఎమ్మెల్యేకు నా నియోజకవర్గంతో ఏం సంబంధం ఉంది? ముందు నీ మునుగోడు సమస్యలు, నీ .. మునుగోడు మురికిని చూసుకో. బీజేపీ నుంచి వచ్చిన నీతో పాటు వచ్చిన నాయకులకే మండల పార్టీ అధ్యక్ష పదవులు ఇప్పించలేకపోయావన్నారు.కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే అర్హత నీకు లేదు" అంటూ ఘాటుగా స్పందించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తన నియోజకవర్గంలో ప్రోటోకాల్‌ను ఉల్లంఘించారని ఆరోపించిన ఎమ్మెల్యే సామేలు, దీనిపై పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేస్తాననీ హెచ్చరించారు. తుంగతుర్తి నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిపై ఎన్నిసార్లు విన్నవించినా మంత్రి పట్టించుకోలేదని విమర్శించారు. అలాంటి వ్యక్తికి తన నియోజకవర్గంపై మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. దళిత నియోజకవర్గాలపై పెత్తనం చెలాయించే



ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరిస్తూ, "మా మాదిగ నియోజక వర్గాల జోలికి వస్తే సహించనన్నారు.



రాజ్యాంగం ప్రకారం నాకు టికెట్ వచ్చింది. నేను ఎవరి దయాదాక్షిణ్యాలపై రాజకీయాల్లోకి రాలేదు" అని స్పష్టం చేశారు. నల్లగొండ జిల్లా పోరాటాల గడ్డ అని, ఇక్కడ శ్రమజీవులే ఉంటారని పేర్కొంటూ, "నేను భయపడేది తుంగతుర్తి ప్రజలకు, ఓటర్లకు మాత్రమే. నాకు ఎవరిముందూ చేతులు చాచే అవసరం లేదు" అని వ్యాఖ్యానించారు. నకిరేకల్‌లో వేముల వీరేశానికి 67 వేల మెజార్టీ ఇచ్చిన ప్రజలు, తనకు తుంగతుర్తిలో 50 వేల మెజార్టీ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని బడుగు, బలహీన వర్గాల ప్రజలే నిలబెడుతున్నారని ఎమ్మెల్యే సామేలు అన్నారు. బీజేపీ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కొందరు పార్టీని బలహీనపర్చేందుకు ప్రయత్నిస్తున్నారని, అయితే వారి ప్రయత్నాలు ఫలించవని హెచ్చరించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియమించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులే కొనసాగుతారని స్పష్టం చేశారు. వారి నియామకాలపై ఎవరూ అనవసర జోక్యం చేసుకోవద్దని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడిన ఎమ్మెల్యే సామేలు, ప్రస్తుతం ఉన్న రెండు మంత్రి పదవుల్లో ఒకటి ఎస్టీ వర్గానికి, మరొకటి యాదవ సామాజిక వర్గానికి కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే తన హక్కులను హరించే ప్రయత్నాలు కొనసాగితే పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని, అవసరమైతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తానని ఎమ్మెల్యే మందుల సామేలు హెచ్చరించారు. నేను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత 32 కోట్లతో బిక్కేరు వాగు పై ఆరు చెక్ డ్యాంలను పూర్తిచేస్తే నేడు సుమారు 12 వేల ఎకరాల సాగు భూమి సస్యశ్యామలం అయ్యిందని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 170 కోట్లతో సీసీ రోడ్లు వేయించినట్లు తెలిపారు. 30 గ్రామాలకు నూతన గ్రామపంచాయతీ బిల్డింగులను నిర్మించినట్లు తెలిపారు. సుమారు 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తిరుమలగిరి మండల కేంద్రంలో జూనియర్ కాలేజీ, 16 కోట్లతో తుంగతుర్తి మెయిన్ రోడ్డు మంజూరు చేయించినట్లు తెలిపారు. తిమ్మాపురం నుండి వెంకేపల్లి గ్రామం వరకు 18 కోట్లతో డబల్ రోడ్లు వేయించినట్లు తెలిపారు. అదేవిధంగా మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భుదాని గాని కాలువ ను మంజూరు చేయించినట్లు తెలిపారు.ఈ సమావేశంలో తిరుమలగిరి కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు సుంకరి జనార్ధన్ తో పాటు 8 మండలాల అధ్యక్షులు, పిఎసిహెచ్ చైర్మన్లు, మున్సిపల్ కౌన్సిలర్లు వివిధ గ్రామాల సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మీ పథకం పేదలకు వరం సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి,రూరల్ 24(ప్రజాజ్యోతి):
ఎమ్మెల్యే కుంభం అనీల్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బిఎన్ తిమ్మాపురం గ్రామానికి చెందిన,వారికి మంజూరైన కల్యాణ,లక్ష్మీ చెక్కులను ఎమ్మెల్యే తో కలిసి మన గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అనేది



సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ వివాహాలు చేసుకున్న,యువతి,తల్లి దండ్రులకు కళ్యాణ లక్షి పథకం క్రింద 100116రూ చెక్కును అందించడం వల్ల పేద కుటుంబాలలోని ఆడపిల్లల,వివాహాలకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. పేదరికంతో,ఆడపిల్లల పెళ్లిళ్లు చేయలేక సతమతమ వుతున్న,తల్లిదండ్రులకు ఈ పథకం ధైర్యాన్ని ఇవ్వడంతో పాటు ఆ కుటుంబాన్ని ఆదుకునే విదంగా తోడ్పాటు ను అందిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో అన్నెపు గణేష్,మాజీ వార్డు సభ్యులు,వళ్ళందస్ పరమేష్,జిన్న బాలయ్య కళ్యాణ లక్ష్మీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బిఎన్ తిమ్మాపురం గ్రామంలో సమగ్ర ఓటర్ల సవరణ ప్రక్రియ 100 శాతం పూర్తి

### సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి

భువనగిరి రూరల్ జులై 24(ప్రజాజ్యోతి):



బిఎన్ తిమ్మాపురం,గ్రామంలో ఎస్ ఐ ఆర్ సమగ్ర ఓటర్ల సవరణ కార్యక్రమం,100 శాతం పూర్తి అయిందని సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా, వారు,మాట్లా డుతూ గడువు ముగియక ముందే ఎస్ ఐ ఆర్ ప్రక్రియ 1753 దరఖా స్తులను మొత్తం పూర్తి చేసి ఆన్లైన్ లో నమోదు చేయడంలో బి ఎల్ ఓ లు రావుల అర్చన,దంతురి ఇందిరచేసిన కృషి అభినంద నియమని,ఎస్ ఐ ఆర్ ప్రక్రియ 100,శాతం పూర్తి చేసి భువనగిరి,మండలం లో బిఎన్ తిమ్మాపురం గ్రామం మొదటి స్థానంలో నిలవడం చాలా సంతోషకరమైన విషయమని సర్పంచ్ ఎడ్ల వెంకట్ రెడ్డి,అన్నారు.ఎస్ ఐ ఆర్ ప్రక్రియ 100 శాతం పూర్తి కావడానికి సహకరించిన బి ఎల్ ఓ ల లకు,గ్రామ పంచాయతీ సిబ్బందికి, ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు.

## జానకమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్సీ ఎం.సి. కోటిరెడ్డి

హాలియా,జూలై24(ప్రజా జ్యోతి)
ఎడమ కాలువ మాజీ వైస్ చైర్మన్ మల్గిరెడ్డి లింగారెడ్డి అత్త ఏలుగూరి జానకమ్మ దశదినకర్మ శుక్రవారం హాలియా పట్టణం లోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి గార్డెన్స్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి నల్లగొండ జిల్లా శాసనమండలి సభ్యులు ఎం.సి. కోటిరెడ్డి,మాజీ ఆప్కాబ్ చైర్మన్ ఎడవల్లి విజయేందర్ రెడ్డిలతో కలిసి హాజరయ్యారు. అనంతరం జానకమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి,శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం



చేశారు.కార్యక్రమంలో మాజీ హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖ్య సలహాదారు ఎడవల్లి మహేందర్ రెడ్డి,మాజీ మార్కెట్ చైర్మన్ ఎక్కలూరి శ్రీనివాస్ రెడ్డి,మాజీ హాలియా పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి, తిరుమలగిరి (సాగర్) మండల మాజీ అధ్యక్షుడు బి.వి.రమణ రాజు,కాశవారి గూడెం సర్పంచ్ కరీం,చాపల వెంకన్న,కంపసాటి వెంకన్న యాదవ్,ఆంజనేయులు స్థానిక నాయకులు,పాల్గొని నివాళులర్పించారు.

### జోగిపేటలో ఘనంగా
# కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు

• 'తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ సేవలు చిరస్మరణీయం' • బీఆర్ఎస్ నాయకులు



**అందోల్, (ప్రజాజ్యోతి):** బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా జోగిపేట పట్టణంలోని హనుమాన్ చౌరస్తా వద్ద శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డి.బి. నాగభూషణం, బీఆర్ఎస్ నాయకుడు చాపల వెంకటేశం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. బంగారు తెలంగాణ సాధన కోసం ఆయన మరింత కాలం ప్రజాసేవ చేయాలని, భగవంతుడు ఆయన్ను సంపూర్ణ ఆరోగ్యంతో ఆశీర్వదించాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేసే సమర్థ నాయకుడు కేటీఆర్ అని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చి, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన పాలన అందిస్తుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బిర్ల శంకర్, పుర్ర సంతోష్, ఆకుల శంకర్, ఎం.డి. గౌరే, పోలీస్ శంకర్ రావు, పరిపూర్ణం, రఫిక్, నారాయణ, ముస్లాపూర్ కృష్ణతో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జికి
# నిరసనగా వట్‌పల్లిలో విద్యాసంస్థల బంద్







**అందోల్, జూలై 24 (ప్రజాజ్యోతి):** విద్యార్థుల సమస్యల పై ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తూ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గంలోని వట్‌పల్లి మండలంలో శుక్రవారం విద్యాసంస్థల బంద్ విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ నాయకులు విద్యార్థులతో కలిసి పలు విద్యాసంస్థలను సందర్శించి బంద్‌కు మద్దతు కోరారు. ఈ సందర్భంగా అందోల్ నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ ఖాజా మాట్లాడుతూ.. విద్యార్థుల హక్కులను అణిచివేసే చర్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని, శాంతియుతంగా నిరసన తెలిపే ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడం తగదని వారు పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను అణచివేతతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌యూఐ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని అన్నారు. మరో నాయకుడు వట్‌పల్లి మండల అధ్యక్షుడు బగ్గీ రుక్మోద్దీన్ మాట్లాడుతూ.. బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎన్ఎస్‌యూఐ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. ఈ బంద్ కార్యక్రమంలో ఇస్మాయిల్, ఇంతియాజ్, వినయ్, శ్రీనివాస్, శంకర్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# "సదాశివపేటలో దుర్గమ్మ జాతర సందడి మొదలైంది!"



**ప్రజాజ్యోతి సంగారెడ్డి** :ప్రముఖ శ్రీ దుర్గాభవానీ మాత జాతర మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను వేగవంతం చేశారు.ఇందులో భాగంగా, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఈరోజు సదాశివపేట మున్సిపల్ కమిషనర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు.జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్యం, తాగునీరు,వీధిదీపాలు, అలాగే ట్రాఫిక్ సమస్యలు లేకుండా మున్సిపాలిటీ తరఫున అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతిపత్రం అందజేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కమిషనర్, జాతరను ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేసేందుకు మున్సిపల్ సిబ్బందితో అన్ని ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు... ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎర్ర నరసింహ గౌడ్,ఎర్ర భగవాన్ గౌడ్,ఎర్ర వీరేందర్ గౌడ్, కనిగిరి ధనంజయ్ గౌడ్, ఎర్ర పాలనేత్ర గౌడ్,ఎర్ర సంక్షయ్ గౌడ్, ఎర్ర దత్తు గౌడ్, మాజీ చైర్మన్ మనపల్లి సత్తన్న, ఇంజనీర్ రాజేష్ ,మాజీ కౌన్సిలర్ జై గౌడ్, తదితరులు పాల్గొన్నారు...

### జంతర్ మంతర్‌లో విద్యార్థులు,
# యువజను లపై పోలీసుల లాఠీచార్జ్‌ను ఖండిస్తూ

• ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జహీరాబాద్‌లో ర్యాలీ




**జహీరాబాద్, జూలై 24(ప్రజా జ్యోతి న్యూస్)** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ (చీజుజు) పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ శాంతియుతంగా ఆందోళన చేపట్టిన విద్యార్థులు, యువజను లపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని నిరసిస్తూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), డివైఎఫ్ఐ జహీరాబాద్ డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మరియు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు టీ.రాజేష్, డివిజన్ కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల ను పరిష్కరించకుండా, శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న వారిపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత ప్రజాస్వామ్య వ్యతిరేక చర్య అని తీవ్రంగా ఖండించారు. విద్యా వ్యవస్థలో పారదర్శకతను కాపాడాల్సి న కేంద్ర ప్రభుత్వం విద్యార్థుల ఆందోళనలను అణచివేసే ప్రయత్నం చేయడం సరికా దన్నారు. నీట్ పేపర్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయా లని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమాలు కొనసాగుతాయని, ప్రజాస్వామ్య బద్ధమైన పోరాటాలను అణచి వేయాలని చూస్తే మరింత ఉధృతంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రిషి, సాయి గౌడ్, అభి, విష్ణువర్ధన్, బన్నీ మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.




### ఘనంగా బిఆర్ఎస్ పార్టీ
# వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలు







**జహీరాబాద్, జూలై 24(ప్రజాజ్యోతి న్యూస్)** భారత రాష్ట్ర సమితి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామా రావు 50వ పుట్టిన రోజువేడుకలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. జహీరాబాద్ శాసనసభలు కొనింటి మాణిక్ రావు మేరకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు కేక్ కట్ చేసి కేటీఆర్ కి శుభాకాంక్షలు తెలియ జేశారు. సందర్భంగా తెలంగాణ ప్రగతి రథసారథి, ప్రజల ఆశీస్సు లతో నిత్యం ముందుకు సాగుతున్న కేటీఆర్ కి జన్మదిన శుభాకాంక్షలు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ గుండప్ప, మాజి ఆత్మ చైర్మన్ విజయ్ కుమార్, మాజి మున్సిపల్ చైర్మన్ తంజిం, జహీరాబాద్ మండల పార్టీ అధ్యక్షులు తట్టు నారాయణ, మొగుడంపల్లి మండల పార్టీ అధ్యక్షులు సంజీవ్ రెడ్డి, కోహీర్ మండల పార్టీ అధ్యక్షులు నర్సింలు, కౌన్సిలర్ లు దీపక్, మహిపాల్ యాదవ్, జాకీర్, జాహీద్, విశ్వేశ్వర్, రాజు, ప్రవీణ్, వివిధ గ్రామాల సర్పంచ్ లు మచ్చేందర్, గోవర్ధన్ రెడ్డి, రాజు, రాథోడ్ భీమ్ రావు నాయక్, శ్రీనివాస్, ఎస్టీ సెల్ అధ్యక్షులు హీరూ రాథోడ్, బిసి సెల్ అధ్యక్షులు అమిత్ కుమార్, పట్టణ నాయ కులు బరూర్ దత్తాత్రి, గణేష్, చంద్రయ్య, జియా గౌరీ, నసీర్, వెంకట్, శివ కుమార్ స్వామి, హంజా, అక్బర్, రవి చౌహాన్, అఫ్సర్ మొహియుద్దీన్, ఇబ్రహీం, నరసింహ రెడ్డి , జుబేర్, వెంకట్, సందీప్ రాజ్, బంజారా నాయకులు గోపాల్ ,కిషన్,చందు నాయక్, రామ్ శెట్టి, విజయ్ రాథోడ్, నాయకులు సయీద్, కరణ్, అరుణ్, శ్రీకాంత్, రాజు, అజీమ్ పటేల్, నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# పుల్కల్ మండలంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విస్తృత పర్యటన

• కేజీబీవీ, పీహెచ్‌సీ తనిఖీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనుల పరిశీలన







**సంగారెడ్డి, ప్రజా జ్యోతి ప్రతినిధి జూలై 24:** విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం కల్పించ డానికి సంబంధిత అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ పుల్కల్ మండలంలో పర్యటించి మండల కేంద్రంలోనీ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించారు. ముందుగా బస్వాపూర్ పరిధిలో నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ పనులను పరిశీలించిన కలెక్టర్, నిర్మాణ పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. పనులను నాణ్యత ప్రమాణాలతో, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. తదుపరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను సందర్శించిన కలెక్టర్, నూతనంగా నిర్మించిన పి హెచ్ సి భవనాన్ని పరిశీలించారు. భవనాన్ని త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని,త్వరగా మంత్రి చేత ప్రారంభించేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మెడికల్ ఆఫీసర్ కు సూచించారు.అనంతరం పుల్కల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్ పాఠశాల ఆవరణ, డార్మిటరీ, తరగతి గదులు, స్టోర్‌రూమ్, వంటశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, ఈగలు, దోమలు పెరగకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా పరిశుభ్రతను పాటిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థినులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు.విద్యార్థినుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని పాఠశాల నిర్వాహకులను ఆదేశించారు. 6వ తరగతి విద్యార్థినులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కలెక్టర్, వారితో పాఠ్యాంశాలను చదివించి అభ్యాసన సామర్థ్యాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు నోట్‌బుక్‌లను అందజేశారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వారికి ఉద్బోధించారు. కలెక్టర్ వెంట ఆయా కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ఎం ఈ ఓ, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### ఝరాసంగం మండల బిఎల్ఏ'ఎస్‌తో (ఎస్ఐఆర్)సమీక్ష సమావేశాన్ని
## " నిర్వహించిన మాజీ మంత్రివర్యులు, జహీరాబాద్ ఇన్‌చార్జ్ చంద్రశేఖర్

• జహీరాబాద్ అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మొహమ్మద్ గౌస్





**జహీరాబాద్, జూలై 24( ప్రజా జ్యోతి న్యూస్)** ఝరాసంగం మండలంలోని లింగాయత్ సత్రంలో లిమాజీ మంత్రివర్యులు,జహీరాబాద్ ఇంచార్జ్ డా॥ఏ.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బిఎల్ఏ'ఎస్ పార్టీ నాయకులతో (ఎస్ఐఆర్) సమీక్ష సమావేశం నిర్వహించబడింది..ఈ సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం పురోగతి, ప్రతి బూత్‌లో చేపట్టాల్సిన కార్యాచరణ, ఫారాల సేకరణ, ప్రజలకు అవగాహన కల్పించడం, పార్టీ శ్రేణుల సమన్వయంతో లక్ష్యాలను విజయవంతంగా పూర్తి చేయడంపై డా॥ఏ.చంద్రశేఖర్ సమగ్రంగా సమీక్షించారు. ప్రతి బిఎల్ఏ పార్టీ నాయకుడు బాధ్యతా యుతంగా పనిచేసి అర్హులైన ప్రతి ఓటరికి న్యాయం జరిగేలా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సీడీసీ.చైర్మెన్ ముబీన్, మాజీ ఇండస్ట్రియల్ చైర్మెన్ తన్వీర్, మండల అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, మాజీ మండల అధ్యక్షులు హన్మంత్ రావ్ పాటిల్, మాజీ పట్టణ అధ్యక్షులు కండేం. నర్సింలు, కాంగ్రెస్ నాయకులు ఉజ్వల్ రెడ్డి, నియోజకవర్గ మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు అస్మా తబస్సుమ్, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు నాగిరెడ్డి, మండల నాయకులు, సర్పంచులు, బిఎల్ఏ'ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### కేవీపీఎస్ సామాజిక ఉద్యమ శిక్షణ
# తరగతులను జయప్రదం చేయండి



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 24:** కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా సామాజిక ఉద్యమ శిక్షణ తరగతులు ఈ నెల 25, 26 తేదీల్లో నారాయణఖేడ్ పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు కేవీపీఎస్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కేవీపీఎస్ కులవివక్ష, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడుతోందన్నారు. దళితులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ, బాధితులకు అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, రిజర్వేషన్ల అమలు, నాణ్యమైన విద్య, వైద్య సేవలు, దళితుల అసైన్డ్ భూముల రక్షణ కోసం ఉద్యమాలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ నేపథ్యంలో నిర్వహించనున్న సామాజిక ఉద్యమ శిక్షణ తరగతులను విజయవంతం చేయడానికి ప్రజాసంఘాల నాయకులు, యువత, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొంతారి నర్సింలు, సంతోష్, అంబేద్కర్ యువజన సంఘం డివిజన్ అధ్యక్షుడు కన్షీరాం, అంబేద్కర్ పూలే సేవా సమితి డివిజన్ అధ్యక్షుడు ఎస్. నర్సింలు, జిల్లా సహాయ కార్యదర్శి గణపతి, మెహన్, దత్తా సాయి తదితరులు పాల్గొన్నారు.

### కేటీఆర్ జన్మదినం సందర్భంగా
# ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ





**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 24:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ..ప్రజాసేవే పరమావధిగా బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తోందన్నారు. కేటీఆర్ జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా నిర్వహించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖేడ్ పట్టణ అధ్యక్షులు బి.నగేష్, మాజీ సర్పంచ్ నజీబ్, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, నాయకులు గోపాల్, అంబదాస్, దస్తగిరి, లక్ష్మణ్ తో పాటు నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

### చీకుర్తి ప్రభుత్వ
# బడిలో 20 మంది చేరిక

**జహీరాబాద్, జూలై 24( ప్రజా జ్యోతి న్యూస్ )** ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంపొందించే దిశగా చీకుర్తి గ్రామంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 20 మంది విద్యార్థులను ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ముందుండి సహకరించారు. ప్రభుత్వ విద్యపై నమ్మకాన్ని చాటుతూ, హైదరాబాద్‌లో చదివే అవకాశం ఉన్నప్పటికీ తన కుమారుడిని కూడా చీకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మెరుగైన సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.

# తిమ్మాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

- 80 మందికి ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
- కోణార్క్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం
- డాక్టర్స్‌ను సన్మానించిన సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్



**దుబ్బాక, జులై 24 (ప్రజాజ్యోతి)** సిద్దిపేట కోణార్క్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ పూర్ణచంద్ర (ఎం.డి,పల్మోనాలజిస్ట్) ఆధ్వర్యంలో దుబ్బాక మండలం తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ వన్నెల విజయ్, గ్రామ పాలకవర్గ సభ్యులు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో 80 మందికి రక్త పరీక్షలు, ఈసీజీ,ఊపిరితిత్తులకు సంబంధించిన పరీక్షలను ఉచితంగా నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పూర్ణచంద్ర, వంశీ మాట్లాడుతూ.... శ్వాసకోశ సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రారంభ దశలోనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.







అనంతరం ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన సిబ్బందిని గ్రామ సర్పంచ్ గుర్రాల శ్రీనివాస్ శాలువాలు కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కోణార్క్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు సముద్రాల సిద్ధూ, పెద్దోళ్ల విద్యాసాగర్, వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తిగుల్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రారంభం



**గజ్వేల్ జూలై 24 (ప్రజాజ్యోతి):** మండలంలోని తిగుల్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.గ్రామం నుంచి ప్రతిరోజూ విద్యార్థులు ఉన్నత విద్య కోసం గజ్వేల్ కు వెళ్లాల్సి ఉండగా, సరైన బస్సు సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ రజిత పరుశురాం, మాజీ సర్పంచ్,రాంనగర్ సర్పంచ్ రజిత మల్లేశం,సీనియర్ జర్నలిస్టు కప్పర రాంప్రసాదరావు, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య తదితరులు పలుమార్లు గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రాలు అందజేశారు.వారి విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ తిగుల్ గ్రామానికి ప్రతిరోజూ ఉదయం 9:00 నుంచి 9:10 గంటల మధ్య గజ్వేల్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కొత్తగా ప్రారంభమైన బస్సుకు శుక్రవారం గ్రామంలో ఘన స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రామచంద్ర రెడ్డి, కోటయ్య, ఎల్లారెడ్డి కరుణాకర్ రెడ్డి, నాయకులు ఐలయ్యతో పాటు గ్రామ పెద్దలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు గ్రామస్థులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బస్సు సేవతో విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని వారు పేర్కొన్నారు.

# ఎల్లయ్య కుటుంబాన్ని పరామర్శించిన పూజల హరికృష్ణ



**సిద్ధిపేట అర్బన్ ,జులై 24,(ప్రజాజ్యోతి):** సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు మాసంపల్లి ఎల్లయ్య ఇటీవల మృతిచెందిన విషయం తెలుసుకున్న సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన పూజల హరికృష్ణ, ఆయన మరణం గ్రామానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కాంగ్రెస్ పార్టీ తరపున వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. దివంగత ఎల్లయ్య ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అర్బన్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బిక్షపతి, నాయకులు మార్క సతీష్, సత్యనారాయణ, నవీన్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొని మాసంపల్లి ఎల్లయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలియజేశారు.

# ఎన్‌టీఏను రద్దుచేయాలి




**సిద్ధిపేట రూరల్, జులై 24,(ప్రజాజ్యోతి):** నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలు, ప్రశ్నాపత్రాల లీకేజీలకు నిరసనగా యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని యూఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి గుడికందుల రవి తెలిపారు. సిద్దిపేట జిల్లాలో విద్యార్థులు, యువత, విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని కేంద్ర ప్రభుత్వ విద్యా విధానాలపై తమ నిరసనను వ్యక్తం చేశారన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు పూర్తి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ను రద్దు చేసి పారదర్శకమైన పరీక్షల వ్యవస్థను తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థుల సమస్యల పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించిన ఆయన, నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన పోలీసు దాడులను ఖండించారు. ఈ ఘటనలపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో నిష్పక్షపాత విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరారు.విద్యార్థులపై జరిగిన దాడికి నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోడీ దేశ విద్యార్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని యూఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేసిన విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాలు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలకు యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పుట్ల హేమంత్, నాయకులు ప్రవీణ్, సాయి, అభినవ్, మణికంఠ, రాకేష్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.




# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- 18 వ వార్డులో ఫ్రైడే- డ్రైడే
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్

**దుబ్బాక ప్రతినిధి , జులై 24( ప్రజా జ్యోతి)** మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని, పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని దుబ్బాక మున్సిపల్ కమిషనర్ ఏ.మహేష్ కుమార్ అన్నారు. శుక్రవారం రోజున దుబ్బాక 18వ వార్డులో నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ శ్రీరాం సరస్వతి తో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వార్డులోని ఎంపీపీఎస్ నెంబర్-1 పాఠశాలలో పిచ్చి మొక్కల, వ్యర్థాల తొలగింపుతో పాటు విద్యార్థుల మధ్యాహ్న భోజనం తయారీ వంటగదిని, పాఠశాలల శౌచాలయాలను పరిశీలించారు. అనంతరం వార్డుల్లో మురుగు కాలువలను, పిచ్చి మొక్కలతో నిండిన ఖాళీ స్థలాలను, అపరిశుభ్రంగా ఉన్న నీటి ట్యాంకును పరిశీలించి, రసాయనాలను పిచికారి చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఇళ్లల్లో నిల్వ ఉంచిన నీటిని పారిశుధ్య సిబ్బందితో తొలగింప చేసి, ఇంటి యజమానులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన చుట్టూ ఉన్న పరిసరాల్లో నిల్వ నీరు ఉండడం వల్ల వాటిపై దోమలు వ్యాప్తి చెంది డెంగ్యూ, మలేరియా వ్యాధులు, అపరిశుభ్ర పరిసరాలతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. ప్రధానంగా ఇంటి చుట్టూ నీటి తొట్టిల్లో, పాత టైర్లు, కుండలు, డబ్బాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాలువల్లో, ఖాళీ ఇళ్ల స్థలాల్లో దోమల నియంత్రణకు బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు, రసాయనాల పిచికారి, ఫాగింగ్ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.తరుగుతున్న భూగర్భ వనరులను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, వాన నీటిని కాపాడుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, నాయకులు శ్రీరామ్ నరేందర్, అనంతుల శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆకుల భరత్, పీహెచ్సీ సిబ్బంది గణేష్, మున్సిపల్ సిబ్బంది రాజశేఖర్, అనిల్, మెప్మా, ఆశా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.







# నీట్ లీక్‌పై కాంగ్రెస్ ఆందోళన

- సిద్దిపేటలో బైక్ ర్యాలీ, విద్యాసంస్థల బంద్



**సిద్దిపేట,జులై 24,(ప్రజాజ్యోతి):** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ ఘటనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం సమర్పించి నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు పాఠశాలలు, కళాశాలలను బంద్ చేయించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పూజల హరికృష్ణ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీతో దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ తరపున కేంద్ర ప్రభుత్వానికి పలు డిమాండ్లు చేశారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు బాధ్యులైన వారిపై వేగవంతమైన విచారణ జరిపి కఠిన శిక్షలు విధించాలని, లీకేజీ ప్రభావంతో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులను పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, వారికి మద్దతుగా వెళ్లిన కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమన్నారు. విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అత్తు ఇమామ్, ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ, డీసీసీ మహిళా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు రషద్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు అజ్మత్, అర్బన్ మండల అధ్యక్షుడు బిక్షపతి, చెంది శ్రీనివాస్ ముదిరాజ్, చంద్ పాషా, కరుణాకర్, వంశీతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నీట్ అక్రమాలపై కేంద్రం బాధ్యత వహించాలి




**సిద్దిపేట అర్బన్ ,జులై 24,(ప్రజాజ్యోతి):** నీట్ పరీక్షల్లో చోటుచేసుకున్న పేపర్ లీకేజీలు, అక్రమాలకు నిరసనగా ఎస్ఎఫ్ఐ, వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు సిద్దిపేట జిల్లాలో విశేష స్పందన లభించిందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనడంతో జిల్లాలో విద్యాసంస్థలు పూర్తిగా మూతపడ్డాయన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకలు, పేపర్ లీకేజీలు దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై జరిగిన దాడులపై పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ను రద్దు చేయాలని, వీబీఎస్ఏ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం నిర్వహించిన ఈ బంద్‌ను విజయవంతం చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, విద్యార్థులు, మేధావులు, ప్రజాసంఘాలు మరియు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఎస్ఎఫ్ఐ తరఫున బత్తుల అభిషేక్ భాను కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చెప్యల సంతోష్, నాయకులు సంజయ్, విజయ్, నవదీప్, రుతిన్, రిషి, కిరణ్, వంశీ, లక్ష్మణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగుల వాహనాల పంపిణీలో అక్రమాలపై కలెక్టరేట్ ముట్టడి



**సిద్దిపేట రూరల్,జులై 24,(ప్రజాజ్యోతి):** దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందించే బ్యాటరీ వాహనాలు, ఇతర సహాయక పరికరాల పంపిణీలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై ఈ నెల 27 న సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలంగాణ దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం అధ్యక్షుడు కెమ్మసారం అశోక్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వాహనాలు, ఇతర పరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని ఇప్పటికీ లబ్ధి పొందని అర్హులైన దివ్యాంగులు అందరూ తప్పనిసరిగా ధర్నాకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.దివ్యాంగుల వాహనాల పంపిణీలో పారదర్శకత పాటించకుండా ఒకే వ్యక్తికి రెండు వాహనాలు కేటాయించినట్లు తమ వద్ద పూర్తి ఆధారాలు ఉన్నాయని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వాలని, వాస్తవాలను ప్రజల ముందుంచాలని డిమాండ్ చేశారు.అర్హులైన దివ్యాంగులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్న కెమ్మసారం అశోక్, వాహనాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క దివ్యాంగుడు ఈ నెల 27న జరిగే కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొని ఉద్యమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## మృతుని కుటుంబాన్ని పరామర్శించిన వంటేరు ప్రతాప్ రెడ్డి



**గజ్వేల్, జూలై 24:** మృతుని కుటుంబాన్ని పరామర్శించిన బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి.శుక్రవారం మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు బట్టు బాల్‌రామ్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందగా,గజ్వేల్ పట్టణంలోని వారి నివాసానికి వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారితో పాటు తిగుల్ మాజీ సర్పంచ్ సుధాకర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య, ఉప సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఎల్లయ్య, అశోక్, శ్రీకాంత్,పరశురాములు, నాగరాజు తదితరులు ఉన్నారు.

# కొడంగల్ నియోజకవర్గంలో 80.85 % ఈ ఎఫ్ డిజిటలైజేషన్ పూర్తి

**కొడంగల్ నియోజకవర్గం 72 సర్ అసెంబ్లీ కన్వీనర్ మాణిక్యం మల్లేష్ యాదవ్**



**కొడంగల్ జులై 24 ప్రజా జ్యోతి :** ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి కొడంగల్బ నియోజకవర్గ 72లో ఏ న్యూమరేషన్ ఫారం డిజిటలైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని కొడంగల్ సర్ అసెంబ్లీ కన్వీనర్ మాణిక్యం మల్లేష్ యాదవ్ తెలుపుతూ శుక్రవారం సాయంత్రానికి 2,51,255 మంది ఓటర్లకు గాను 2,03,132 ఎన్యుమరేషన్ ఫారాలు డిజిటలైజేషన్ 80.85 శాతానికి చేరుకుందని ఇంకా ఎన్నిమరేషన్ ఫారాలు అందనివి 48,123 ఉన్నయని మిగిలిన వాటిని రెండు మూడు రోజుల్లో ఎన్యుమరేషన్ ఫారాలు ఓటర్లతో తీసుకొని100 శాతం డిజిటలైజేషన్ చేస్తామని తెలిపారు. ఉమ్మడి కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని మండలాల్లో దౌల్తాబాద్ మండలం 79.93% మద్దూర్ మండలం 81.49% కొత్తపల్లి మండలం80.58% కోస్గి మండలము 76.97% గుండుమల్ మండలము 81.25% బొమ్రాస్పేట్ మండలము 84.46% దుద్యాల మండలము 80.86% కోడంగల్ మండలము81.75% శుక్రవారం సాయంత్రానికి కొడంగల్ నియోజకవర్గంలో 72లో మరణించిన వారు 8357 శాశ్వత మార్పు చేసుకున్నవారు 10611, గైర్హాజరైన వారు, 2090 ఇతరులు 61 బిఎల్ఓలు విస్తృతంగా గ్రామాలలో పర్యటిస్తూ ఓటర్ల అందరిని చైతన్య పరుస్తూ సర్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నారని బిఎల్ఓ లను ప్రశంసించారు ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా 100% పూర్తి చేస్తామని తెలిపారు.

# ముందస్తు అరెస్టులు చేయడం అప్రజాస్వామ్యం




**కొడంగల్ జులై 24 ప్రజా జ్యోతి :** నీట్ పరీక్ష పేపర్ లీక్‌ని అడ్డశీ పెట్టుకుని దేశం లో అల్లర్లు సృష్టించాలని చూస్తున్న కొందరు విద్యార్థి ముసుగులో సీజేపీ ఆధ్వర్యంలో చేస్తున్న దేశ వ్యతిరేకులకు వ్యతిరేకంగా భారతీయ జనతా పార్టీ తలపెట్టిన మహా ధర్నాలో పాల్గొనకుండా శుక్రవారం ఉదయం 5 గంటలకు భారతీయ జనతా పార్టీ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించడంతో అరెస్ట్ అయిన భారతీయ జనతా పార్టీ నాయకులు మాట్లాడుతూ ముందస్తు అరెస్టులు చేయడం అ ప్రజాస్వామికమని పోలీసుల తీరును ఎండ కొడుతూ ఎన్ని కుట్రలు పన్నినా భారత దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయడం ఎవరి వల్ల సాధ్యం కాదు అనే విషయం కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఇతర రాజకీయ పార్టీలు గమనించాలని హితవు పలుకుతూ అక్కడ అమాయక విద్యార్థుల భవిష్యత్ ని మీ స్వార్థం కోసం బలి చేస్తున్నారని

రాహుల్ గాంధీ చిల్లర వేషాలు చేస్తున్నారని దేశంలోని ప్రజలందరూ గమనిస్తున్నారని మీకు తగిన గుణపాఠం చెప్పేరోజులు దగ్గర్లోనే ఉన్నాయి తెలిపారు అరెస్ట్ అయిన వారిలో టౌన్ మరియు మండల నాయకులు గంటి సర్వేశ్ , కరాటే శ్రీనివాస్ , మహేష్ కుమార్, మొగులప్ప తదితర భారతీయ జనతా పార్టీ నాయకులను అరెస్టు చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు**

**పాలకవర్గంతో కలిసి ప్రతి ఇంటికి 6 మొక్కలు అందజేసిన సర్పంచ్ శ్రీరాములు**



**కొత్తూర్ జులై 24 (ప్రజా జ్యోతి) :** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, ఇందుకోసం అందరూ కృషి చేయాలని మక్తగూడ సర్పంచ్ బోకుల శ్రీరాములు అన్నారు. శుక్రవారం కొత్తూరు మండలంలోని మక్తగూడలో పాలకవర్గంతో కలిసి ఇంటింటికి ఆరు మొక్కలు సర్పంచ్ బోకుల శ్రీరాములు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ మనుగడ సాఫీగా సాగాలంటే పర్యావరణం సమతుల్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాట్న రాజు, ఉప సర్పంచ్ రాములు గౌడ్, వార్డు సభ్యులు బోకుల రాజు, శ్రీను, నాయకులు లింగం, పాండు, శ్రీను, శ్రీశైలం, నరేష్, నజీర్, మల్లేష్, కుమార్, శేఖర్, ఖాదర్, చంద్రయ్య, కొమరమ్మ, సుజాత, ప్రభాకర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల పాత్ర కీలకం

- సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్
- నందిగామ నూతన సీఐ వీరబాబును సన్మానించిన సిడి తాండ పాలకవర్గం








**కొత్తూర్ జులై 24 (ప్రజా జ్యోతి) :** శాంతి భద్రతల పరిరక్షణతో పాటు బాధితులు ఇచ్చే ఫిర్యాదుల పై పారదర్శకంగా విచారణ చేపట్టి న్యాయం జరిగేలా చూడాలని సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహాన్ అన్నారు. శుక్రవారం నందిగామ పోలీస్ స్టేషన్లో నూతన సీఐ వీరబాబును సిడి తాండ సర్పంచ్ గబ్రు చౌహన్ పాలకవర్గంతో కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రవీందర్ నాయక్, సింగల్ విండో డైరెక్టర్ రూప్సింగ్ నాయక్,కాంగ్రెస్ పార్టీ నందిగామ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను నాయక్, వార్డు సభ్యులు బుజ్జి శంకర్ నాయక్,శాంతి శ్రీను నాయక్,పత్తి శ్రీను నాయక్,తాండ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్ యువతి మృతి పట్ల ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన



**కొడంగల్ జులై 24 ప్రజా జ్యోతి :** నీట్ పరీక్ష పత్రాల లీకేజ్ పైన విద్యార్థులు ఢిల్లీ నడి బొడ్డున జంతర్, మంతర్ వద్ద నిరసన చేస్తున్న విద్యార్థుల పైన ఢిల్లీ పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ యువతీ,యువకుల పైన లాఠీచార్యులు చేస్తూ టియర్ గ్యాస్ ను ఉపయోగిస్తూ అనేకమంది విద్యార్థిని విద్యార్థులను గాయపరిచి భయభ్రాంతులకు గురి చేయడం ఈ లాఠీ తూటాలకు యువతి మృతి పట్ల కొడంగల్ పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు ఎర్రన్ పల్లి శ్రీనివాస్,సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బుస చంద్రయ్యలు మాట్లాడుతూ పేపర్ లీకేజీ పైన ప్రశ్నిస్తే పోలీసులు ఇలాంటి దుర్ఘటనలకు పాల్పడడం సరికాదని ఢిల్లీ పోలీసులు మరిచిపోయి అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మల ప్రవర్తిస్తూ ఎంతో మంది విద్యార్థులను లాటిలు,తూటాలతో పొట్టన పెట్టుకుంటున్నారని విమర్శించారు నీటి పరీక్ష పత్రాల లీకేజీ నుంచి ప్రజల మైండ్ డైవర్ట్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆడుతున్న నాటకమే ఈ లాటి చార్జ్ అని ఎద్దేవా చేశారు ఇప్పటికైనా దేశ ప్రధాని చొరవ తీసుకొని, కేంద్ర మంత్రివర్గం నుండి ధర్మేంద్ర ప్రధాన్ ను ధర్మేంద్ర ప్రధాన్ చేత రాజీనామా చేయించి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకులు అన్నారం సాయిలు, కెవిపిఎస్ నాయకులు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రాములు, రైతు సంఘం నాయకులు కృష్ణ ఎస్ఎఫ్ఐ విద్యార్థి నాయకుడు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# జాఫర్‌పల్లి సర్పంచ్ మహేష్‌కుమార్‌కు పరిగి మండల సర్పంచుల సంఘం అధ్యక్ష బాధ్యతలు..





**- ఏకగ్రీవ ఎన్నిక.. గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానన్న నూతన అధ్యక్షుడు**

**పరిగి, జూలై 24 (ప్రజాజ్యోతి) :** పరిగి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడిగా జాఫర్‌పల్లి గ్రామ సర్పంచ్ మహేష్‌కుమార్‌ను శుక్రవారం పరిగి పట్టణంలో ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి నివాసంలో నిర్వహించిన సమావేశంలో మండలంలోని సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు మహేష్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పరిగి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకట్ రాములు సహకారంతో పాటు ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి దృష్టికి గ్రామాల సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నిరుపేదలకు గృహాల నిర్మాణం, కాలనీల్లో రహదారుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల సంఘం నూతన కార్యవర్గాన్ని కూడా ప్రకటించారు. మండల ఉపాధ్యక్షుడిగా వి. గోపాల్, ప్రధాన కార్యదర్శిగా బాలరాజ్, కార్యదర్శిగా హరిచందర్, కోశాధికారిగా లక్ష్మీబాయి, కార్యదర్శిగా శంకర్ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కే. యాదమ్మ, మహమ్మద్ ఆయేషా బేగం, జి. అలవేలు, కె. కమలాభాయి, సోమగారి పులిందర్, సి. వెంకటమ్మ, జె. భూషణ్ రెడ్డి, ఉప్పరి సోని, జి. మంజుల, ధన్సింగ్, ఆశప్ప తదితరులను ఎంపిక చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పరిగి మండల అధ్యక్షుడు వెంకట్ రాములు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజపుల్లారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ నాగవర్ధన్, యూత్ కాంగ్రెస్ పరిగి పట్టణ అధ్యక్షుడు గౌతమ్‌తో పాటు పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నిలిచిన భగీరథ నీరు... ప్రజల దాహం తీర్చేందుకు సర్పంచ్ క్షేత్రస్థాయిలో సేవలు




**- కేసారం గ్రామంలో తాగునీటి సంక్షోభం.. ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ప్రజలకు అండగా నిలిచిన సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య**

**మోమిన్‌పేట్. జూలై 24 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట్ మండల పరిధిలోని కేసారం గ్రామంలో మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌లో లీకేజీ ఏర్పడటంతో పైనుంచి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రామ ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడకుండా గ్రామ పంచాయతీ సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య స్వయంగా రంగంలోకి దిగి తాగునీటి సరఫరా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అవసరమైన ప్రాంతాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తాగునీటిని అందిస్తూ గ్రామస్తుల దాహార్తిని తీర్చేందుకు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి వార్డులో పరిస్థితిని స్వయంగా పరిశీలిస్తూ తగిన చర్యలు చేపడుతున్నారు.

గ్రామంలో తాగునీటి సంక్షోభ సమయంలో ప్రజాప్రతినిధిగా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సమస్య పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో శ్రమిస్తున్న సర్పంచ్ గుజ్జరి కిష్టయ్యను గ్రామస్తులు అభినందిస్తున్నారు. అధికారులు ప్రధాన పైప్‌లైన్ లీకేజీని అత్యవసరంగా మరమ్మతు చేసి, మిషన్ భగీరథ నీటి సరఫరాను త్వరితగతిన పునరుద్ధరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుజ్జరి కిష్టయ్య మాట్లాడుతూ, "ప్రధాన పైప్‌లైన్ మరమ్మతులు పూర్తై భగీరథ నీటి సరఫరా పునరుద్ధరించే వరకు గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కొనసాగిస్తాం. ప్రతి ఇంటికి తాగునీరు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తున్నాం" అని తెలిపారు.

# ఉద్యోగులకు బదిలీ తప్పనిసరి





**- జిన్గుర్తిలో ఘనంగా వేడుకల సమావేశం**

**- పంచాయతీ కార్యదర్శులకు ఘన సన్మానం**

**తాండూరు జులై 24 ప్రజా జ్యోతి :** ప్రభుత్వ ఉద్యోగుల కు ఒక్కస్థానం నుంచి మరో స్థానానికి బదిలీ కావడం తప్పనిసరి అని గ్రామ సర్పంచ్ మడపతి శరణ్, స్థానిక ప్రధానోపాధ్యాయులు విజయ భాస్కర్ రెడ్డి, నాగప్పలు గుర్తు చేశారు. శుక్రవారం రోజు తాండూరు మండలం జిన్గుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సర్పంచ్ శరణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన పంచాయతీ కార్యదర్శి రాములు వీడుకోల సమావేశానికి పలువురు ప్రభుత్వ ఉద్యోగులు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్యదర్శిగా రాములు గత నాలుగు సంవత్సరాల పాటు ప్రజలకు సన్నిహితంగా ఉంటూ సోదరా భావం తో ముందుకు వెళుతు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులకు చేరివిధంగా అవగాహన కల్పిస్తూ పనిచేసారని గుర్తు చేశారు. రెండు పర్యాయాలు ఈ గ్రామానికి ప్రత్యేక అధికారి పాలనలో కూడా ఏ విధమైన ఇబ్బందులు తెలుస్తుందా ప్రజలకు సన్నిహితంగా ఉండి పని చేశారని గుర్తు చేశారు.

ప్రస్తుతం ఇన్చార్జిగా ఉన్న పంచాయతీ కార్యదర్శి నర్సిరెడ్డి కూడ ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తారని నమ్మకం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ పద్మమ్మ, స్థానిక పెద్దలు రామలింగారెడ్డి, అజ్మత్ అలీ, ఆశమలీ, శామప్ప, శ్రీనివాస్ గౌడ్, పి.రాములు, పి.నర్సిములు, దాసు, దేవదాసు, గోవింద్, ఎల్లయ్య, పంచాయతీ కార్యదర్శి నర్సిరెడ్డి, నరేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## పెద్ద తుప్పరలోని వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన మాజీ ఎంపీపీ జయమ్మ శ్రీనివాస్

**రాజేంద్రనగర్, జూలై 24 (ప్రజా జ్యోతి) :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం పెద్ద తుప్పరలో శంషాబాద్ మండలం మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పెద్ద తుప్పరలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు పనులు పంపిణీ చేసి వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ శ్రీనివాస్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటీఆర్ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు వర్ధిల్లాలని మరియా సదన్ లో ప్రత్యేక ప్రార్థనలు చేయించడం జరిగిందన్నారు. కేటీఆర్ ముందు చూపుతో హైదరాబాద్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మంచెల మోహన్ రావు, ప్రధాన కార్యదర్శి గౌస్ పాషా, ఉపాధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, పెద్ద తుప్పర సర్పంచ్ సుమలత రాజు యాదవ్,ప్రసాద్ గౌడ్, దిద్యాల శశాంక్,దిద్యాల గౌతమ్, కుమార్ యాదవ్, అశోక్, సునీత, రాజు, దాసు, విజయ్, చింటూ, అరవింద్, శివ, ప్రకాష్, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో ఘనంగా మాజీ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలు





# 8వ వార్డులో ఇంటింటి సర్వే

**- మైగ్రేషన్ ఫారాల సేకరణ**





**పరిగి, జూలై 24 (ప్రజాజ్యోతి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నేపథ్యంలో పరిగి మున్సిపాలిటీ 8వ వార్డులో మైగ్రేషన్ ఫారాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిగి ఎమ్మెల్యే డా. టి.రాంమోహన్ రెడ్డి సూచనలు, మున్సిపల్ కమిషనర్ మల్లేష్ ఆదేశాల మేరకు 8వ వార్డు కౌన్సిలర్ హబీబునిస అయ్యుబ్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లు (బిఎల్ఏలు), బూత్ లెవల్ అధికారులు (బిఎల్ఓలు) ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలిస్తూ మైగ్రేషన్ ఫారాలను సేకరించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాలో మార్పులు, చిరునామా మార్పులు, ఇతర వివరాల నమోదుపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిఎల్ఏలు అంజి, శివాజీ, రమేష్, వెంకటేష్, బిఎల్ఓలు సమ్రీన్, అషు, రెహానా పాల్గొని సర్వే నిర్వహించారు. కాలనీవాసులు కూడా సహకరించి అవసరమైన వివరాలను అందజేశారు.

# ప్రజల మనిషి కేటీఆర్


**- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్**


**- కొత్తూరులో మున్సిపాలిటీ అధ్యక్షురాలు కోస్గి భగవద్గీత,మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు**

**- హాజరైన తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, సీనియర్ నాయకుడు కడెం పల్లి శ్రీనివాస్ గౌడ్**




**కొత్తూర్ జులై 24 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కేంద్రం లోని ఎస్బిఐ బ్యాంక్ ఎదుట బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీ శాఖ మంత్రి తారక రామారావు జన్మదిన వేడుకలను మున్సిపాలిటీ అధ్యక్షురాలు కోస్గి భగవద్గీత,మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తాజా మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్,సీనియర్ నాయకుడు కడెం పల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై, కేక్ కట్ చేసి కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో కేటీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని, ప్రజల సంక్షేమం, పారిశ్రామికాభివృద్ధి, సమాచార సాంకేతిక రంగంలో రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపిన నాయకుడిగా కేటీఆర్ గుర్తింపు పొందారని అన్నారు. కేటీఆర్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాని, నిండూ నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ పంపిణీ చేసి జన్మదిన వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వంకాయల నారాయణరెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు కోస్గి శ్రీనివాస్, సోమ్లా నాయక్, అనిత శ్రీనివాస్ గౌడ్, మాధవి గోపాల్ గౌడ్, ప్రసన్నలత యాదయ్య, మాజీ సర్పంచ్ వన్నం బాలరాజ్, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, గూడూరు మాజీ ఎంపిటిసి లక్ష్మణ్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోవింద్ రెడ్డి, కర్రోల లక్ష్మయ్య,దేశాల జైపాల్, జోగు బాలరాజ్, మధుసూదన్ రావు,జంగ గళ్ళ శివకుమార్, దిలీప్, బ్యాగరి రాజు, కడాల శ్రీశైలం, పీర్లగూడెం శ్రీశైలం గౌడ్,కుమ్మరి వెంకటేష్, దేశాల భీమయ్య, ఆంజనేయులు, శ్రీను చారి, యాదయ్య, జంగయ్య యాదవ్, భాస్కర్ గౌడ్, బాలు, మేకల రాఘవేందర్ యాదవ్, రాము, కృష్ణ, చింటు, తదితరులు పాల్గొన్నారు.



# నీట్ లీక్‌పై నిరసన..కొడిమ్యాలలో విద్యాసంస్థల బంద్

కొడిమ్యాల,జూలై 24,(ప్రజాజ్యోతి):
నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ ఘటనకు నిరసనగా మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యాసంస్థల బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, నీట్ లీక్ వ్యవహారానికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను





కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై శాంతియుతంగా ఆందోళన చేపడుతున్న విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం దారుణమని పేర్కొన్నారు. విద్యార్థులకు మద్దతుగా నిరసనలో పాల్గొన్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని పోలీసులు అన్యాయంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. పోలీసుల నిరంకుశ వైఖరికి నిరసనగా, విద్యార్థి సంఘాలకు సంఘీభావం తెలుపుతూ ఈ బంద్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోగూరి నాగభూషణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముత్యం శంకర్, మండల అధ్యక్షుడు గాజుల అజయ్ గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరి రాజేష్,మాజీ డైరెక్టర్ మల్లికార్జున్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు జమల్పురి నిఖిల్, తాళ్లపల్లి విక్రమ్ గౌడ్,అంతడుపుల జలందర్, గుడి రమణారెడ్డి, కవ్వం మధు, తిరుపతి రెడ్డి, పవన్, ప్రసాద్, వంశీ, విశాల్, అజయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సింగపూర్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు

కొడిమ్యాల, జూలై 24,(ప్రజాజ్యోతి):
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 50వ జన్మదినాన్ని పురస్కరించుకుని సింగపూర్‌లో నివసిస్తున్న తెలంగాణ ఎన్నారైలు శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా



వివిధ జిల్లాలకు చెందిన ఎన్నారైలు ఒకేచోట చేరి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కేటీఆర్ జన్మదిన కేక్ కట్ చేసి వేడుకల్లో పాల్గొన్నారు. రంజిత్ రావు, పెద్ది చంద్రశేఖర్ రెడ్డి, సూపర్ డీలక్స్ హోటల్ శ్రీకాంత్, ఉష ఆహ్వానం మేరకు ఈ కార్యక్రమం నిర్వహించారు. వేడుకల్లో రంజిత్ రావు, పెద్ది చంద్రశేఖర్ రెడ్డి, శ్రీకాంత్, రంజిత్ రెడ్డి, సినీ దర్శకుడు రజిని కుమార్తె అలేఖ్య, బైరి రవి, జిత్తు మణికంఠ, రవికిరణ్‌తో పాటు సుమారు 50 మంది ఎన్నారైలు పాల్గొన్నారు.

## గర్రెపల్లి సింగిల్ విండో చైర్మన్‌గా జానీ బాధ్యతల స్వీకరణ

సుల్తానాబాద్, జూలై 24: (ప్రజా జ్యోతి)
సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) నూతన చైర్మన్‌గా కల్లేపల్లి జానీ, వైస్ చైర్మన్‌గా బండారి రమేష్ శుక్రవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఈఓ నబిద్దీన్ నూతన చైర్మన్,





వైస్ చైర్మన్‌లకు శాలువాలు కప్పి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.
బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన చైర్మన్ కల్లేపల్లి జానీ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే తమ ప్రథమ లక్ష్యమని పేర్కొన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఎరువులు, విత్తనాలు, రుణాల పంపిణీ వంటి సేవలను పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. రైతుల విశ్వాసానికి అనుగుణంగా సహకార సంఘాన్ని మరింత అభివృద్ధి దిశగా నడిపిస్తామని, పాలకవర్గ సభ్యుల సహకారంతో సంఘం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని అన్నారు ఈ అవకాశం కల్పించిన ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయ రమణారావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పడాల అజయ్ గౌడ్, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గర్రెపల్లి సింగిల్ విండో రైతులకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ ఆదర్శ సహకార సంఘంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు, రైతులు, సహకార సంఘం సిబ్బంది, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి రీ-సర్వే ద్వారా భూముల హక్కులకు శాశ్వత భద్రత

### రైతులు పూర్తి సహకారం అందించాలి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్.. సంగెం గ్రామంలో భూ భారతి రీ-సర్వే అవగాహన సదస్సు

(కోరుట్ల రూరల్, ప్రజా జ్యోతి, జూలై 24)
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూ భారతి రీ–సర్వే కార్యక్రమం శుక్రవారం కోరుట్ల మండలం సంగెం గ్రామంలోని సంగమేశ్వర ఫంక్షన్ హాల్ లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ రి–సర్వే ద్వారా గ్రామంలోని అన్ని భూములను శాస్త్రీయ పద్ధతిలో కొలిచి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త మ్యాపులను రూపొందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, రైతులు చురుకుగా పాల్గొని సర్వే బృందానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూ భారతి రీ–సర్వేలో భాగంగా ముందుగా గ్రామ సరిహద్దులను శాశ్వతంగా నిర్ధారిస్తారు. అనంతరం గ్రామ కంఠం (ఇళ్ల విస్తీర్ణం ఉన్న ప్రాంతం) లోని ప్రతి ఇంటిని ఆధునిక సర్వే పరికరాల ద్వారా మళ్లీ కొలిచి పాయింట్లు నమోదు చేసి గ్రామంలోని ఇళ్ల సరిహద్దులను ఖరారు చేస్తారు. తదుపరి దశలో ప్రభుత్వ భూముల సరిహద్దులను గుర్తించి సర్వే నిర్వహిస్తారు ఇందులో ప్రభుత్వానికి చెందిన చెరువులు, కాలువలు,



రహదారులు, ప్రభుత్వ స్థలాలు, పోరంబోకు భూములు మరియు ఇతర ప్రభుత్వ ఆస్తులన్నింటినీ కచ్చితంగా మ్యాపింగ్ చేసి నమోదు చేస్తారు. గ్రామ సరిహద్దు, గ్రామ కంఠం, ప్రభుత్వ భూముల సర్వే పూర్తయిన తర్వాత పట్టా భూముల రీ– సర్వే ప్రారంభమవుతుంది. ఇందుకోసం ప్రతి రైతుకు భూభారతి చట్టం ప్రకారం 9 (1) నోటీసు జారీ చేసి ముందస్తు సమాచారం అందజేస్తారు. నోటీసులో పేర్కొన్న తేదీ, సమయానికి రైతులు తప్పనిసరిగా తమ భూమి వద్ద హాజరు కావాలని సూచించారు. సర్వే సమయంలో రైతు ప్రస్తుతం అనుభవిస్తున్న (ఎంజాయ్ మెంట్ లో ఉన్న) భూమి ఆకృతి, హద్దులు, మూలాల పాయింట్లు, భూమి యొక్క వాస్తవ స్థితిని ఆధునిక సర్వే పరికరాల సహాయంతో నమోదు చేసి, ఖచ్చితమైన కో–ఆర్డినేట్లతో కొత్త డిజిటల్ మ్యాపులు రూపొందిస్తారు. రైతులు గ్రామ సరిహద్దు నిర్ణయించే సమయంలో, తమ భూముల సర్వయించే సమయంలో తప్పనిసరిగా అక్కడే ఉండి, తమ భూమి హద్దులను స్పష్టంగా చూపించి సర్వే బృందానికి పూర్తి సహకారం అందించాలని



అధికారులు కోరారు. ప్రజల సహకారంతోనే భూభారతి రీ–సర్వే కార్యక్రమం పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి అవుతుందని తెలిపారు. ఈ అవగాహన సదస్సుకు గ్రామ ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై భూ భారతి రీ–సర్వే పై పూర్తి అవగాహన పొందాలని విజ్ఞప్తి చేశారు. భూములపై భవిష్యత్తులో తలెత్తే వివాదాలను నివారించి ,ప్రతి భూ యజమానికి స్పష్టమైన హక్కులను కల్పించే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అందరూ సహకరించాలని కోరారు. సంగెం గ్రామంలో పంచాయతీ భవనం ,వివో భవనం ,డ్రైనేజీల నిర్మాణం కొరకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న వివో భవనాన్ని పరిశీలించి పూర్తిస్థాయిలో నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జీవాకర్ రెడ్డి, తహసిల్దార్ కృష్ణ చైతన్య ,ఎంపీడీవో రామకృష్ణ,రెవెన్యూ అధికారులు ,సర్వేయర్ కుమారస్వామి సంబంధిత అధికారులు మరియు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు 15% రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలి: కలెక్టర్‌కు బీజేపీ ఎస్సీ మోర్చా వినతి

జగిత్యాల టౌన్, జూలై 24 (ప్రజా జ్యోతి):
తెలంగాణ రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్సీ మోర్చా జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు



వినతిపత్రం సమర్పించారు. బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు క్రాంతి కిరణ్ సూచనల మేరకు జిల్లా అధ్యక్షులు నారపాక అశోక్ నేతృత్వంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నారపాక అశోక్ మాట్లాడుతూ, భారత రాజ్యాంగం సామాజిక న్యాయం, సమానత్వం, బలహీన వర్గాల సాధికారతను ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించిందని గుర్తుచేశారు. రాష్ట్రంలో ఉన్న దళిత జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడమే నిజమైన రాజ్యాంగ స్ఫూర్తి అని ఆయన పేర్కొన్నారు.దళితులకు తగిన రాజకీయ ప్రాతినిధ్యం లభించినప్పుడే వారి సమస్యలు శాసనసభలు, స్థానిక సంస్థలు, ఇతర ప్రజాప్రతినిధుల వేదికలపై సమర్థవంతంగా వినిపిస్తాయని అశోక్ అభిప్రాయపడ్డారు. సామాజిక న్యాయం బలోపేతం కావాలన్నా, ప్రజాస్వామ్యంలో అన్ని వర్గాలకు సమాన భాగస్వామ్యం దక్కాలన్నా 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు తప్పనిసరని అన్నారు. ఈ డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, రాబోయే ఎన్నికల్లో దళితులకు 15 శాతం రాజకీయ రిజర్వేషన్లు అమలు చేసేలా జగిత్యాల జిల్లా కలెక్టర్ తమ వంతు సిఫార్సు చేయాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, జిల్లా పదాధికారులు కొత్తూరి బాబు, బన్న సంజీవ్, తడగొండ అంజయ్య, దుర్గం రమేష్, కొత్తూరి అంజయ్య, దేవి సంతోష్, ఉయ్యాలా స్వామి, సట్ట రవి రాజు, కొదురుపాక అశోక్, కె లక్ష్మణ్, గిరిమళ్ళ రఘు, మంత్రి నాగరాజు, జిత్తవేణి శివకుమార్ తదితర పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# కుక్కల దాడి... 25 గొర్రెల మృతి..

★ బాధితుడికి ఎమ్మెల్యే భరోసా

కొడిమ్యాల, జూలై 25 (ప్రజాజ్యోతి):
గొర్రెల పెంపకాన్నే జీవనాధారంగా చేసుకుని కుటుంబాన్ని



పోషించుకుంటున్న ఓ గొర్రెల కాపరి కుటుంబానికి కుక్కల దాడి తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కోనాపూర్ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనలో 25 గొర్రెలు మృతి చెందగా, 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. బాధితుడు మిరుపాల పర్వతాలు తెలిపిన వివరాల ప్రకారం, ప్రతిరోజులాగే గురువారం రాత్రి తన గొర్రెల మందను గ్రామ శివారులో బందోబస్తుగా ఉంచడం జరిగిందని, అర్ధరాత్రి సమయంలో ఊరిలో సంచరిస్తున్న కుక్కల గుంపు ఒక్కసారిగా గొర్రెల మందపై దాడి చేసింది. ఈ దాడిలో 25 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. శుక్రవారం తెల్లవారుజామున గొర్రెల వద్దకు వెళ్లిన పర్వతాలు, గొర్రెలు మృతిచెంది ఉండటంతో పాటు అనేక గొర్రెలు రక్తపు గాయాలతో విలవిల్లాడుతున్న దృశ్యాన్ని చూసి కన్నీరుమున్నీరయ్యాడు. గాయపడిన గొర్రెలకు చికిత్స అందిస్తున్నామని, ఈ ఘటనతో తనకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ ఘటన విషయం తెలుసుకున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం బాధితుడు పర్వతాలతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, ఘటన వివరాలను జగిత్యాల జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రభుత్వం ద్వారా బాధితుడికి తగిన ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

## ముస్తాబాద్‌లో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సేవా కేంద్రం ప్రారంభం

ముస్తాబాద్, జూలై 24( ప్రజా జ్యోతి ):
ప్రజలకు ఆధునిక డిజిటల్ బ్యాంకింగ్ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో ముస్తాబాద్‌లోని అమెజాన్ సీఎస్‌సీ ఆన్‌లైన్ సర్వీసెస్ కార్యాలయంలో ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ సేవా కేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు.గ్రామీణ ప్రాంత ప్రజలు బ్యాంకులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా తమ గ్రామంలోనే సులభంగా బ్యాంకింగ్ సేవలను పొందేలా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కేంద్రంలో కొత్త బ్యాంకు ఖాతాల ప్రారంభం, నగదు జమ, నగదు ఉపసంహరణ, ఆధార్ ఆధారిత బ్యాంకింగ్ సేవలు, నగదు బదిలీ, ఖాతా నిల్వ వివరాల పరిశీలన, మినీ ఖాతా వివరాల ముద్రణ వంటి సేవలు అందుబాటులో ఉంటాయి. అలాగే కరువు పనుల వేతనాలు, ఇందిరమ్మ ఇళ్ల నిధులు, గ్యాస్ సబ్సిడీ, పింఛన్లు తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో జమయ్యే నగదును ఆధార్ ఆధారిత సేవల ద్వారా ఈ కేంద్రంలోనే సులభంగా ఉపసంహరించుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్, సతీష్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రజలు ఈ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకొని



సమయాన్ని, ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకోవాలని వారు సూచించారు.

## రాష్ట్ర క్యాబినెట్ హోదా లభించిన ప్రభుత్వ విప్ విజయరమణారావుకు అభినందనలు

పెద్దపల్లి ప్రతినిధి, జూలై 24 ప్రజా జ్యోతి:
రాష్ట్ర క్యాబినెట్ హోదా లభించిన తెలంగాణ ప్రభుత్వ విప్,



పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావును ఎలిగేడు మండలం శివపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో పెద్దపల్లి సిటీ కేబుల్ ఎండీ, పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ అధ్యక్షుడు, టీయూడబ్ల్యూజే, హెచ్–143, టీఈఎంజేయూ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు కొట్టే సదానందం మర్యాదపూర్వకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విజయరమణారావును శాలువాతో సన్మానించి, పూల బొకే అందజేశారు. రాష్ట్ర క్యాబినెట్ హోదా లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. దీనికి విజయరమణారావు కృతజ్ఞతలు తెలిపారు.

## కేటీఆర్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు పండ్లు, పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ముస్తాబాద్, జూలై 24 ( ప్రజా జ్యోతి ):
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరు గ్రామంలో సర్పంచ్ చీటి సునీత వెంకటనర్సింగరావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



శ్రీ కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అరటిపండ్లు, పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కేటీఆర్ ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని నాయకులు ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎదునూరి శ్రీనివాస్, 8వ వార్డు సభ్యుడు పుల్లూరి సంతోష్, ముస్తాబాద్ మండల బీఆర్ఎస్ యువ నాయకుడు వంగూరి దిలీప్, పార్టీ నాయకులు బత్తిని మహేష్, చెక్కపెల్లి వెంకటేష్, కోడూరి మనీష్, పుల్లూరి నవీన్, మెరుగు వెంకటేష్‌తో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కోరం లేక చొప్పదండి మున్సిపల్ సమావేశం వాయిదా

చొప్పదండి, జూలై 24(ప్రజాజ్యోతి): చొప్పదండి మున్సిపల్ సాధారణ సమావేశం కోరం లేక వాయిదా పడింది. చైర్ పర్సన్ వడ్లూరి సరిత శ్రీనివాస్, కమిషనర్ కీర్తి నాగరాజు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం



సమావేశం ఏర్పాటు చేశారు. వైస్ చైర్పర్సన్ పెరుమాండ్ల మానస గంగయ్య గౌడ్, రెండవ వార్డ్ కౌన్సిలర్ కొట్టే సునీత అశోక్ ,తొమ్మిదవ వార్డ్ కౌన్సిలర్ గుర్రం రాజేందర్ రెడ్డి, 11వ వార్డు కౌన్సిలర్ పిట్టల వెంకటేష్, 12 వ వార్డు కౌన్సిలర్ ముద్దం రాజేశ్వరి తిరుపతిగౌడ్ మాత్రమే హాజరయ్యారు. కోరం లేకపోవడంతో చైర్ పర్సన్ సమావేశాన్ని వాయిదా వేశారు.

## యంగ్ స్టార్స్ క్రికెట్ లీగ్ నేషనల్ క్యాంప్ కి ఎన్నికైనవిద్యార్థి

గంభీరావుపేట జూలై 24 (ప్రజా జ్యోతి);
గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంపీసీఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న ఎస్. లక్ష్మి కాంత్ గౌడ్ "యంగ్ స్టార్ క్రికెట్ లీగ్



నేషనల్ క్యాంప్" కు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్. ప్రొఫెసర్ .వి .విజయలక్ష్మి మరియు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోఆర్డినేటర్ పాక ధర్మపురి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ , యంగ్ స్టార్ క్రికెట్ లీగ్ ఢిల్లీ నేషనల్ క్యాంప్ కి తెలంగాణ నుంచి కేవలం ఇద్దరు యువకులు మాత్రమేఎంపికైనారనీ,వారిలో మన కళాశాలకు చెందిన ఎస్. లక్ష్మీకాంత్ గౌడ్ ఎంపిక కావడం గర్వకారణం అన్నారు.ఈ నేషనల్ క్యాంప్ తర్వాత జరిగే క్రికెట్ లీగ్ లో దాదాపు 20 లక్షలు ఆపైన పారితోషకం పొందుతారని తెలిపారు. తదనంతరం కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం విద్యార్థినీ విద్యార్థులు లక్ష్మీకాంత్ గౌడ్ ను అభినందించారు.

## బాలికల పాఠశాలలో
# సమస్యలపై ప్రజా సంఘాల సర్వే

● మౌలిక వసతులు కల్పించండి
● విద్యార్థినుల కోసం ప్రజా సంఘాల డిమాండ్



**కల్లూరు, జూలై 24 : ప్రజాజ్యోతి** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం తెలంగాణ రైతు సంఘం సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వేలో డిమాండ్ చేశారు శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన పరిశీలనలో విద్యార్థినుల విద్య భద్రత ఆరోగ్యానికి సంబంధించిన అనేక సమస్యలు వెలుగులోకి వచ్చినట్లు ప్రజా సంఘాల నాయకులు తెలిపారు పాఠశాల భవనాలు పాతబడి శిథిలావస్థకు చేరుకోవడంతో విద్యార్థినులు భయాందోళనల మధ్య విద్యను అభ్యసించాల్సిన పరిస్థితి నెలకొన్నది అన్నారు. ప్రమాదాలు సంభవించక ముందే భవనాలకు తక్షణ మరమ్మత్తుల చేపట్టడంతో పాటు అవసరమైన చోట కొత్త భవనాలు నిర్మించాలని కోరారు. పాఠశాల ప్రాంగణంలో కోతుల బెడద తీవ్రంగా ఉండడంతో మధ్యాహ్నం భోజన వంటశాలకు రక్షణ గ్రిల్ ఏర్పాటు చేయాలని, ప్రహరీ గోడ చుట్టూ సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేసి విద్యార్థినుల భద్రతను పెంపొందించాలని సూచించారు. తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆర్ ఓ శుద్ధి నీటి ప్లాంటును ఏర్పాటు చేసి స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. విద్యార్థినుల అవసరాలకు అనుగుణంగా పరిశుభ్రమైన మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లను మరమ్మతు చేసి నిరంతర నీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. నెలసరి సమయంలో అవసరమైన శానిటరీప్యాడ్ లను ఎల్లప్పుడు పాఠశాలలో అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అదేవిధంగా పాఠశాలలో ఖాళీగా ఉన్న క్రాఫ్ట్ టీచర్ సోషల్ స్టడీస్ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వం అందించాల్సిన యూనిఫామ్ లను ఆలస్యం చేయకుండా విద్యార్థినులకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం ద్వారానే పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన బాలికలకు నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. సర్వేలో గుర్తించిన సమస్యలను విద్యాశాఖ అధికారులు ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు విద్యార్థినుల భద్రత ఆరోగ్యం విద్య విషయంలో రాజీ పడకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డివిజన్ అధ్యక్షుడు తన్నీరు కృష్ణార్జునరావు, ఐద్వా డివిజన్ కార్యదర్శి తన్నీరు కృష్ణవేణి, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు దోమతోటి పుల్లయ్య, సిఐటియు నాయకుడు గంపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు







**చర్ల, జూలై 24:(ప్రజా జ్యోతి):** బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) 50వ జన్మదిన వేడుకలను చర్ల బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కన్వీనర్ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరిపారు. అనంతరం చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సుమారు 100 మంది రోగులకు బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దొడ్డి తాతారావు మాట్లాడుతూ తెలంగాణ అభివృద్ధి, పారిశ్రామిక రంగ విస్తరణ, ఐటీ రంగ ప్రగతి, యువతకు ఉపాధి అవకాశాల కల్పనలో కేటీఆర్ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రపంచస్థాయి ఐటీ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడంలో కేటీఆర్ కీలక పాత్ర పోషించారని అన్నారు . సుస్థిర పాలన, ప్రజా సంక్షేమం కోసం ఆయన నిరంతరం కృషి చేస్తూ దేశవ్యాప్తంగా యువ నాయకులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో, కేటీఆర్ మార్గదర్శకంలో పార్టీ రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, తోటపల్లి మాధవరావు, దినసరపు భాస్కర్ రెడ్డి, పంజా రాజు, కాకి అనిల్, కొంబత్తిని రాంబాబు, గోరింట్ల వెంకటేశ్వరరావు, బొజ్జ సాయి ప్రణయ్ (బాచి), బేతంచర్ల నర్స వేణి, ఉప్పరిగూడెం సర్పంచ్ సోయం నాగలక్ష్మి, పెద్ద మిసీలేరు సర్పంచ్ బెండబోయిన సుహాసిని, తేగడ సర్పంచ్ మురళి, పాశిగంటి సంధ్య, పాశిగంటి సంతోష్, కవ్వాల రాము, సింగ సంతోష్, రావుల కిషోర్, ఎడ్ల రామదాసు, తెల్లం లక్ష్మీనారాయణ, మామిడి రాజు, బట్ట కొమరయ్య, గుమ్మల నరేంద్ర, గుమ్మల సత్యనారాయణ, దుబ్బ సమ్మయ్య, సాదిక్, గాదంశెట్టి కిషోర్, సృజన్, కుకడపు సాయి, ఎర్రావుల ప్రేమ్, వంకాయల వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సమస్యల తీర్చాలని డిప్యూటీ సీఎం బట్టికి వినతి

● భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందజేసిన ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు



**సత్తుపల్లి జూలై24(ప్రజా జ్యోతి)** ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్, మినిమం వేజెస్ చైర్మన్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు,తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి శ్రీ మల్లు భట్టి విక్రమార్క కి స్థానిక శాసనసభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ ద్వారా ఐ.ఎన్.టీ.యూ.సీ వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు సత్తుపల్లి ఏరియా అభివృద్ధి, సింగరేణి కార్మికుల సంక్షేమం, సంస్థ బలోపేతానికి సంబంధించిన పలు కీలక అంశాలపై వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికుల తరఫున క్రింది ప్రధాన డిమాండ్లను వినతిపత్రంలో పొందుపరిచారు. సమస్యలతో కూడిన వినతిపత్రంలో గల ప్రధాన డిమాండ్లు తాడిచెర్ల బ్లాక్-2ను సింగరేణికి కేటాయించిన విధంగానే సత్తుపల్లి ఓసీ-3 బ్లాక్‌ను కూడా సింగరేణి సంస్థకే కేటాయించేలా చర్యలు తీసుకోవాలి,జేవీఆర్ సీహెచ్‌పీలో ప్రస్తుతం నిర్వహణ బాధ్యతలు చేపట్టిన ఏనార్గో కంపెనీ కాలపరిమితి ముగియనున్నందున, గతంలో మాదిరిగానే ఆ యూనిట్‌ను పూర్తిగా సింగరేణి కార్మికులతోనే నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలి,సత్తుపల్లి 12వ ఏరియాగా ఏర్పడినప్పటికీ ఇప్పటివరకు అన్ని విభాగాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు కాలేదు. సెక్యూరిటీ, పర్సనల్, ఫైనాన్స్ తదితర అన్ని విభాగాలతో పాటు అవసరమైన పూర్తి స్థాయి కార్యాలయ సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలి అని,ప్రస్తుతం ఉన్న సత్తుపల్లి డిస్పెన్సరీని పూర్తి స్థాయి ఏరియా ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలి అని,సత్తుపల్లి ఏరియాకు అవసరమైన ఏరియా వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసి నిర్వహణ పనులు సమర్థవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలి. పై సమస్యలన్నింటినీ సానుకూలంగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసి, వీలైనంత త్వరగా పరిష్కరించి సత్తుపల్లి ఏరియా అభివృద్ధికి తోడ్పడాలని ఐఎన్‌టీయూసీ నాయకులు ఉప ముఖ్యమంత్రిని కోరారు. వినతి పత్రం అందించిన వారిలో బ్రాంచ్ సెక్రటరీ మురళీకృష్ణ, బ్రాంచ్ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షక్రటక్ బాబు, పిట్ సెక్రటరీలు సీతారామరాజు,నగేష్,షణ్ముఖ చారి, శ్రీధర్, ఇక్బాల్, ఐవీ రెడ్డి, సందీప్, దాసరి శ్రీనివాస్, చెరుకు రాజు, సుభాని, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# ఘనంగా కేటీఆర్ జన్మదిన వేడుకలు.. మెగా రక్తదాన శిబిరం





**సత్తుపల్లి జూలై23(ప్రజా జ్యోతి)** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జన్మదినాన్ని పట్టణంలోని కిరాణా మర్చంట్స్ కళ్యాణ మండపంలో బీఆర్ఎస్ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసి కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసుకొని కేటీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని పరిశీలించి, రక్తదాతలను అభినందించారు. రక్తదాన శిబిరానికి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కేటీఆర్ అభిమానులు భారీ సంఖ్యలో హాజరై స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. శిబిరంలో దాదాపు 200 మందికి పైగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా బి.ఆర్.ఎస్ నాయకులు మాట్లాడుతూ తలసేమియా బాధితులతో పాటు,అత్యవసర పరిస్థితుల్లో రక్తం అవసరమయ్యే ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా ఈ రక్తాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌కు పంపిస్తున్నామని తెలిపారు. గతంలో కూడా వెయ్యి మందికి పైగా పాల్గొన్న భారీ రక్తదాన శిబిరాలను నిర్వహించామని గుర్తు చేశారు. ముఖ్య నాయకుల పుట్టినరోజు వేడుకలను, సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా సమాజానికి ఉపయోగపడటంతో పాటు ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని అన్నారు. చివరగా రక్తదాన శిబిరంలో పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, చాంద్ పాషా, అద్దంకి అనిల్, కోటగిరి సుధాకర్, పర్వతనేని వేణు, మారోజు సురేష్, వెదుళ్ళ నాగు, దొడ్డ శంకర్రావు, టిఆర్ఎస్ నాయకులు, విద్యార్థులు,వైద్యులు ఉన్నారు.

# నేలకొండపల్లిలో విద్యా సంస్థల బంద్ ప్రశాంతం





**నేలకొండపల్లి, జూలై 24 ప్రజాజ్యోతి:** ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలంలోని గ్రామాల్లో విద్యా సంస్థల బంద్ ప్రశాంతంగా జరిగింది. నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు పిలుపు మేరకు యువజన కాంగ్రెస్ అధ్వర్యంలో విద్యా సంస్థల బంద్ లో ఆయా పాఠశాల కు వెళ్లి బంద్ విజయవంతం చేయాలని కోరారు..ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నీట్ పేపర్ లీకేజీ వివాదానికి వ్యతిరేకంగా శాంతియుతంగా నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీ ఛార్జ్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు..అదే విధంగా విద్యార్థులకు తరుపున ప్రశ్నించే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు... కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.. కోనాయిగూడెం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల వెంకటేశ్వర్లు చెరుకుపల్లి రాజేష్, మందడి నాగ శ్రీను, నరసింహారావు, కాస్తల నాగరాజు, కొత్తపల్లి నవీన్, కర్ల అశోక్, అనం వెంకట్ రెడ్డి, బోయిన కొండలు, వడ్లమూడి నరసయ్య, మేకల అర్జున్, తోట సురేష్, కుమ్మరి నాగమణి తదితరులు పాల్గొన్నారు. కోరుట్లగూడెంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి బచ్చలకూరి నాగరాజు జెర్రీ పోతుల అంజనీ,నేలకొండపల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడవల్లి నాగరాజు తదితరులు పాల్గొన్నారు. తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై 27న ఛలో పార్లమెంట్

• జంతర్ మంతర్ వద్ద ఒక రోజు ధర్నా
• పోస్టర్ ఆవిష్కరించిన టీడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా కమిటీ
• జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్




**ఖమ్మం ప్రతినిధి ప్రజాజ్యోతి** కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాల్సిన జర్నలిస్టుల సమస్యల పై ఈ నెల 27వ తేదీన ఛలో పార్లమెంట్ కార్యక్రమం చేపడుతున్నట్లు,తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఖమ్మం జిల్లా నాయకులు వెల్లడించారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో వాల్ పోస్టర్ ఆవిష్కరణ ఫెడరేషన్ అధ్యక్షులు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్ లు ఛలో పార్లమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ,పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జరుతున్నందున దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి, పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించాలని కోరుతూ,ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో పరిష్కరించాల్సిన జర్నలిస్టుల రైల్వే రాయితీ పాస్ ల పునరుద్దరణ, జర్నలిస్టుల రక్షణకు పార్లమెంట్ లో ప్రత్యేక చట్టం చేయడం, రిటైర్డ్ జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం, జాతీయ మీడియా కమీషన్ ఏర్పాటు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్ మీడియాకు చట్టబద్ధత వంటి డిమాండ్ల ను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధనకై 27న ఢిల్లీలోని పార్లమెంట్ (జంతర్ మంతర్) వద్ద ఒక రోజు ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా జర్నలిస్టులకు రైలు ప్రయాణ చార్జీల్లో 50 శాతం రాయితీ కల్పిస్తూ, దాదాపు పదిహేనేళ్ళ పాటు కొనసాగిన రైల్వే రాయితీని కేంద్ర ప్రభుత్వం కోవిడ్ సందర్భంగా నిలిపివేసిందని, ఈ సదుపాయాన్ని తిరిగి పునరుద్దరించకపోవడంతో దేశవ్యాప్తంగా జర్నలిస్టులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. జర్నలిస్టుల రైల్వే రాయితీ పాసులను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా దేశవ్యాప్తంగా మీడియా రంగం విస్తరించిన నేపథ్యంలో వివిధ సమస్యలను పరిష్కరించేందుకు ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో నేషనల్ మీడియా కమీషన్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. అదేవిధంగా వివిధ రాష్ట్రాలలో అనేకమంది రిటైర్డ్, సీనియర్ జర్నలిస్టులకు ఎటువంటి ఆదాయ వనరులు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయయని, కొన్ని రాష్ట్రాలలో రిటైర్డ్ జర్నలిస్టులకు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ స్కీం అమలు చేస్తున్నప్పటికి జాతీయ స్థాయిలో పెన్షన్ స్కీం లేకపోవడం వల్ల మిగతా రాష్ట్రాలలో ఈ స్కీం అమలుకావడంలేదని, అందుకే దేశవ్యాప్తంగా ఒకే పెన్షన్ విధానం ఉండేలా జాతీయ పెన్షన్ పథకం అమలు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. అనేక రాష్ట్రాలలో జర్నలిస్టులపై జరుగుతున్న దాడులు,హత్యలు, అక్రమ కేసులు వంటి వాటిని అరికట్టేందుకు పార్లమెంట్ లో జర్నలిస్టుల రక్షణ చట్టం తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు. ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలకు పూర్తి స్థాయిలో చట్టబద్ధత కల్పించాలని అన్నారు. అదేవిధంగా పాత్రికేయ సంఘాలకు, జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీలకు ప్రభుత్వ భూముల కేటాయింపును నిరాకరిస్తూ,సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును సమీక్షించి,దేశవ్యాప్తంగా పాత్రికేయులకు ఇళ్ళస్థలాలు కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ డిమాండ్ల సాధనకై 27న జరిగే ఛలో పార్లమెంట్" కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి జర్నలిస్టులు,టీడబ్ల్యూజేఎఫ్ బాధ్యులు పాల్గొంటారని,అదేవిధంగా ఢిల్లీ,యూపీ తదితర రాష్ట్రాలకు చెందిన ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(ఐఎఫ్ డబ్ల్యూజే) నాయకులు కూడా ధర్నాలో పాల్గొంటారని తెలిపారు. ధర్నా అనంతరం పలువురు కేంద్ర మంత్రులు,పార్లమెంటు సభ్యులను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో టిడబ్ల్యూజేఎఫ్ హెచ్-2843 జిల్లా కోశాధికారి వేములకొండ రమేష్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నల్లా రాకేష్ రెడ్డి, సామ్రాట్ గుప్తా,కిరణ్,టీబీజేఏ జిల్లా కార్యదర్శి కాసోజు శ్రీధర్,వీడియో గ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్ష అమరబోయిన ఉపేందర్, లీగల్ అడ్వైజర్ పసుపులేటి శ్రీనివాస్,నగర అధ్యక్షులు ఎలుగోటి వెంకట్, కార్యదర్శి కప్పల మధు గౌడ్, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంతోటి శ్రీనివాస్,గుజ్జు గోపాలకృష్ణ,యాంకర్ కీర్తి,దుబ్బాక శ్రీను, ఎలిసెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి విస్తరణకు
# ప్రజా ప్రభుత్వం పూర్తి మద్దతు

● రేర్ ఎర్త్ మినరల్స్ మైనింగ్‌లోకి సింగరేణి విస్తరించాలి
● సింగరేణి భవిష్యత్తుకు అండగా ప్రజా ప్రభుత్వం
● బొగ్గే కాకుండా.. కొత్త రంగాల్లోకి సింగరేణి విస్తరించాలి
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క






**ఇల్లందు, జులై 24 (ప్రజా జ్యోతి)** సింగరేణిని కాపాడుకోవడానికి, బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ స్థాయికి విస్తరించడానికి ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతుగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం కొత్తగూడెంలోని సింగరేణికి కార్యాలయంలో సింగరేణి, జెన్ కో ఉన్నతాధికారులతో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధి కోసం ప్రభుత్వం తలుపులు 24 గంటలూ తెరిచే ఉంటుందని భరోసా కల్పించారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం స్వరూప స్వభావాలు పూర్తిగా మారబోతున్నాయన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ మినరల్స్, బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగితే, క్రమంగా థర్మల్ విద్యుత్ మరియు బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని సూచించారు. తెలంగాణకు సింగరేణి ఆత్మ వంటిదని, 130 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన సింగరేణి సంస్థ నిలదొక్కుకోవడానికి ప్రభుత్వం మద్దతుగా ఉంటుందని స్పష్టం చేశారు. గతంలో ఉత్పత్తి రంగంలో సింగరేణిది ఏకఛత్రాధిపత్యం ఉండేదన్నారు. ఏ ధర నిర్ణయిస్తే, ఆ ధరకే వినియోగదారులు బొగ్గును కొనుగోలు చేసేవారని గుర్తు చేశారు. నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయిందని, ప్రైవేటీకరణ విపరీతంగా పెరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం బొగ్గు గనుల బహిరంగ వేలం విధానాన్ని తీసుకురావడంతో అనేక ప్రైవేట్ సంస్థలు రంగంలోకి వచ్చాయని పేర్కొన్నారు. దీనితో ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ వారితో పోటీపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రైవేట్ సంస్థలతో నాణ్యత, నిర్వహణా వ్యయాన్ని తగ్గించుకోవడం, ఉత్తమ సేవల్లో పోటీపడి సింగరేణి స్థానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. సింగరేణి ఉత్పత్తి చేసే బొగ్గు నాణ్యత విషయంలో ఏమాత్రం అలసత్వం వహించకూడదని, తవ్వకాల సమయంలో బొగ్గులో మట్టి, రాళ్లు కలవకుండా కఠినంగా పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. బొగ్గు శుద్ధీకరణకు సమర్థవంతంగా నిర్వహించాలని, వేర్వేరు గ్రేడ్ల బొగ్గును సరైన నిష్పత్తిలో బ్లెండింగ్ చేసి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి ముందుచూపు, సుదీర్ఘ ప్రణాళికలు లేకపోవడం వల్ల సింగరేణి.. వేలంలో పాల్గొని నూతన బొగ్గు బ్లాకులను పొందకలేక పోయిందన్నారు. భద్రాద్రి, యాదాద్రి వంటి థర్మల్ పవర్ ప్లాంట్ల నిర్మాణంలో సరైన ప్రణాళికలు రూపొందించలేదని, వాటికి అవసరమయ్యే బొగ్గు బ్లాకులను కేటాయించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ఒడిశాలోని నైనీ బ్లాక్, తాడిచర్ల-2 ప్రాజెక్టులపై ఉన్న భూసేకరణ, అటవీ అనుమతుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వేగవంతం చేసి పరిష్కరించిందని తెలిపారు. సింగరేణి అనేది కేవలం ఒక వ్యాపార సంస్థ మాత్రమే కాదని, వేలాది మంది కార్మిక కుటుంబాల జీవితమన్నారు. సంస్థ లాభాల్లో ఉంటేనే కార్మికుల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని, ప్రతి గని, మైన్ స్థాయిలో మేనేజ్‌మెంట్, కార్మిక సంఘాలు ప్రతి కార్మికుడితో ఓపెన్ చర్చలు ప్రారంభించాలని పేర్కొన్నారు. సంస్థ మనుగడకు తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి సలహాలు, సూచనలు స్వీకరించి అందరిని భాగస్వాములను చేస్తూ ఒక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. రాబోయే 15 - 20 ఏళ్లలో ఇంధన రంగం విపరీతంగా మారబోతోందన్నారు. సోలార్, పంప్డ్ స్టోరేజ్, విండ్, హైడ్రోజన్, రేర్ ఎర్త్ ఆధారిత బ్యాటరీ స్టోరేజ్ వ్యవస్థలు పెరిగే అవకాశం ఉందని, ఇవి పెరిగితే థర్మల్ విద్యుత్, బొగ్గు వినియోగం తగ్గే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో సింగరేణి కేవలం బొగ్గు తవ్వకాలకే పరిమితం కాకుండా ప్రత్యామ్నాయాల వైపు చూడాలని అధికారులకు సూచించారు. సెమీకండక్టర్స్, చిప్స్, ఈవీ బ్యాటరీల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్ వంటి అరుదైన ఖనిజాల మైనింగ్ రంగానికి సింగరేణి విస్తరించాలన్నారు. ఆస్ట్రేలియా, సౌత్ ఆఫ్రికా వంటి దేశాల్లో క్రూషియల్ మినరల్స్ వేలంలో సింగరేణి పాల్గొనాలని సూచించారు. సింగరేణి వద్ద దశాబ్దాల అనుభవం కలిగిన నిపుణులైన ఇంజనీర్లు, మైనింగ్ కార్మికులు ఉన్నారని, ఈ అపారమైన మానవ వనరులను అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టులకు ఉపయోగించాలన్నారు. ఇకపై బోర్డు సమావేశాలు కేవలం రొటీన్ పరిపాలనా అంశాలకే పరిమితం కాకుండా, సంస్థ విస్తరణ, రాబోయే 10 ఏళ్ల రోడ్‌మాప్‌పై సుదీర్ఘంగా చర్చించాలని అధికారులకు సూచించారు. కార్పొరేట్ సంస్థల మాదిరిగా టైమ్ లైన్ క్యాలెండర్ పెట్టుకుని లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## మొహమ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో నీట్ ప్రశ్నాపత్రం లీక్‌కు నిరసనగా కాంగ్రెస్ శాంతియుత ర్యాలీ

సికింద్రాబాద్, జూలై 24(ప్రజాజ్యోతి): నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనలో కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీల అరెస్టును ఖండిస్తూ కాంగ్రెస్



పార్టీ అధిష్ఠానం పిలుపు మేరకు చిలకలగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ జహంగీర్ ఆధ్వర్యంలో చిలకలగూడలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డీసీసీ ఉపాధ్యక్షుడు ఉదయ్ భాస్కర్, వహీద్ ఖాన్, చక్రపాణి, శంకర్, నవీన్, సలీం, సాయి యాదవ్, జగన్, సుభాన్, బబ్లూ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత్‌పై అమెరికా 10% సుంకాలు

**మొదటిపేజీ తరువాయి..**

అమెరికా వాణిజ్య ప్రతినిధి జెమీసన్ గ్రీర్ వెల్లడించారు. మొదట ప్రతిపాదించిన 12.5 శాతం సుంకం నుంచి 10 శాతానికి తగ్గించడంతో భారత్‌కు కాస్త ఊరట లభించింది. భారత్, కెనడా, యూకే, బంగ్లాదేశ్, పాకిస్థాన్ సహా మొత్తం 17 దేశాలకు 10 శాతం కొత్త సుంకాలు వర్తించనున్నాయి. వెట్టిచాకిరీ నిర్మూలనలో విఫలమైనందుకు గానూ జూన్4న ట్రేడ్ యాక్ట్ సెక్షన్ 301 కింద 60 దేశాలపై అదనపు సుంకాలను అమెరికా ప్రకటించింది. అందులో భాగంగా భారత్ సహా 54 దేశాలపై 12.5 శాతం, మరో 6 దేశాలపై 10 శాతం సుంకాలను విధించాలని నిర్ణయించింది. "గత శతాబ్ద కాలంగా అమెరికా వెట్టిచాకిరీ ఉత్పత్తులపై కఠిన నిషేధం అమలు చేస్తోంది. మా వాణిజ్య భాగస్వాములు కూడా దీనిని కచ్చితంగా అమలు చేయాలి" అని యూఎస్ వాణిజ్య ప్రతినిధి జేమిసన్ గ్రీర్ తెలిపారు. ఆ తర్వాత భారత్ తీసుకున్న చర్యలను అమెరికా ఫెడరల్ నోట్ గుర్తించింది. జూన్ 14న బలవంతపు కార్మికులను ఉపయోగించి ఉత్పత్తి చేసిన వస్తువుల దిగుమతిని నిషేధించేలా భారత్ తన విదేశీ వాణిజ్య విధానాన్ని సవరించింది. దీంతో సుంకాన్ని 10 శాతానికి పరిమితం చేస్తూ అమెరికా ప్రకటించింది. మానవ హక్కుల ఉల్లంఘనలు, వక్రీకృత వాణిజ్య విధానాలను సరిదిద్దడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న కార్మికుల సంక్షేమాన్ని మెరుగుపరిచేందుకే ఈ చర్యలు తీసుకున్నట్లు అమెరికా వెల్లడించింది. కొత్తగా విధించిన సుంకాలు వెంటనే అమల్లోకి వస్తాయని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ జేమిసన్ గ్రీర్ వెల్లడించారు. 60దేశాలను రెండు స్లాబులుగా వర్గీకరించినట్లు గ్రీర్ చెప్పారు. 10 శాతం సుంకం పరిధిలోని 17 దేశాలు వస్తాయని వివరించారు. బలవంతపు శ్రమతో తయారయ్యే వస్తువులపై రద్దు లేదా పాక్షిక నిషేధం విధించిన 17 దేశాలను ఈ కేటగిరిలో ఉంచారు. భారత్‌తో పాటు బ్రిటన్, కెనడా, బాంగ్లాదేశ్, ఇండోనేషియా, మెక్సికో, పాకిస్తాన్, శ్రీలంక, కంబోడియా, జొర్డాన్, మలేషియా, సెంట్రల్ అమెరికా దేశాలు ఈ జాబితాలో ఉన్నాయి. మిగిలిన దేశాలను 12.5 శాతం సుంకం పరిధిలోకి తెచ్చారు. అమెరికా నిబంధనలను పాటించని రెండో కేటగిరి దేశాల జాబితాలో ఐరోపా యూనియన్, జపాన్, దక్షిణ కొరియా, తైవాన్, స్విట్జర్లాండ్ వంటివి ఉన్నాయి. గతంలో డొనాల్డ్ ట్రంప్ తన ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగించి పలు దేశాలపై రెసిప్రోకల్ ట్యాక్స్ విధించారు. అయితే, ఆ నిర్ణయం చట్టవిరుద్ధమని అమెరికా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. దీంతో ట్రంప్ ప్రత్యామ్నాయంగా 1974 వాణిజ్య చట్టంలోని 'సెక్షన్ 301' నిబంధనను ఆయుధంగా మలుచుకుంది. ఈ చట్టం కింద యూఎస్‌టీఆర్ మార్చిలో 60 దేశాల వాణిజ్య విధానాలపై విచారణ ప్రారంభించింది. 45కి పైగా ప్రభుత్వాలతో చర్చలు జరిపి, 1,600కి పైగా లిఖితపూర్వక అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలిపింది. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ 2.76 కోట్ల మంది వెట్టిచాకిరి బారిన పడుతున్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) 2021 నాటి గణాంకాలు చెబుతున్నాయి. 'ది హ్యూమన్ ట్రాఫికింగ్ లీగల్ సెంటర్' వ్యవస్థాపకురాలు మార్టినా వాండెన్‌బర్గ్ ఈ అంశంపై మాట్లాడారు. ఈ పన్ను వెనుక రాజకీయ లేదా ఆర్థిక ప్రయోజనాలు ఉన్నప్పటికీ, ప్రపంచవ్యాప్తంగా సరఫరా వ్యవస్థల్లో మానవ హక్కులు, వెట్టిచాకిరీపై అవగాహన పెరగడానికి, దేశాలు కొత్త నిషేధ చట్టాలు తీసుకురావడానికి ఇది దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.

## నౌకలు, కార్గోలకు భారీ నష్టం వాటిల్లుతుంది

**మొదటిపేజీ తరువాయి..**

చెల్లించేందుకు అమెరికా తమ అధీనంలో ఉన్న ఇరాన్ డబ్బును వినియోగిస్తుంది. ఈ నష్టపరిహారాలు చాలా భారీగా ఉండవచ్చు. అయినప్పటికీ ఇది న్యాయమైన, నిష్పాక్షికమైన చర్య. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఇది అమల్లో ఉంటుంది" అని ట్రంప్ పోస్ట్‌లో పేర్కొన్నారు.



ఇరాన్‌ను అణ్వాయుధాలు కలిగి ఉండటానికి అనుమతించకూడదని డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. అందుకోసం వాషింగ్టన్ అత్యంత అద్భుతంగా పనిచేస్తోందన్నారు. ఇరాన్‌కు కొన్ని దురుద్దేశాలు ఉన్నాయని, అందుకే వారి దగ్గర అణ్వాయుధాలు ఉండనివ్వకూడదని స్పష్టం చేశారు. అణ్వాయుధాలు గురించి కనీసం ఆలోచించడానికి కూడా ఇరాన్‌ను అనుమతించకూడదని వార్నింగ్ ఇచ్చారు. గతంలోనే ఇతర అమెరికా అధ్యక్షులు లేదా ఇతర దేశాలు ఇరాన్ వద్ద అణ్వాయుధాలు లేకుండా చేసి ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. వేరే ఎవరూ చేయలేకపోయిన ఆ పనిని తాను చేసి చూపిస్తానని అన్నారు. తన మొదటి అధ్యక్ష పదవీకాలంలో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన సైన్యాన్ని నిర్మించానని పేర్కొన్నారు. ఇప్పుడు తాను ఊహించిన దానికంటే ఎక్కువగా సైన్యాన్ని ఉపయోగిస్తున్నామని అన్నారు. వాషింగ్టన్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఈ మేరకు ట్రంప్ వ్యాఖ్యానించారు.

# నేడే తొలి ఏకాదశి పర్వదినం



- హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి పండుగ ఈ ఏకాదశి
- దీనినే దేవ శయన ఏకాదశి , ప్రథమ ఏకాదశి, హరివాసరం అని కూడా అంటారు
- ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుండి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కనిపిస్తాడు
- శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి శిష్యులు శ్రీ వైష్ణవ సేవా సంఘ సభ్యులు శ్రీ మాన్ సేనాపతి ప్రవీణ్ కుమార్ ఆచార్యులు

నిర్మల్ జిల్లా ప్రతినిధి , జులై 24 ,( ప్రజాజ్యోతి ):

**తొలి ఏకాదశి లేదా శయన ఏకాదశి.**

తొలి ఏకాదశి అంటే ఏమిటి , ఎందుకు చేసుకుంటారు , దీని విశిష్టత ఏంటి.అనే విషయాలను గురించి మనకు శ్రీ శ్రీ శ్రీ శ్రీమన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి వారి శిష్యులు శ్రీ వైష్ణవ సేవా సంఘ సభ్యులు శ్రీ మాన్ సేనాపతి ప్రవీణ్ కుమార్ ఆచార్యులు ప్రజాజ్యోతితో మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి ఏకాదశి పండుగలకు ఆది. తెలుగు సంవత్సరంలో అన్ని పండగలను వెంటపెట్టుకోచ్చే తొలి ఏకాదశి విశిష్టత ఏంటో ఆచార్యులు తెలియచేశారు.

**తొలి ఏకాదశి – విశిష్టత**

ఆషాఢ మాస ఏకాదశి తొలి ఏకాదశిగా (ఆషాఢ శుద్ధ ఏకాదశిగా) జరుపుకుంటారు. దీనినే "శయన ఏకాదశి , ప్రథమ ఏకాదశి", "హరివాసరం" అని కూడా అంటారు. ఈ రోజు నుంచీ శ్రీ మహావిష్ణువు క్షీరాబ్ధి యందు శేషపాన్పు పైన శయనిస్తాడు. కనుక దీన్ని "శయన ఏకాదశి" అంటారు. నిజానికి ఒకరకంగా పరిశీలిస్తే , ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు (పంచ భూతాలు , సూర్య చంద్రులు , గ్రహాలు పరస్పర సంబంధాన్నీ , వాటి గమనాన్ని బట్టి) సంకేతంగా చెప్పుకోవచ్చు. ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుండి దక్షిణ దిశకు



వాలుతున్నట్టు కనిపిస్తాడు ( సూర్యుడు దక్షణం వైపుకు మరలినట్లు , ఈ రోజు నుంచి దక్షణాయన ప్రారంభాన్ని సూచిస్తుంది). అంతేగాక చాతుర్మాస్య వ్రతం కూడా ప్రారంభమౌతుంది. ఇదే రోజున గోపద్మ వ్రతమును ఆచరిస్తారు. ఈ వ్రతాన్ని ఈ రోజు మొదలుకొని , కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు అంటే క్షీరాబ్ధి ద్వాదశి వరకు ఆచరించవలెనని పురాణాలు చెబుతున్నాయి.

**తొలి ఏకాదశి జరుపుకొను విధానం నియమాలు.**

మహిమాన్వితమైన ఈ ఏకాదశి పర్వదినాన వ్రతాన్ని ఆచరిస్తే సూర్యచంద్ర గ్రహణములలో భూమి దానాలిచ్చినంత , అశ్వమేధ యాగం చేసినంత , అరవై వేల సంవత్సరాలు తపస్సు చేసినంత పుణ్యం లభిస్తుందని ఏకాదశి వ్రత మహత్యాన్ని గురించి మన పురాణాలు చెబుతున్నాయి. మహాసాధ్వీ సతీ సక్కుభాయి ఈ వ్రతాన్నే ఆచరించి మోక్ష సిద్ధి పొందటం జరిగింది. వ్రతంలోని ప్రధాన నియమాలు.

**ఉపవాస ఫలితాలు.**

ఈ వ్రతాన్ని ఆచరించదలచినవారు దశమి నాడు రాత్రి నిహారులై ఉండి ఏకాదశి నాడు సూర్యోదయానికి ముందుగా కాలకృత్యాలు తీర్చుకుని శ్రీహరిని పూజించాలి. ఆ రోజు మొత్తం ఉపవాసం ఉండాలి. ఆ రోజు రాత్రంతా జాగరణ చేయాలి. మర్నాడు అనగా ద్వాదశి నాడు ఉదయాన్నే కాలకృత్యాదుల అనంతరం శ్రీహరిని పూజించి నైవేద్య తాంబూలాలు సమర్పించి భోజనం చేయాలి.


**ఏకాదశి వ్రతమాచరించేవారు ఇవి తినరాదు.**

ఆషాఢమాస తొలి ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే లేచి , శుచిగా స్నానమాచరించి , శ్రీహరి నిష్ఠ నియమాలతో పూజించాలి. పూజ గదిని శుభ్రం చేసుకుని విష్ణుమూర్తి ప్రతిమకు లేదా పటానికి పసుపు , కుంకుమలు పెట్టి పుష్పాలతో అలంకరించుకోవాలి. ఏకాదశి వ్రతమాచరించే వారు కాల్చి వండినవి , మాంసాహారం , పుచ్చకాయ , గుమ్మడి కాయ , చింతపండు , ఉసిరి , ఉలవలు , మినుములు తీసుకోకూడదు. అదేవిధంగా మంచంపై శయనించడం చేయకూడదని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఏకాదశి విశిష్టతను గురించి పద్మ పురాణంలో వివరించారు. అష్టకష్టాలతో తల మునకలౌతున్న మానవజాతిని ఉద్ధరించటానికి సాక్షాత్ శ్రీహరే ఈ ఏకాదశిని ఏర్పాటు చేసాడనీ , ఈ వ్రతాన్ని నియమనిష్టలతో ఆచరించిన వారు సమస్త వ్యధల నుంచీ విముక్తి పొందగలరనీ , మరణానంతరం వైకుంఠ ప్రాప్తి లభిస్తుందనీ పద్మ పురాణంలో పేర్కొన్నారని చెప్తుంటారు.

ఈరోజు నుండి కార్తిక శుద్ధ ఏకాదశి వరకు 'చాతుర్మాస్య వ్రతం' అవలంబిస్తారు. శాకాహారులై ఉపవాస వ్రతం ఆచరించాలన్నది , ఈ చాతుర్మాస్య వ్రత నియమం. ఏకాదశినాడు ఉపవసించి , మర్నాడు పారణ చేసి , ప్రసాదం తీసుకొని వ్రతం ముగిస్తారు. ఇది ముఖ్యంగా రైతుల పండుగ. ఏరువాక లాగే తొలి ఏకాదశిని వేడుక చేసుకుంటారు. అతివృష్టి , అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని , పైరుకు ఏ రకమైన తెగుళ్ళు సోకకూడదని , ఇతరత్రా ఏ సమస్యలూ ఎదురవకూడదని దణ్ణం పెట్టుకుంటారు. తొలి ఏకాదశి పండుగ నాడు మొక్కజొన్న పేలాలను మెత్తటి పొడిగా దంచి , అందులో నూరిన బెల్లం కలిపి దేవుడికి నైవేద్యంగా సమర్పించి , ప్రసాదంగా తీసుకుంటారు. తొలి ఏకాదశినాడు ఈ పేలపిండిని తప్పకుండా తినాలని విశ్వసిస్తారు.

**ప్రాశస్త్యం**

ముఖ్యంగా ఆషాఢమాసం వచ్చే తొలి ఏకాదశి రోజున ఒంటి పూట భోంచేసి , శేషశాయి అయిన లక్ష్మీ నారాయణ మూర్తిని స్తుతిస్తే కోటి పుణ్యాల ఫలం లభిస్తుందని విశ్వాసం. ఆషాఢమాసము శుక్లపక్ష ఏకాదశి నాడు విష్ణుమూర్తి పాలకడలిపై యోగనిద్రలోకి వెళ్ళే సందర్భాన్ని తొలిఏకాదశిగా పరిగణిస్తారు. స్వామి నిద్రించే రోజు కాబట్టి దీనిని శయన ఏకాదశి అని కూడా అంటారు. సతీ సక్కుబాయి ఈ శయన ఏకాదశి నాడే మోక్ష ప్రాప్తి పొందింది. తొలిఏకాదశి నాడు రోజంతా ఉపవాసం ఉండి , రాత్రికి జాగారం చేసి , మర్నాడు ద్వాదశినాటి ఉదయం విష్ణుమూర్తిని పూజించి తీర్థప్రసాదాలను స్వీకరించి ఆ తర్వాత భోజనం చేస్తే జన్మజన్మల పాపాలు ప్రక్షాళనమవుతాయని నమ్మకం. ఆ రోజు యోగనిద్రకు ఉపక్రమించే విష్ణువు మళ్ళీ నాలుగు నెలల తర్వాత కార్తీక శుద్ధ ఏకాదశి నాడు మేల్కొంటాడంటారు. దానిని ఉత్థాన ఏకాదశి అంటారు. ఆ తర్వాత రోజు వచ్చే ద్వాదశినే క్షీరాబ్ధి ద్వాదశి అంటారు. ఈ నాలుగు నెలల కాలాన్నీ పవిత్రంగా పరిగణించి అందరూ చాతుర్మాస్యదీక్ష చేస్తారని ప్రవీణ్ కుమార్ ఆచార్యులు తెలిపారు.



# పీక్ అవర్లలో బస్సులకు బ్రేక్

### ట్రావెల్స్ నిర్వాహకులకు గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక

### నో ఎంట్రీ వేళల్లో భారీ బస్సులకు అనుమతి లేదు – నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

రంగారెడ్డి జూలై 24 (ప్రజాజ్యోతి) నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో గచిబౌలి ట్రాఫిక్ పోలీసులు ప్రైవేట్ ట్రావెల్స్ బస్ ఆపరేటర్లతో కీలక సమావేశం నిర్వహించారు.షేర్ లింగంపల్లి జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్



(డీసీపీ) ఎస్. రవికుమార్, ఐపీఎస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ హన్మంతరావు, మాధాపూర్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ కె. చంద్రశేఖర్ రెడ్డి, గచిబౌలి, కొల్లూరు ట్రాఫిక్ స్టేషన్ హౌస్ ఆఫీసర్లు, గచిబౌలి ట్రాఫిక్ అదనపు ఇన్స్పెక్టరతో పాటు పలువురు ట్రావెల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.పీక్ అవర్లలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూడడంతో పాటు ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నోటిఫై చేసిన 'నో ఎంట్రీ'



సమయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ భారీ ట్రావెల్స్ బస్సులు నగరంలోకి ప్రవేశించరాదని స్పష్టం చేశారు. ఆ సమయంలో ప్రయాణికుల రవాణా అవసరమైతే మినీ షటిల్ వాహనాల ద్వారా పికప్, డ్రాప్ సదుపాయం కల్పించాలని సూచించారు.అలాగే విధుల్లోకి వెళ్లే ముందు ప్రతి డ్రైవర్‌కు తప్పనిసరిగా మద్యపాన పరీక్షలు నిర్వహించాలని, మద్యం సేవించిన డ్రైవర్లతో వాహనాలు నడపించరాదని ఆదేశించారు. డ్రైవర్లందరూ చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాల ఫిట్‌నెస్‌ను ఎప్పటికప్పుడు నిర్వహించాలని, ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.ట్రాఫిక్ నిర్వహణలో పోలీసులకు పూర్తి సహకారం అందించాలని, ప్రమాదాల నివారణకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అధికారులు ట్రావెల్స్ నిర్వాహకులకు సూచించారు. నో ఎంట్రీ నిబంధనలు, డ్రంకెన్ డ్రైవింగ్ లేదా ఇతర ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.నగరంలో సురక్షితమైన, సుగమమైన ట్రాఫిక్ వ్యవస్థ కోసం ట్రావెల్స్ నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకుని పనిచేయాలని గచిబౌలి ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## నగరంలో నేడు వనమహోత్సవం

### ఒక్కో కుటుంబానికి పండ్ల మొక్కలు పంపిణీ

హైదరాబాద్,జులై 24(ప్రజాజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'వన మహోత్సవం-2026' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలోని అర్బన్ ఫారెస్ట్రీ విభాగం ప్రజల భాగస్వామ్యంతో నగర హరితాభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం సాయంత్రం 4.00 గంటలకు తార్నాకలోని మర్రి లక్ష్మారెడ్డి ఫంక్షన్ హాల్ లో తారక సేవా సమాఖ్య (ఎన్‌జీఓ) సహకారంతో ప్రతి కుటుంబానికి ఐదు ఉచిత పండ్ల, ఔషధ, అలంకరణ మొక్కలు పంపిణీ చేయనున్నట్లు ఉద్యానవన శాఖ సహాయ సంచాలకులు చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ఫ్రీ-ఫ్లో మోడ్‌లో బ్యారేజీలు

**మొదటిపేజీ తరువాయి..**

విధానంలో నిర్వహిస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ఈ. శ్రీధర్, టన్నెల్ నిపుణుడు కల్నల్ పరిక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్ పాటు పలువురు సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. భవిష్యత్తులో నీటి నిల్వ, పంపింగ్ కార్యకలాపాలు ప్రారంభించాలా వద్దా అన్న అంశంపై కేవలం రాజకీయ ఒత్తిళ్లు లేదా పైకి కనిపించే పరిస్థితుల ఆధారంగా కాకుండా, అర్హత కలిగిన సాంకేతిక సంస్థల లిఖితపూర్వక సిఫారసుల ఆధారంగానే నిర్ణయం తీసుకుంటామని మంత్రి తేల్చిచెప్పారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖకు పంపే లేఖలో ఎన్‌డీఎస్‌ఏ నివేదికలోని కీలక సిఫారసులు, గత సాంకేతిక పరిశీలనల వివరాలు, కేంద్ర జల సంఘం నివేదికలు, గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ పరీక్షల ఫలితాలు, రాఫ్ట్ ఫౌండేషన్ కింద గుర్తించిన ఖాళీల వివరాలు, ఫోటోలు, ఇతర ఇంజినీరింగ్ ఆధారాలు అన్నింటినీ జతచేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీలను ఎందుకు నీటి నిల్వకు, పంపింగ్‌కు వినియోగించడం లేదన్న విషయాన్ని పూర్తి సాంకేతిక ఆధారాలతో కేంద్రానికి వివరించి, సమర్థ సాంకేతిక సంస్థల నుంచి అధికారిక అభిప్రాయం కోరాలి. ప్రభుత్వ నిర్ణయం మొత్తం అధికారిక రికార్డులో ఉండాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. జల్ శక్తి మంత్రిత్వ శాఖలోని ఉన్నతాధికారులకు వెంటనే అందేలా రాష్ట్ర ప్రభుత్వ రెసిడెంట్ కమిషనర్ ద్వారా లేఖను స్వయంగా అందజేయాలని కూడా మంత్రి ఆదేశించారు. సమీక్ష సందర్భంగా అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం, ఇటీవల కేంద్ర జల్ శక్తి మంత్రి చేసిన ప్రకటనలు, మంత్రిత్వ శాఖ నుంచి వచ్చిన లేఖలు సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలే బ్యారేజీల నిర్వహణపై నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నప్పటికీ, ఎన్‌డీఎస్‌ఏ నివేదికలో స్పష్టంగా సూచించిన 'ఫ్రీ-ఫ్లో విధానంలో కొనసాగించాలి' అనే అంశంపై ప్రత్యేకంగా ఎలాంటి మార్గదర్శకాలు ఇవ్వలేదని వివరించారు. మంత్రి మాట్లాడుతూ, కాళేశ్వరం బ్యారేజీలపై జరుగుతున్న ప్రతి శాస్త్రీయ పరిశీలన, ప్రతి సాంకేతిక పరీక్ష కేంద్ర ప్రభుత్వం, ఎన్‌డీఎస్‌ఏ సూచనల ప్రకారమే నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజల భద్రత, నిర్మాణాల స్థిరత్వం, శాస్త్రీయ ప్రమాణాల విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడదని స్పష్టం చేశారు. బ్యారేజీల పునరుద్ధరణ పనులపై జరిగిన సమీక్షలో అధికారులు మంత్రి దృష్టికి కీలక అంశాలను తీసుకువచ్చారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ తాజా జీపీఆర్ పరీక్షలు, ఇతర సాంకేతిక సమాచారం విశ్లేషణను తుది దశకు తీసుకెళ్లిందని తెలిపారు. అలాగే అన్నారం బ్యారేజీ రాఫ్ట్ ఫౌండేషన్ కింద కూడా ఖాళీలు ఉన్నట్లు సూచించే సాంకేతిక ఆధారాలు లభించాయని, ప్రస్తుత పరిస్థితుల్లో అక్కడ కూడా నీటిని నిల్వ చేయడం సురక్షితం కాదని అధికారులు వివరించారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967